thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 284 కరీంనగర్ ఆదివారం, 21 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

న్యూఢిల్లీ : గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించ డానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది.

ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

# రెండు నెలలుగా 600 మంది సరెండర్.!

-100 మంది ఎన్కౌంటర్లో మృతి
-దెబ్బతింటున్న మావోయిస్ట్ పార్టీ
-ఆయుధాలతో పాటు పార్టీకి దూరం
-మల్లోజుల ఎఫెక్ట్ కంటిన్యూ





**కందుకూరి ప్రకాశ్ - పెద్దపల్లి, డిసెంబర్ 20**

తెలంగాణలో ,ఛత్తీస్ ఘడ్,మహా రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ లలో భారీగా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు.సాయుధ పోరాట విరమణ చేసిన మావోయిస్టులు మల్లోజుల వేణుగోపాల్ తో పాటుగా తక్కళ్లపల్లి వాసుదేవరావు లు పొరుగు రాష్ట్రంలో లొంగిపోయింది విదితమే . అయితే ఇద్దరు మావోయిస్టు అగ్రనేతల పిలుపు మేరకే డీకే దాదాపు ఖాళీ అవుతున్న కొద్దీ మరో వైపు కేంద్రం కూడా కగార్ ఆపరేషన్ ను వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలో మావోయిస్ట్ పార్టీ నాయకత్వం తీవ్రంగా కలవరపడుతున్నది.అగ్రనేతల బాటలో పయనిస్తోన్నా నాయకులు పెద్దసంఖ్యలో ఇంటి బాట పడుతున్నారు. అన్నీ రాష్ట్రాలను కలుపుకుని లెక్కిస్తే లొంగిపోయిన వారి ఇటీవలి సంఖ్య 600 కు చేరింది.అందులో తెలంగాణ నుంచి వంద మందికి పైగా ప్రభుత్వానికి లొంగిపోయారు. తెలంగాణ లో తాజాగా 41 మంది మావోయిస్టులు శుక్రవారం డీజీపీ శివధర్ రెడ్డి ముందు సరెండర్ అయ్యారు.

మావోయిస్టులు లొంగిపోవడంపై డీజీపీ మీడియాతో మాట్లాడుతూ... 24 ఆయుధాలతో 41 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయినట్లు తెలిపారు. ఏకే-47లు 3, ఎల్ఎమ్‌జీ 1, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు 5, ఇన్సాస్ రైఫిళ్ళు 7, బీజీఎల్ గన్ 1, 303 రైఫిళ్ళు 4, సింగిల్ షాట్ రైఫిల్ 1 , ఎయిర్ గన్స్ 2 మొత్తం 24 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లొంగిపోయిన 41 మందిలో ఇద్దరు తెలంగాణ వారు కాగా.. 39 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు ఉన్నారన్నారు. అలాగే 11 మంది గెరిల్లా ఆర్మీ బెటాలియన్ చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. 24 ఏళ్లుగా అండర్ గ్రౌండ్‌లో ఉన్న తెలంగాణకు చెందిన ఎర్రోల్ల రవి అలియాస్ సంతోష్, ప్రవీణ్ లొంగిపోయారని అన్నారు. అలాగే కనికారుపు ప్రభంజన్ పార్టీ సభ్యుడు, పీడీఎస్ సభ్యుడు, రెండో రీజినల్ కమాండ్ ఆఫ్ తెలంగాణకు చెందిన 5 మంది, కొత్తగూడెం, అల్లూరు సీతరామరాజు డీవీసీ స్టేట్ కమిటీ క్యాడర్‌కు చెందిన నలుగురు సరెండర్ అయినట్లు చెప్పారు.

అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు లొంగుపోయారని డీజీపీ వెల్లడించారు. ప్రాణాలు కాపాడుకోడానికి తెలియని ప్రదేశాలకు వెళ్లాలని మావోయిస్టు పార్టీ ఒత్తిడి చేసిందని.. ఇలాంటి పరిస్థితుల్లో వేరే ప్రాంతాలకు వెళ్లడం కష్టంగా భావించి మావోలంతా లొంగిపోయినట్లు తెలిపారు. డివిజనల్ కమిటీ సభ్యులకు రూ. 4 లక్షలు, సభ్యులకు రూ.4 లక్షల రివార్డు అందజేస్తున్నామన్నారు. ఆయుధాలతో లొంగిపోతే వారికి మరింత నగదును రివార్డ్స్ కింద అందజేస్తున్నామని చెప్పారు. కోటి 47 లక్షల రివార్డ్స్ అందిస్తున్నామని.. తక్షణ సహాయం కింద రూ.25 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణాలో ఈ ఏడాది 509 మంది మావోయిస్టులు లొంగిపోయారన్నారు. తెలంగాణకు చెందిన 54 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 5 మంది సెంట్రల్ కమిటీలో ఉన్నారని , 8 మంది స్టేట్ కమిటీలో ఉన్నారన్నారు. అలాగే 13 మంది డివిజన్ కమిటీ , 12 మంది కిందిస్థాయిలో సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. వీరిలో 48 మంది వేరే రాష్ట్రాల్లో పని చేస్తున్నారని.. ఏడుగురు మాత్రమే తెలంగాణలో ఉన్నట్లు గుర్తించినట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

**తెలంగాణ రాష్ట్రంలో లొంగుబాట్లకు సానుకూలం.!!...** తెలంగాణ రాష్ట్ర పోలీస్ లకు లొంగిపోతున్న వారిలో మెజార్టీ సభ్యులు ఛత్తీస్ ఘడ్ నుంచి వచ్చిన మావోయిస్టులు ఉన్నారని చెప్పవచ్చు.ఆ రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలపై డీఆర్జీ (మాజీ సల్వాజుడుం) నిఘా ఉంచారు.దీంతో మావోయిస్టులు డీఆర్జీ కి కంట పడితే కాల్చిపారేస్తున్నారు.ఈ కారణాల వల్లే పొరుగు రాష్ట్రాల మావోలు తెలంగాణను సేఫ్ గా చూస్తున్నారని చెబుతున్నారు తెలంగాణ పోలీసులు కూడా లొంగుబాటుకు ప్రోత్సాహం చేయడం విశేషం








తెలంగాణ బీజేపీలో సినీ గ్లామర్ మరోసారి చర్చగా మారింది. తాజాగా ఆ పార్టీలో నాటి స్టార్ హీరోయిన్ ఆమని చేరారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ స్టేట్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ సభ్యత్వం అందజేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక చేసిన ప్రజా పోరాటాల విషయంలో అటుఇటు అన్నట్లు నెమ్మదిగా పోరాటాలు సాగిస్తున్న బీజేపీ ఇప్పుడు సినీ తారలను పార్టీలో చేర్చుకునేందుకు మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ కు తెర లేపడంతో తెలంగాణలో బీజేపీ వ్యూహం ఏంటి అనేది ఆసక్తి రేపుతోంది.

**పార్టీ కండువా కప్పుకున్న స్టార్ హీరోయిన్:** ఆమని బాటలో మరికొంత మంది స్టార్ యాక్టర్స్ బీజేపీలో చేరబోతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బీజేపీ ఇదే తరహా సినీ గ్లామర్ టచ్ ఇచ్చే ప్రయత్నం చేసింది. జయసు ధ, విజయశాంతి, జీవిత రాజశేఖర్?తో పాటు మరికొంత మంది కాషాయదళంలో చేరారు. వీరితో పాటు జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్ వంటి సెలబ్రెటిల ఇంటికి నేరుగా బీజేపీ అగ్రనేతలు వెళ్లడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశం అయింది. దర్శక దిగ్గజం రాజమౌళి తండ్రి విజేయేంద్రప్రసాద్?ను ఏకంగా రాజ్యసభకు పంపింది. ఇలా పలువురు సినీ తారలను, సినీ రంగ ప్రముఖులను పార్టీలో చేర్చుకోవడం ద్వారా పార్టీలో పాజిటివ్ వైబ్ తెప్పించే ప్రయత్నం చేసింది. అయితే వీరిలో విజయశాంతి బీజేపీ నుంచి కాంగ్రెస్?లో చేరి ఎమ్మెల్సీ చాన్స్ కొట్టేశారు. ఎన్నికల తర్వాత రాజకీయ నాయకులను పార్టీలోకి చేర్చుకుంటూ వస్తున్న బీజేపీ సడెన్ గా సినీతారలవైపు ఫోకస్ పెట్టడంతో కలమనాథులు వ్యూహం ఏమిటి? అనేది ఆసక్తి రేపుతోంది.



## సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

హైదరాబాద్, డిసెంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పసలేని, తెలివి తక్కువ వాళ్ళు బీఆర్ఎస్ తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని మండిపడ్డారు. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై కూడా అడిగారని గుర్తుచే శారు. పసలేని వాళు తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరా ల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు , కార్పొరేషన్ల విలీనం చేశారని.. దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ , ఇతర అంశాలను సాకుగా చూపి కాంగ్రెస్‌లోకి రావాలని కోరుతున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వం చేసేది ఏం ఉండదన్నారు. గ్రామంలోని ప్రతి అభివృద్ధికి కేంద్ర నిధులే ప్రధానమని స్పష్టం చేశారు. బీజేపీలో గెలిచిన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల మీద అవగాహన ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## 'ఉపాధి హామీ' పేరు మార్పును వ్యతిరేకిస్తూ.. పీసీసీ ఆధ్వర్యంలో నిరసన

హైదరాబాద్: ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ నగరంలో కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ఎంజీ రోడ్‌లో పీసీసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసనలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, వివేక్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, వీహెచ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం పేరు చెబితే భాజపా నేతల గుండెల్లో రైళ్లు పరుగెడతాయన్నారు. గాడ్సేని పూజించే వారు కాబట్టే గాంధీ పేరు తొలగించారని మండిపడ్డారు.

" గాంధీ కుటుంబాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యం మోదీ, అమిత్‌షాకు లేదు. గాంధీ పేరు చిరస్మరణీయం. ప్రజలకు 100 రోజుల ఉపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన భాజపా ఈ పథకానికి నిధుల కోత పెడుతూ వస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం అప్రజాస్వామికం. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు భాజపా తెరలేపింది. సోనియా గాంధీ కుటుంబంపై కక్ష పూరితంగా కేసులు పెడుతున్నారు. లౌకికవాద దేశంలో మోదీ, అమిత్ షా పప్పులు ఉడకవు. కులాలు, మతాల పేరిట రాజకీయం చేసేవారికి గుణపాఠం తప్పదు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.



# మీ వల్లే గెలవాల్సిన చోట్ల ఓడిపోయాం..

## బంధుప్రీతితో రెబల్స్‌ను బుజ్జగించలేకపోయారు!

## ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి సీరియస్ క్లాస్!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో అత్యంత కీలకమైన పల్లె పోరు ముగిసింది. మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్నే అందించాయి. రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుడి తీర్పు హస్తంవైపు మొగ్గు చూపినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ భారీ విజయం వెనుక ఉన్న ఉత్సాహాన్ని పక్కనపెట్టి పార్టీలోని అంతర్గత లోపాలను సరిదిద్దే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమగ్నమయ్యారు. గెలిచామన్న గర్వం కంటే, పార్టీ క్రమశిక్షణే ముఖ్యం అన్నట్టుగా అధిష్ఠానం వ్యవహరించిన తీరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**సంఖ్యల సాక్షిగా... కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యం..** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురు వేసింది. మూడు విడతల ఎన్నికల సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంటూ సుమారు 56 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. తుది లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12, 733 పంచాయతీ సర్పంచి పదవులకు గానీ దాదాపు ఏడు వేలకుపైగా కాంగ్రెస్ మద్దతు దారులు గెలుచుకున్నారు.

**30 జిల్లాల్లో క్లీన్ స్వీప్.. సిద్ధిపేట ఒకటే మినహాయింపు...** రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో ఎన్నికల కోలాహలం నెలకొనగా, కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని చాటుకుంది. ఒక్క సిద్ధిపేట జిల్లా మినహా, మిగిలిన 30జిల్లాల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. ముఖ్యంగా నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్నగర్ వంటి కీలక జిల్లాల్లో కాంగ్రెస్ క్వీన్ స్వీప్ చేసింది. అయితే ఇంత ఘన విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం పార్టీ వైఫల్యాలపై లోతైన విశ్లేషణ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షితో కూడిన బృందం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఫలితాలపై సమీక్ష నిర్వహించింది. ఈ క్రమంలో కొందరు ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 18 మంది ఎమ్మెల్యేల పని తీరుపై రేవంత్ రెడ్డి గుర్రుగా ఉన్నట్టు సమాచారం. పార్టీ గెలిచినా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక నేతల మొండివైఖరి వల్ల పార్టీకి నష్టం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారని తెలుస్తోంది.

**రెబల్స్ నిర్వహణలో వైఫల్యం, బంధు ప్రీతిపై ఆగ్రహం...** ఈ సమీక్షలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా నిలబడిన రెబల్ను బుజ్జగించడంతో, వారిని సమన్వయం చేయడంలో దాదాపు 16 మంది ఎమ్మెల్యేలు విఫలమయ్యారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దీని వల్ల ఓట్లు చీలి పార్టీకి తీరని నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. బంధు ప్రీతిపై ఆగ్రహం:- కొందు నియోజకవర్గ ఇన్చార్జ్లు, ఎమ్మెల్యేలు తమ సొంత బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని అధిష్ఠానం తీవ్రంగా తప్పుపట్టింది. అర్హులైన కార్యకర్తలను కాదని, బంధువులకు టికెట్ ఇవ్వడం పార్టీ నియమ నిబంనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. భవిష్యత్లో ఇలాంటివి రిపీట్ అయితే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి , నియమ నిబంధనలు పాటిస్తూ పని చేయాలని తమ వైఖరి మార్చుకోవాలని ఆదేశించారు. అధికారంలో ఉన్నామన్న అశ్రద్ధ పనికిరాదని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు.

**అధికారం అంటే బాధ్యత, అలంకారం కాదు...** తెలంగాణ పంచాయతీ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు తిరుగులేని బలాన్ని ఇస్తే, మరోవైపు అంతర్గత ప్రక్షాళనకు అవసరమైన సంకేతాలను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ విజయాన్ని కేవలం అంకెల్లోనే చూడటం లేదు. క్షేత్రస్థాయిలో నాయకత్వవ జవాబుదారీతనాన్ని కోరుకుంటోంది. ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకపోతే భవిష్యత్లో పార్టీ నుంచి కఠిన చర్యలు తప్పవు అన్న సందేశం సమావేశం ద్వారా స్పష్టమైంది.

చురకలు






## అనుమానాస్పద కాల్స్ వస్తే 1930కి కాల్ చేయండి : సీపీ సజ్జనార్

హైదరాబాద్, డిసెంబర్ 20: ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. ఈ సైబర్ మోసాల కారణంగా హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వ ృద్ధులు, రిటైడ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయండి. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందరరేగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం. మధుర నగర్ పోలీస్ స్టేషన్ ను త్వరలోనే ప్రజలకి అనువుగా అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తామని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి సిట్ కార్యాలయం విషయంలో ఆలోచన చేస్తున్నామని, ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్ లోనే ఫోన్ ట్యాపింగ్ సంబంధించి విచారణ సాగుతుందని తెలిపారు. మరోవైపు ఐ బొమ్మ రవి కేసు గురించి అడిషనల్ సీపీ శ్రీనివాస్ పలు విషయాలను వెల్లడించారు. 'ఐ బొమ్మ రవి విచారణ జరుగుతుంది. సమాధానాలు చెప్పడంలేదని బయట ఊహాగానాలు వస్తున్నాయి. మా స్టైల్ లో మేము విచారణ చేస్తున్నాము. అతని నుండి సమాధానాలు రాబడుతున్నాం' అని ఆయన వెల్లడించారు.

## కొత్త సిట్ విచారణ.. కీలక అంశాలపై ఫోకస్



హైదరాబాద్, డిసెంబరు20 : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ఇవాళ (శనివారం) నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో నిన్న (శుక్రవారం) హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఈ సూచనల మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారంగా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## 21న కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ కీలక సమావేశం



హైదరాబాద్: తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు. నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం.

## ఏకంగా ఆస్పత్రిలోనే డ్రగ్స్ వినియోగం.. వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్, డిసెంబర్ 20: మరికొద్దిరోజుల్లో నూతన సంవత్సరం రానుంది. దీంతో డ్రగ్స్ మూలాలపై ఇప్పటికే నార్కొటిక్స్ బ్యూరోతో పాటు హైదరాబాద్ పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో నగరంలోని ఓ ఆస్పత్రిలో డ్రగ్స్ కలకలం రేపుతోంది. ఎస్ఆర్ నగర్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రిలో కేఫిటేరియా మేనేజర్ వద్ద డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మేనేజర్ ఆసిఫ్ వద్ద ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. గత కొంతకాలంగా ఆసిఫ్ వ్యక్తిగతంగానే డ్రగ్స్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి సేవిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చాయి. అయితే ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్ ఎవరి ద్వారా ఆసిఫ్‌కు సరఫరా అవుతుందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో ప్రతీ సారి డ్రగ్స్ వినియోగం భారీగా ఉంటోంది. ఈ ఏడాది ఎక్కడా కూడా డ్రగ్స్ మాట వినపడొద్దనే ఉద్దేశంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా డ్రగ్స్ తీసుకుంటున్న ఆసిఫ్‌ను అదుపులోకి తీసుకుని పూర్తిగా విచారిస్తున్నారు పోలీసులు. అతడిచ్చే సమాచారంతో మరి కొంతమందిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.




## మెడికల్ కాలేజీల పనితీరుపై నివేదిక ఇవ్వాల్సిందే.. మంత్రి కీలక ఆదేశాలు

హైదరాబాద్ : రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర?యాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిరయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.




గువాహటి: ఈశాన్య రాష్ట్రం అస్సాంలో శనివారం రైలు ప్రమాదం జరిగింది. సైరాంగ్ నుంచి ఢిల్లీ బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ హెూజాయ్ జిల్లాలో ఏనుగుల మందను ఢీకొట్టింది. ఈ ఘటనలో కొన్ని ఏనుగులు మృతిచెందగా.. ప్రమాదం ధాటికి రైలు బోగీలు పట్టాలు తప్పాయి. రైలు ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పినట్లు నార్త్‌ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, ప్రయాణికులెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు ఢీకొనడంతో ఏడు ఏనుగులు మృతి చెందగా.. మరో ఏనుగు గాయపడింది. రైల్వే, అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలోని రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఘటన జరిగిన ప్రాంతం ఎలిఫెంట్ కారిడార్ కాదని రైల్వే అధికారులు తెలిపారు. పట్టాలపై ఏనుగుల మందను చూడగానే లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేశాడని, అయినప్పటికీ ప్రమాదం జరిగిందని వివరించారు. దీనిపై దర్యాప్తు జరుగుతోందన్నారు.




**సంక్రాంతి వస్తుందంటే తెలుగువారంతా సొంతూళ్లకు పయనమవుతారు. ఎక్కువ శాతం ప్రయాణికులు రైళ్లనే ఆశ్రయిస్తుంటారు. సంక్రాంతి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 124 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది. సికింద్రాబాద్, చర్లపల్లి, లింగంపల్లి, కాచిగూడ, నాంపల్లి నుంచి ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే CPRO శ్రీధర్ తెలిపారు. ఈ సీజన్ మొత్తంలో సుమారు 600కు పైగా ప్రత్యేక రైళ్లను నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. డిమాండ్‌ను బట్టి మరిన్ని రైళ్లను నడిపిస్తామన్నారు.**

## కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలకు మరో రెండేళ్లు కష్టాలు తప్పవు: కేటీఆర్





హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రాష్ట్ర ప్రజలకు మరో రెండేళ్లు కష్టాలు తప్పవని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి ఉండదని విమర్శించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించిన ఆయన.. రైతులు యూరియా కోసం యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. రైతులకు దుకాణాలలో యూరియా ఇవ్వలేని ప్రభుత్వం.. యాప్‌లో ఇస్తానంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ చేతగానితనానికి 'యూరియా యాప్' ఒక నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఎప్పుడూ ఎరువుల కోసం రైతులు క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి రాలేదన్నారు. కాంగ్రెస్‌కు 66శాతం సర్పంచి స్థానాలు నిజమైతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్, భాజపా రెండు పడవలపై ప్రయాణిస్తున్నారని, ఆ రెండు పార్టీలు పూర్తి అవగాహనతో పనిచేస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు.




## మల్లారెడ్డా మజాకా.. కబడ్డీ.. కబడ్డీ అంటూ..

మేడ్చల్, డిసెంబర్ 20: మల్లారెడ్డి అంటే మల్లారెడ్డే.. ఆయనకు ఎవరూ పోటీలేరు.. సాటి రారంతే.. అవునుమరి.. ఏం చేసినా.. ఏం చేయాలన్నా ఆయన వల్లే అవుతుందనిపించేలా మల్లారెడ్డి పనులు ఉంటాయి. కష్టపడ్డ.. పాలు అమ్మిన.. పూలు అమ్మిన.. కాలేజీలు కట్టిన అంటూ మల్లారెడ్డి చెప్పిన డైలాగ్ ఏ రేంజ్‌లో వైరల్ అయ్యిందో మనందరికీ తెలిసిందే. ఏడు పదుల వయసులోనూ ఆయన చాలా యాక్టీవ్‌గా ఉంటూ.. అందరినీ ఆశ్చర్యానికి గురు చేస్తుంటారు. డ్యాన్స్ వేస్తారు.. పాట పడుతారు.. ఆటలాడుతూ.. ప్రత్యర్థులపై తనదైన శైలిలో మాటల తూటాలు పేల్చుతారు.. ఒకటేమిటి మల్లారెడ్డి ఏం చేసినా వైరల్ అవ్వాల్సిందే అన్నట్లుగా ఉంటుంది పరిస్థితి. తాజాగా ఆయనకు సంబంధించిన ఓ వీడియో వైరల్ అవుతోంది. మరి ఆ వీడియోలో మల్లారెడ్డి ఏం చేశారో ఓసారి తెలుసుకుందాం.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి రాజకీయంగానే కాదు.. సామాజికంగా చాలా యాక్టీవ్‌గా ఉంటారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ తనదైన శైలిలో సందడి చేస్తుంటారు. తాజాగా మేడ్చల్ నియోజకవర్గం ముదుచింతలపల్లి పురపాలక పరిధి జగన్ గూడ గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించారు. తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల మీట్ 2025-26 కార్యక్రమాన్ని ఏమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే మల్లారెడ్డి సైతం ఆటల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి కబడ్డీ, ఫుట్‌బాల్ ఆడారు. కబడ్డీ.. కబడ్డీ అంటూ కూతకు వెళ్లిన మల్లారెడ్డి.. విద్యార్థులు పట్టుకుని ఔట్ చేశారు. మల్లారెడ్డి తన ఆటతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచారు. ఈ సందరరేగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే.. 'సీఎంలు వస్తూ ఉంటారు పోతూ ఉంటారు. విద్యార్థులకు ప్రత్యేకంగా గురుకులాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించిన ఘనత కేసీఆర్‌దే' అని అన్నారు.

# పుష్యమాస విశిష్టత



జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాస నిర్ణయము ఆ మాసంలో పౌర్ణిమ రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయ బడుతుంది. చైత్ర పౌర్ణిమ రోజున చంద్ర సంచారం చిత్తా నక్షత్రమున అవుతుంది కనుక ఆ మాసానికి చైత్ర మాసమని, విశాఖ నక్షత్రమందు సంచరించుట వలన వైశాఖ మాసమని, ఇలా పన్నెండు మాసాల పౌర్ణములలో చంద్రుని సంచారం ఆధారంగా పేర్లను పూర్వీకులు నిర్ణయించారు. చంద్రుడు పూర్ణిమ రోజున పుష్యమి నక్షత్రములో సంచరించే మాసం పుష్యమాసం. "పుష్య అంటే పోషణ శక్తి కలిగినది" అని అర్థం. ముహూర్తాలు లేని నెలలను శూన్య మాసాలంటారు. మీన మాసంతో కూడిన చైత్రమాసం, మిధున మాసంతో కూడిన ఆషాడ మాసం, కన్యా మాసంతో కూడిన భాద్రపద మాసం, ధనుర్మాసంతో కూడిన పుష్య మాసాలను శూన్య మాసాలంటారు. పుష్యం శీతకాలంలో వస్తుంది. శూన్యమాసమై, గృహ ప్రవేశాలు, శంకు స్థాపనలు, వివాహాది శుభ శోభనాలకు వీలు లేకున్నా, జపతప ధ్యానాదులకు, పితృ దేవతలను పూజించడానికి ఉద్దిష్టమైన మాసమిది. శ్రావణ పౌర్ణమి నుండి పుష్య పౌర్ణమి వరకు వేదాధ్యయయానికి, మంత్రాలు నేర్వడానికి పూర్వకాలం నుండి అనువైన సమయంగా చెప్పబడింది. పంటలు చేతికొచ్చే సమయం కూడా పుష్య మాసమే. కొత్త బియ్యం, కొత్త బెల్లం, నువ్వులు రైతుల చేతికి వస్తాయి. పుష్య మాసంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నువ్వులు బెల్లంతో చేసిన వంటకాలు శరీరం ఉష్ణోగ్రత పెంచి చలి ప్రభావం నుంచి రక్షిస్తాయి. ధాన్య లక్ష్మీతో పాటు ధనలక్ష్మీ రైతుల చెంత చేరుతుంది. రైతులకు పంట చేతికి అందే కాలం కనుక ధాన్యలక్ష్మి, ధనలక్ష్మి రూపేణ విష్ణుమూర్తి సమేత మహా లక్ష్మిని పూజించడం సనాతన సాంప్రదాయాచరణగా ఉంది. పుష్యమాసం శనీశ్వరుడికి పరమ ప్రీతికరం. ఎందుకంటే ఆయన జన్మనక్షత్రం పుష్యమి. ఈ నెలంతా శనైశ్చరుణ్ని పూజించే వారిపట్ల శని ప్రసన్నుడై శుభాలు కలిగిస్తాడని పురాణాలు తెలుపు తున్నాయి. అంతే గాక గరుడ పురాణంలో నాభిస్థానం శని స్థానం అని చెప్పబడింది. పుష్య మాసాధిపతియైన శని మరియు నక్షత్రాధిపతియైన గురువును పూజించడం వల్ల విశేష ఫలితాలు వస్తాయని విశ్వాసం. పుష్య అమావాస్య దినాన "శనికి తైలాభిషేకం" నిర్వహించడం ద్వారా శనిబాధ నివృత్తి కలుగుతుంది. వస్త్ర, తిల, అన్నదానాల వల్ల కూడా శని దోషాలు తొలగిపోయి శుభ ఫలితాలు సిద్ధిస్తాయి. ఏలిననాటి శనితో బాధపడేవారు ఈ మాసంలో రోజూ ఉదయానే శుచిగా స్నానం చేసి శనీశ్వరుణ్ణి భక్తితో ప్రార్థిస్తారు. పౌర్ణమి నాడు శనికి తైలాభిషేకం జరిపించి నవ్వులు దానమిస్తారు. ఆయనకు ఇష్టమైన నువ్వులు, బెల్లం ఆహారంలో భాగం చేసుకుంటారు. శాస్త్రీయ కోణం చుస్తే ఈ రెండూ పదార్ధాలు శరీరంలో వేడిని పెంచి చలి నుంచి రక్షిస్తాయి. పుష్య పౌర్ణమి స్నానాలు సకల శ్రేయోదాయకాలు. ఉత్తరాయణ పుణ్య కాలం, తెలుగు వారి పెద్ద పండుగ "సంక్రాంతి" వచ్చేదీ ఈ మాసంలోనే. సూర్యుడు ధనురాశి నుండి మకరరాశిలో ప్రవేశించేదే మకర సంక్రాంతి. ఉత్తరాయణ కాలంలో తిల ధేను ధానాలు, తిల తైలాదులతో శివాలయాలలో దీప దానం, శివారాధనం, శివుని ఘృతముచే అభిషేకించడం మహా ఫలం. నల్ల నువ్వులచే అభ్యంగన స్నానం, తిల హెూమం, తిల భక్ష్యం, తెల్ల నువ్వులచే దేవ తర్పణం, నల్ల నువ్వులచే పితృ తర్పణం చేయాలని ధర్మసింధు వివరిస్తున్నది. పౌర్ణమి తిథియందు పుష్యమి నక్షత్రంతో చంద్రుని కలయిక "పౌషీ పౌర్ణమి". గ్రహాధిపతి సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడం చేత "మకర సంక్రమణ" అవుతుంది. ఉత్తరాయణంలో సూర్యదేవ, సూర్య కిరణ ఆరాధన చేస్తారు. పంచాయతన పూజా విధానంలో గణపతిని భాద్రపద మాసంలో, అంబికా అమ్మవారిని ఆశ్వీయుజ మాసంలో, శివుని కార్తీక మాసంలో, విష్ణువుని మార్గశిర మాసంలో, సూర్య నారాయణుడిని పుష్య మాసంలో విశేషంగా కొలుస్తారు. ఈ పుణ్య కాలాన సూర్యోదయం నుండి ఐదు ఘడియలు (రెండు గంటలు) వరకు విశిష్ట తేజస్సును ప్రసరింపచేసే సూర్య కిరణాలు జీవ చైతన్యాన్ని ఊర్ధ్వ ముఖంగా ప్రసరింప చేయుటకు తోడ్పడతాయి. మానవ శరీరం లోని వెన్నెముక యందలి "విశుద్ధి చక్రము", కంఠ స్థానమునందున్న "షోడశ దళ పద్మము"నకు, హృదయ స్థాన మందున్న "అనాహత చక్ర ము"నకు మధ్యన ప్రకాశించే "ప్రజా కేంద్రము"... "మకర రాశిని" సూచిస్తుంది. ఇది మహా విష్ణువు నివాస స్థానం. అనాహత చక్రానికి నారాయణుడు అధిదేవత, అందువల్ల పుష్య పూర్ణిమ నాడు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అని ఉపాసించుట చేత సిద్దిత్వం కలుగుతుంది. మనుస్మృతి, గోభిల మునిచే విరచితమైన ధర్మస్మృతి ప్రకారం శ్రావణ పౌర్ణమి నుండి పుష్య పౌర్ణమి వరకు అభ్యసించిన వేద మంత్రాధ్యయనానికి ముగింపు పలికి, ఇతర విద్యలను మళ్ళీ శ్రావణం వచ్చే వరకు అభ్యసించే వారు. పుష్య పూర్ణిమ నాడు వేద మంత్ర ఉత్సర్జనము విధిగా చేసే ఆచారం ఉండేది. తమిళ నాట పుష్య పూర్ణిమను "పూసమ్" అంటారు. తైపూసమ్ ఉత్సవాన్ని జరుపు కుంటారు. తంజావూరు నందు ఉత్సవాన్ని వైభవంగా ఆచరిస్తారు. కుజ దోషము కాలసర్ప దోషము, సర్పదోషము, వివాహ అలస్యము, నిస్సంతానత్వం మున్నగు వాటికి స్త్రీ పురుషులు శ్రీ సుబ్రహ్మణ్య, అంగారక గ్రహారాధనలు సత్ఫలితాలను అందిస్తాయి. పుష్యమాసం తొలి అర్ధభాగంలో విష్ణుమూర్తిని పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. పుష్య శుక్ల విదియ నుంచి పంచమి వరకు శ్రీ హరిని తులసీ దళాలతో, సోమవారాల్లో శివుడిని మారేడు దళాలతోనూ, ఆదివారాల్లో సూర్యుణ్ణి జిల్లేడు పూలతోనూ అర్చించాలి. శుక్ల పక్షంలో వచ్చే అష్టమిరోజు పితృదేవతలను ఆరాధిస్తారు. ఈ మాసంలో శుద్ధ ఏకాదశిని పుత్రదా ఏకాదశి అంటారు. ఈ రోజున ఏకాదశి వ్రతం ఆచరిస్తే పుత్ర సంతానం కలుగుతుందని విశ్వాసం. పుష్యమాసంలో వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే దినమే మకర సంక్రాంతి. సంక్రాంతి మరుసటి రోజు కనుమ పండుగ చేస్తారు. ఈ రోజు ధాన్యరాశులనూ వ్యవసాయంలో సహకరించే పశు వులనూ లక్ష్మీ స్వరూపంగా భావించి పూజిస్తారు. పుష్య బహుళ ఏకాదశిని విమలైకాదశి, సఫలైకాదశి, షట్తిలైకాదశి, కల్యాణైకాదశి అని పిలుస్తారు. మాసంలో ఆఖరు రోజైన అమావాస్యను చొల్లంగి అమావాస్య అంటారు. ఈ రోజు నది స్నానాదులు చేసుకుని దైవదర్శ నం చేసుకుంటే శుభాలు కలుగుతాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# హనుమ అంటే గుర్తొచ్చేది అర్జానే

## - డిసెంబర్ 21...అర్జా జనార్ధన్ రావు జయంతి



పౌరాణిక చిత్రాలలో హనుమంతుని వేషం ధరించి, తెలుగు ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నటుడు అర్జా జనార్ధన్ రావు. హనుమ అనగానే గుర్తువచ్చే విధంగా ఆయన దేహ దారుఢ్య రూపం, నటన అలా ఆంజనేయుని ప్రతిరూపంగా ఉండేవి. హనుమంతుడే ప్రత్యక్షంగా కనిపిస్తున్నా డా అన్నంతగా, ఆయన ఆ పాత్ర పోషణలో లీనమై నటించే వాడు. అర్జా జనార్ధనరావు (డిసెంబర్ 21, 1926 – నవంబర్ 4, 2007) ప్రసిద్ధ తెలుగు నాటక, సినిమా నటుడు. అర్జా జనార్ధన రావు 1926 డిసెంబరు 21న కాకినాడలో జన్మించాడు. స్వస్థలం కాకినాడలోనే బి.ఎ., బి.ఎస్.సి చదువుకున్నాడు. చదువుకొనే సమయంలోనే ఆయనకు నాటక రంగంలో కొంత అనుభవం కలిగింది. ఆయనకు చిన్నతనం నుండి ఆటలమీద, కసరత్తులు చేయడం మీద ఉత్సాహం ఉండేది. ఆ ఉత్సాహమే ఆయనను మిస్టర్ ఆసియా, మిస్టర్ హెర్క్యులస్ (1954), మిస్టర్ ఇండియా (1955)గా ఎన్నిక చేసింది. అయన శబ్దగ్రహణ శాఖలో డిప్లొమా చదివి కొన్నాళ్ళు శ్యామలా స్టుడియోలో రికార్డిస్ట్‌గా పనిచేశాడు. లవకుశ (1963)బీ శ్రీకృష్ణావతారం (1967)బీ వీరాంజనేయ (1968)బీ శ్రీ రామాంజనేయ యుద్ధం (1974)బీ ముత్యాల ముగ్గు (1975)బీశంకరా భరణం (1979)బీ త్యాగయ్య (1981)బీ శ్రీ ఆంజనేయ చరిత్ర (1981)బీ దేవాంతకుడు (1984)బీ తదితర చిత్రాలలో జనార్ధన్ రావు విభిన్న పాత్రలు పోషించారు. 2007 నవంబరు 4 (వయసు 80)న ఆయన మరణించాడు. డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్ కథ, మాటలు సమకూర్చిన, 1969 జూలై 25న సినిమా విడుదలైన, కృష్ణ, గుమ్మడి, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులుగా ఉన్న జగత్ కిలాడీలు' చిత్రంలో జనార్ధన్ రావు భిన్నమైన పాత్రలో నటించాడు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం చిత్రంలో ఒక పాటను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జనార్ధన్ రావు ... ఆంజనేయ పాత్రలో లీనమై నటించగా, ఆ సన్నివేశంలో, ఆయన హావభావాలు నాటి సినిమా ప్రియులు ఎన్నటికీ మరచి పోలేనివి. 1975లో పొట్లూరి వెంకట నారాయణ, ఎన్.ఎస్.మూర్తి కలిసి శ్రీరామాంజనేయ యుద్ధం పేరుతో కలర్ సినిమా నిర్మించారు. బాపు దర్శకత్వం వహించిన సినిమాకు ముళ్లపూడి వెంకటరమణ మాటలు రాయకుండా ఉన్న అరుదైన సినిమా శ్రీ రామాంజనేయ యుద్ధం. బాపు–ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా శ్రీరామాంజనేయ యుద్ధం. గతంలో గబ్బిట వెంకటరావు రాసిన పద్యనాటకం లోని పద్యాలను యధాతథంగా వాడడంతో సంభాషణలు కూడా అతని చేత రాయించారు. ఎన్టీఆర్ రాముడిగా, అర్జా జనార్ధనరావు ఆంజనేయుడుగా, బి.సరోజదేవి సీతగా, ధూళిపాళ్ల యయాతిగా నటించిన ఈ చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీతం సమకూర్చారు. ఇందులో ఆంజనేయుడు ఆలపించే రెండు ఆర్ద్రమైన పాటలను వినూత్నంగా ఉంటుందని రఘురామయ్య చేత పాడించారు. వాటిలో మొదటిది 'రామ నీలమేఘ శ్యామా కోదండరామా' కాగా, రెండవది 'శరణు శరణయా జానకిరామా, కరుణ జూపవా మారుతిపై సాకేత సార్వభౌమా' అనే పాట. ఈ రెండవ పాటకు కె.వి. మహదేవన్ ఒక హిందీ పాట బాణీని అనుకరించడం వింతగా చెప్పుకున్నారు. అందుకు కారణం...మహదేవన్ ఎప్పుడూ ముందుగా ఇచ్చే బాణీకి పాట స్వరపరచ లేదు. కవి రాసిన ఎటువంటి పాటకైనా అద్భుతంగా బాణీలు కట్టటం మహదేవన్ నైజం. అందుకు భిన్నంగా 'సాకేత సార్వభౌమా' పాటకు మహదేవన్ అనుకరించిన హిందీ పాట దోస్తీ లోనిది. 1964లో రాజశ్రీ ప్రొడక్షన్స్ నిర్మాత తారాచంద్ బరజాత్యా సత్యన్‌బోస్ దర్శకత్వంలో నిర్మించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం 'దోస్తీ'లో మహమ్మద్ రఫీ పాడిన 'చాహూంగా మై తుజ్హే సాంఝ్ సవేరే...ఫిర్ భి కభీ అబ్ నామ్ కో తేరే ఆవాజ్ మై న దూంగా' మహదేవన్ అనుకరించడాన్ని విశేషంగా చెప్పుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ప్రతిభ ఉన్నా చిత్రసీమలో కొనసాగలేని శ్రీధర్

## డిసెంబర్ 21...సూరపనేని శ్రీధర్ జయంతి



సినిమా రంగంలో సమర్థత ఉండీ తగిన గుర్తింపు, అవకాశాలు రాని కళాకారులు ఎందరో. అలాంటి వారిలో అగ్ర భాగాన నిలుస్తాడు ఒకనాటి హీరో శ్రీధర్ (ముత్యాల ముగ్గు సినిమా ఫేం). చిత్రసీమలో ముత్యాల ముగ్గు చిత్రంతో అడుగిడి, సహజ నటునిగా పేరెన్నిక గన్నా, మూడు దశాబ్దాల కాలంలో ఆయన 150 చిత్రాలలో విభిన్న పాత్రలలో రాణించినా, ఆశించిన స్థాయిలో, రీతిలో ముందుకు వెళ్ళలేక పోయాడు. ప్రతిభావంతమైన కళాకారుడైన శ్రీధర్ ఏనాడు వేషాలకోసం అర్థించలేదు. తనకు అవకాశం వచ్చిన సినిమాలలో నటించాడు. హీరోవేషాలు వస్తున్నప్పుడు శ్రీధర్‌చే ఎన్టిఆర్ తనస్వంత చిత్రం శ్రీరామ పట్టాభిషేకంలో గుహుడు వేషం వేయించారు. దాంతో శ్రీధర్‌కు వచ్చే హీరోవేషాలు కూడా రాకుండా పోయాయి. అంతకుముందు ఎన్టిఆర్ గుహుడు వేషానికి డ్రయివర్ రాముడులో సెకెండ్‌హీరో వేషానికి లింకుపెట్టి ఇచ్చారు. కానీ, డ్రయివర్ రాముడు చిత్రం హిట్‌కూడా శ్రీధర్‌ను మరిన్ని చిత్రాలలో హీరోని చేయలేక పోయాయి. సహాయ పాత్రలను తెచ్చి పెట్టాయి. ఇలా శ్రీధర్‌కు తాను నటించిన హిట్ చిత్రాలు ఆశించిన ప్రయోజనాన్ని కల్పించలేదు. జస్టిస్ చౌదరి సినిమాలో ఎన్టీ రామారావు కొడుకుగా నటించాడు. ఒకప్పుడు కృష్ణ నటించిన సినిమాలన్నింటి లోనూ శ్రీధర్ కనిపించేవాడు. అమెరికా అమ్మాయి, అడవి రాముడు, జస్టిస్ చౌదరి, కరుణామయుడు, ఈనాడు, బొమ్మరిల్లు, సీతా మహాలక్ష్మీ, యశోధకృష్ణ వంటి చిత్రాలు పేరు తెచ్చి పెట్టాయి. కృష్ణా జిల్లా, ఉయ్యూరు సమీపంలోని కుమ్మమూరు గ్రామంలో 1939 డిసెంబర్ 21 న ఒక దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శ్రీధర్, తల్లా? పెళ్లామా? చిత్రంతో తెలుగు జాతి మనది అనే పాటలో విద్యార్థిగా సినీ రంగ ప్రవేశం చేశాడు. మచిలీపట్నంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకొని 1964లో హైదరాబాదుకు వచ్చి ప్రభుత్వ పనుల శాఖలో గుమాస్తాగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. ఉద్యోగం చేస్తూనే సాయంత్రం కళాశాలకు వెళుతూ బి.ఏ పూర్తిచేశాడు. కళాశాల సాంస్కృతిక విభాగంలో క్రియా శీలకంగా పనిచేస్తూ కార్యదర్శి అయ్యాడు. పరీక్ష, చీకటి తెరలు, అభాగ్యులు, సాలెగూడు, మండే కొండలు మొదలైన అనేక నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు. ఈయన ప్రధానపాత్ర పోషించిన మంచుతెర అనే నాటకానికి గాను ఆంధ్ర నాటక కళా పరిషత్ నుండి ద్వితీయ బహుమతి అందుకున్నాడు. తల్లా? పెళ్లామా? (1970), విశాలి (1973), చక్రవాకం (1974), దేవదాసు (1974), మాంగల్య భాగ్యం (1974), ముత్యాల ముగ్గు (1975), యశోద కృష్ణ (1975), శ్రీరామాంజనేయ యుద్ధం (1975), అమెరికా అమ్మాయి (1976), దొరలు దొంగలు (1976), బంగారు మనిషి (1976), భక్త కన్నప్ప (1976), వెలుగు బాటలు (1976), అడవి రాముడు (1977), తరం మారింది (1977), మనవడి కోసం (1977), అంగడి బొమ్మ (1978), ఇంద్ర ధనుస్సు (1978), కరుణా మయుడు (1978), గోరంత దీపం (1978), పల్లెసీమ (1978) బొమ్మరిల్లు (1978), శ్రీరామ పట్టాభిషేకం (1978), సీతామాలక్ష్మి (1978), జూదగాడు (1979), డ్రైవర్ రాముడు (1979), బొట్టు కాటుక (1979), ఆడది గడప దాటితే (1980), కలియుగ రావణాసురుడు (1980) కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త (1980), పొదరిల్లు (1980), బంగారు బావ (1980), మంచిని పెంచాలి (1980), సంధ్య (1980), సంసార బంధం (1980), దేవుడు మావయ్య (1981), మా పెళ్ళి కథ (1981), ఆపద్బాంధవులు (1982), ఈనాడు (1982), జస్టిస్ చౌదరి (1982), డాక్టర్ మాలతి (1982), కిరాయి కోటిగాడు (1983), నేటి చరిత్ర (1990), గోవిందా గోవిందా (1994) తదితర చిత్రాలలో ప్రతిభా వంతంగా నటించాడు. మూడు దశకాల పాటు సాగిన సినీ ప్రస్థానంలో సుమారు 150 సినిమాలలో నటించిన శ్రీధర్ తెలుగు సినిమా రంగములో ముత్యాల ముగ్గు సినిమాతో గుర్తింపు పొందాడు. సినిమాలలో సరైన అవకాశాలు లేక, టివి సీరియళ్ల కోసం అవకాశం వెతుక్కుంటూ వచ్చినా, నటించ డానికి ఇష్టపడలేదు. ఆ సీరియళ్లు నటిస్తే శ్రమ ఎక్కువ తప్పితే ఆర్థికంగా ఫలితాలు బహు తక్కువ అని తెలుసుకుని నటనకు దూరంగా ఉన్నాడు. స్వంతచిత్ర నిర్మాణాలపై ఆసక్తి కనబరచలేదు. చివరికి రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో ఉండి, విభిన్న పాత్రల్లో కనిపింపించిన శ్రీధర్ నటించిన చివరి చిత్రం గోవిందా గోవిందా. ఆయన ఊపిరితిత్తుల క్యాన్సర్ తో బాధపడుతూ, చికిత్స పొందుతుండగా గుండెపోటుతో జూలై 11, 2007 న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఉపాధ్యాయులు ఉద్యోగులు కాదు

## - సమాజ నిర్మాణ శిల్పులు: టీచర్స్ ఫెడరేషన్ 80 ఏళ్ల ప్రస్థానం

### వేతనాల నుంచి విద్యా విలువల వరకు: ఎనభై ఏళ్ల ఉపాధ్యాయ పోరాట గాథ

1944లో తూర్పు గోదావరి జిల్లా తాపేశ్వరంలో ఆంధ్ర రాష్ట్ర లిప్రాథమికోపాధ్యాయ సమాఖ్యలిలిగా, నాటిన ఉపాధ్యాయ ఉద్యమ విత్తనం, ఎనిమిది దశాబ్దాల కాలంలో ఒక బలమైన వృక్షంగా ఎదిగి, ఆంధ్ర%–%తెలంగాణ విద్యా వ్యవస్థలకు నీడనిచ్చే స్థాయికి చేరుకుంది. "ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు కాదు, సమాజ నిర్మాణ శిల్పులు" అనే భావనను కేవలం నినాదంగా కాక, ఆచరణలో నిరూపించిన సంఘం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్. బ్రిటిష్ పాలన నడుమ, విద్యా రంగంలో అసమానతలు, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిన రోజుల్లోనే ఈ సంఘం పుట్టింది. అప్పటివరకు వ్యక్తిగతంగా, ఒంటరిగా వినిపించిన ఉపాధ్యాయుల వేదనను సంఘటిత శక్తిగా మలచిన తొలి ప్రయత్నమిది. 1947లో శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్య గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌గా పునర్వ్యవస్థీకరణ జరగడం, ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన చారిత్రక ఘట్టం. స్వాతంత్ర్యం సిద్ధించిన కొత్త భారతదేశంలో, ప్రజాస్వామ్య విలువలకు పునాదిగా విద్యను నిలబెట్టాలంటే ఉపాధ్యాయుడికి గౌరవం, భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛ అవసరమని ఈ సంఘం బలంగా వాదించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్మితమైన సంఘటనా వ్యవస్థ, లక్షలాది ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ ఎనిమిది దశాబ్దాల ప్రయాణంలో %ూ్రాుఖీ% సాధించిన విజయాలు అనేకం. వేతన సవరణల విషయంలో ప్రభుత్వాలపై నిరంతర ఒత్తిడి తీసుకురావడం, పేడ్ స్కేల్స్, టైమ్ బౌండ్ ప్రమోషన్లు, పదోన్నతులలో ఉన్న అసమానతలను సరిదిద్దడం వంటి అంశాల్లో ఈ సంఘం కీలక పాత్ర పోషించింది. పెన్షన్ హక్కును ఉపాధ్యాయుల మౌలిక హక్కుగా నిలబెట్టడంలో, కుటుంబ పెన్షన్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలను విస్తరించడంలో సంఘం చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయి. ఒక దశలో ఉపాధ్యాయ నియామకాలు నిలిచిపోయిన సందర్భాల్లో, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఉద్యమాలు చేసి, వేలాది పోస్టులు భర్తీ అయ్యేలా చేయడంలో ఈ సమాఖ్య పాత్రను విస్మరించలేం. విద్యార్థుల భవిష్యత్తు కూడా ఉపాధ్యాయ ఉద్యమానికి కేంద్రబిందువే. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలు కావడం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వ విధానాల్లో స్పష్టత తీసుకురావడం వంటి అంశాల్లో %ూ్రాుఖీ% నిరంతరం జోక్యం చేసుకుంది. విద్యా విధానాల రూపకల్పనలో ఉపాధ్యాయుల అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ సంఘం ఎన్నోసార్లు ప్రభుత్వాలతో చర్చలు జరిపింది. ఫలితంగా పాఠ్య ప్రణాళికల్లో, బోధనా విధానాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. 2014 జూన్ 2న రాష్ట్ర విభజనతో ఈ ఉద్యమం మరో కీలక దశలోకి ప్రవేశించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఒకటిగా ఉన్న ఉపాధ్యాయ సమాఖ్య, రెండు రాష్ట్రాల వాస్తవాల ప్రకారం పునర్నిర్మాణం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో దివంగత శ్రీ మార్పు బాలకృష్ణమ్మ గారి త్యాగం, అహర్నిశల కృషి తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచింది. వారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్‌గా TRTF రూపుదిద్దుకుంది. ఇది కేవలం పరిపాలనా విభజన కాదుబీ తెలంగాణలోని ఉపాధ్యాయ సమస్యలకు ప్రత్యేక స్వరం ఇచ్చిన చారిత్రక నిర్ణయం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత TRTF తక్కువ కాలంలోనే వేలాది సభ్యులతో బలమైన సంఘంగా ఎదిగింది. వేతన సవరణలలో ప్రాంతీయ అసమానతలను సరిదిద్దడం, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాల వల్ల ఉపాధ్యాయ వృత్తికి ఏర్పడిన సవాళ్లను ఎదుర్కోవడం, బదిలీలు–ప్రమోషన్లలో పారదర్శకత కోసం పోరాటం చేయడం వంటి అంశాల్లో %ుూఖీ% ముందుండి పనిచేస్తోంది. ఉపాధ్యాయుల పని భారం పెరుగుతున్న నేపథ్యంలో, విద్యేతర పనుల నుంచి ఉపాధ్యాయులను విముక్తి చేయాలనే డిమాండ్‌తో చేసిన ఉద్యమాలు, ప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పులకు దారితీశాయి. కరోనా వంటి సంక్షోభకాలంలో ఉపాధ్యాయుల ఆరోగ్యం, భద్రతపై %ుూఖీ% ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆన్‌లైన్ బోధన వల్ల ఏర్పడిన సాంకేతిక సమస్యలు, ఇంటర్నెట్ ఖర్చులు, మానసిక ఒత్తిడి వంటి అంశాలపై ప్రభుత్వానికి వినతులు సమర్పించి, ఉపాధ్యాయులకు కొంత ఊరట కలిగించే చర్యలు తీసుకునేలా చేసింది. పాఠశాలల పునఃప్రారంభం సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలనే అంశాన్ని కూడా సంఘం బలంగా లేవనెత్తింది. నేడు మాన్యులు శ్రీ మానేటి ప్రతాపరెడ్డి, శ్రీ కటుకం రమేష్, శ్రీ మారెడ్డి అంజిరెడ్డి, శ్రీ సుంకెశీల ప్రభాకర్ రావు గారల నాయకత్వంలో %ుూఖీ% తన ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తోంది. ఉపాధ్యాయుల వేతనాలే కాదు, వృత్తి గౌరవం, సామాజిక ప్రతిష్ట, విద్యా నాణ్యత అన్నింటినీ ఒకే సమీకరణంలో చూడాలనే దృక్పథంతో సంఘం ముందుకు సాగుతోంది. ఎనభై వసంతాల చరిత్రను వెనక్కి తిరిగి చూసుకుంటే, ప్రతి దశలోనూ పోరాటం, త్యాగం, సాధనలే కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో నిర్వహించబడుతున్న అభ్యుదయోత్సవం, కేవలం ఒక సభగా పరిమితం కాదు. ఇది గత తరం ఉపాధ్యాయుల త్యాగాలకు నివాళి, వర్తమాన తరం బాధ్యతలకు గుర్తు, రాబోయే తరాలకు మార్గదర్శనం. నాగోల్‌లోని సాయిరాం గార్డెన్స్ వేదికగా డిసెంబర్ 21న ఆదివారం జరగనున్న ఈ మహాసభ, ఉపాధ్యాయ ఐక్యతను మరోసారి చాటే వేదికగా నిలవనుంది. ఎనిమిది దశాబ్దాలుగా వెలిగిన ఉద్యమ జ్యోతి, రాబోయే కాలంలోనూ విద్యా రంగాన్ని, సమాజాన్ని వెలుగులు నింపుతుందనే విశ్వాసమే ఈ అభ్యుదయోత్సవానికి ప్రాణం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# చురకలు సంపాదకీయం


## ‘సాఫ్ట్ స్కిల్స్’..
### ఏఐ యుగంలో విజయానికి ఇదే కీలకం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగులు, విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ కీలక సమయంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ మాట్ గార్మన్ యువతకు ఒక విలువైన సలహా ఇచ్చారు. భవిష్యత్తులో విజయానికి కేవలం సాంకేతిక (టెక్నికల్) జ్ఞానం మాత్రమే కాక సాఫ్ట్ స్కిల్స్ అత్యంత అవసరం అని నొక్కి చెప్పారు. గార్మన్ అభిప్రాయం ప్రకారం.. ఏఐ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా.. మానవులకు మాత్రమే సొంతమైన కొన్ని సామర్థ్యాలను యంత్రాలు అనుకరించలేవు. అవేంటంటే.. క్రిటికల్ థింకింగ్.. క్లిష్టమైన సమస్యలను విశ్లేషించడం, లోతైన ఆలోచనతో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఏఐతో సాధ్యం కాదు. అడాప్టబిలిటీ అవసరం. మారుతున్న పరిస్థితులకు, కొత్త టెక్నాలజీలకు త్వరగా అలవాటు పడగల సామర్థ్యం అవసరం.. కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడం ముఖ్యం.. గార్మన్ ఇదే విషయాన్ని చెబుతూ “మానవుల ఆలోచనా సామర్థ్యం, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం మాత్రం యంత్రాలు చేయలేవు.” అందుకే యువత ఏ విభాగంలో చదువుతున్నా, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**మానవీయ నైపుణ్యాల ప్రాధాన్యత...**
అనేక సంస్థలు తమ కస్టమర్లతో మానవీయంగా మాట్లాడగలిగే.. వారి భావనను పంచుకోగలిగే వ్యక్తులను కోరుకుంటాయి. ఏఐ యుగంలోనూ ఈ మానవీయ నైపుణ్యాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటాయని అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ స్పష్టం చేశారు.

**జోహో కార్ప్ కూడా అదే సూచన...**
ఈ అభిప్రాయాన్ని జోహో కార్పొరేషన్ ఏఐ రీసెర్చ్ చీఫ్ రాంప్రకాశ్ రామమూర్తి కూడా బలపరిచారు. ఇంటర్నెట్ వచ్చినప్పుడు ఉద్యోగాల రూపురేఖలు మారినట్లే, ఇప్పుడు ఏఐ కారణంగానూ ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రీసనింగ్, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాలలో మానవులకే ఎప్పటికీ ఆధిక్యం ఉంటుందని తెలిపారు. మానవ మేధస్సు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. ఉద్యోగాలను భద్రపరుచుకోవాలంటే టెక్నాలజీ నైపుణ్యాలకు తోడు మానవీయ నైపుణ్యాలు, లోతైన ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార దృక్పథం అత్యంత అవసరం. భవిష్యత్తులో విజయవంతం కావాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ‘సాఫ్ట్ స్కిల్స్’పై దృష్టి సారించడం తప్పనిసరి.


## తెలుగు భాషకు “వేదం” ఎనలేని సేవ - డిసెంబర్ 21...వేదం వెంకట రాయ శాస్త్రి జయంతి




పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరికత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపా యి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మినహాయింపు ఏమీ లేకుండే. ఆ సంధి కాలంలో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్రవ్మాయమున క్రొత్త యుగమును సూచిక అయింది. వేదం వెంకట రాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయన చూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయములలో శాస్త్రి చూపినా మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం. సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు , నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి... వేంకట రమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్ధవంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతంలలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించేవారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు. 1916లో సూర్యారాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు. అముక్తమాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు. ఆముక్త వ్యాఖ్య శతాధిక వసంతాల ను చూసింది. 24-6-1920 నాడు ప్రారంభించి 20-10-1920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు. ఆముక్తమాల్యద - సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్రము, శ్రీకృష్ణ దేవరాయ, విజయము- నాటకము కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వ్మాయ చరిత్ర - ప్రథమ సంపుటం, చరిత్ర రచన - ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము వ్యామోహము తదితరుల అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము - చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణీయము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనము తానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం, రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు. 1920లో ఆంధ్ర మహా సభ చేత ‘మహోపాధ్యాయ’ బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత ‘సర్వతంత్ర స్వతంత్ర’, ‘మహామహోపాధ్యాయ’, ‘విద్యాదానవ్రత మహోదధి’ అనే సత్కారాలు పొందారు. 1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చేత ‘కళా ప్రపూర్ణ’ గౌరవంతో సన్మానించబడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన ‘నన్నెచోడుని కవిత్వము’ అనే విమర్శనా గ్రంథానికి ‘ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి’ బహుమతి లభించింది. వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## బాల సాహిత్యంలో ధృవ తార అవసరాల - డిసెంబర్ 21...అవసరాల రామకృష్ణారావు జయంతి



అవసరాల రామకృష్ణారావు ప్రముఖ సాహితీవేత్త, నవలా రచయిత. తెలుగు సాహిత్యం బతికి బట్ట కట్టినంత కాలం గుర్తుంచుకునే కథా కురు పితా మహుడు ఆయన. 1931, డిసెంబర్ 21న చెన్నైలో జన్మించిన రామ కృష్ణారావు కు బాల సాహిత్యంలో అజరామరంగా నిలిచిన చందమామతో ఆయనకు గల బంధం, అనుబంధం విడదీయరానిది. ఏడు పదుల ఏళ్ళ కిందట తన 15 సంవత్సరాల తొలి సంధ్యలో చంద మామ 1947 జూలై - సంచికలో "పొట్టిపిచిక కథ" తో ప్రారంభిం చింది మొదలు మలి సంధ్యలో 80ఏళ్ళ వయసు వరకు రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన విశిష్ట కథా రచయిత . పొట్టి పిచిక కథ ప్రారంభ, ముగిం పులు ఇలా ఉంటాయి. అనగా అనగా ఓ వూర్లో వక పొట్టి పిచిక వుండేది. అదేం చేసింది. ఊరల్లా తిరిగి ఉలవగింజ, చేనల్లా తిరిగి సెనగ్గింజ పెరడల్లా తిరిగి పెసరగింజ ఇల్లాంటివి ఎన్నోగ్గింజలు పోగు చేసుకొని కొట్టి కొట్టి కొండంత రొట్టి చేసుకుంది. చేసుకుని, చింత చెట్టుమీద కూర్చుని, ఆపిచిక ఆ రొట్టెను ఎగరేసుకుంటూ ఎగరేసు కుంటూ, తింటూ ఉంటే, చీమ తలకాయంత ముక్క చెట్టు తొర్రలో పడిపోయింది. అప్పుడు ఈగ ఏం చేసింది. వెంటనే వెళ్లి ఆవు చెవులో దూరి నానా అల్లరి చేసింది. ఆవు ఆ బాధ భరించలేక అతని తన్నింది. తాతకి కోపం వచ్చి అవ్వని కొట్టాడు. అవ్వకు ఒళ్లు మండి పిల్లి మీద వేడి పాలోపింది, పిల్లి కోపం కొద్దీ ఎలక వెంట పడింది. ఎలక భరించలేక బోయ చెప్పులు కొరికింది. బోయ కోపం తీర్చుకోడానికి లేళ్ల కాళ్లను విరగ కొట్టేడు. లేళ్లు కోపంతో రాజుగారి తోటను పాడుచేశాయి. రాజుకి బుద్ధివచ్చి, వడ్డంగిని శిక్షించేడు. వడ్రంగి చచ్చినట్టు చెట్టును నరికి, తొర్ర తవ్వి చీమ తలకాయంత రొట్టె ముక్కను చేతిలో పెట్టాడు. పిచిక మళ్లీ ఎగవేసుకుంటూ ఆ రొట్టె ముక్కను కమ్మగా తిన్నది... ఒక చిన్న ప్రాణి, తాను కష్టపడి సంపాదించుకున్న చిన్న రొట్టె ముక్కను పోగొట్టుకుని, ఎవరి సాయం పొందక పోయినా, పట్టిన పట్టు విడువని చిన్ని జీవి నైజం, చివరకు అనుకున్నది సాధించిన వైనంకు సంబంధించిన కథ ఇది. ‘పొట్టి పిచిక కథ’ రచనే తన విజయ సూత్రం అవుతుందని ఆనాడు, ఏనాడూ అనుకోలేదని చెప్పేవారు. పదిహేనేళ్ల ప్రాయంలో రాసిన, ఈ కథ ఇచ్చే సందేశం నిజంగా అద్భుతం. వెయ్యి పైగా రచనలు చేసి, తల వంచక, కలం దించక తెలుగు కథకుడిగా కొనసాగిన సుదీర్ఘ సాహితీ వ్యాసంగంలో పక్షులతో జంతువులతో మనుషుల్ని కలిపి సామాజికాంశాల్ని అలవోకగా కథా వస్తువులుగా చేసు కోవడానికి చందమామ పత్రికనే భూమిక అని చెప్పేవారు. చందమామ కథ ఇచ్చిన ఊపుతో తాను రాసిన సుప్రసిద్ధ పిల్లల రచనల్లో ‘కేటూ డూప్లికేటూ,’ ‘మేథ మేట్రిక్స్,’ మూడు భాగాలూ, ‘ఆంగ్రేజీ మేడీజీ,’ ‘ఆంగ్రేజీ యమ ఈజీ’ వంటి అరడజను రచనలు భాగమని కూడా ఆయన ఘనంగా చెప్పుకున్నారు. తెలుగులో నవలలు, కథలు వెయ్యికి పైగా రాసి వన్నెకెక్కిన కథా రచయితగా పేరు తెచ్చుకున్నారు. ఆయన తుని ఎస్సార్ ఉన్నత పాఠశాలలో లెక్కలు, సైన్సు బోధించారు. ఒరిస్సాలో ఇంగ్లీషు రీడర్ గా పని చేశారు. విశాఖ పట్నంలో ఇంగ్లీషు లెక్చరర్ గా పనిచేశారు. వృత్తి జీవితమంతా ఆంగ్ల భాష బోధించినా, తెలుగు భాష పై ఉన్న వ్యామోహంతోనే దశాబ్దాల కాలంలో వెయ్యికి పైగా రచనలు మాతృ భాష లోనే చేశారు. ఆధునిక సమాజం తెస్తున్న మార్పుల్లో కొన్నింటికి దూరంగానే ఉన్నానని అంగీకరించారు. తను పాటించే నీతికి విరుద్ధమని తోచిన సందర్భాలలో, ప్రచురణకు పంపకుండా ఎన్నో రచనలను ఆయన అముద్రితంగా ఉంచు కున్నారు. “మనం మనుష్యులం, సహజీవన సౌభాగ్యం, ఇంకానా అంతరాలు?, అడుగో మావయ్య, ఆ వెనకే మేరీ, సంపెంగలూ, సన్న జాజులూ, మేం చేసిన తప్పు మీరూ చేస్తారా?, అది ప్రశ్న, ఇది జవాబు, హెడ్మిస్ట్రెస్ హేమ లత, పేక ముక్కలు, కథావాహిని, గణిత విశారద, కేటూ, డూప్లికేటూ, అర్ధమున్న కథలు, రామ చిలుక, మోహన రాగం, మేథమే ట్రిక్స్-1, మేథ మేట్రిక్స్-2, మేథమే ట్రిక్స్-3, అంగ్రేజీ మేడీజీ” తదితర రచనలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం (1969), తెలుగు విశ్వ విద్యాలయం హాస్య రచయిత పురస్కారం (1994), జ్యేష్ఠ లిటరరీ అవార్డు ( 1998), కొలసాని చక్రపాణి అవార్డు (1999), ఢిల్లీ తెలుగు ఎకాడమీ ఉగాది పుర స్కారం (2000), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వైభవం పురస్కారం (2004) తదితర అవార్డులు, పురస్కారాలు ఆయనకు లభించాయి. చందమామకు తన చివరి కథలు పంపి, బాల సాహిత్యానికి తన అవసరం తీరిందనుకున్నారేమో, అవసరాల 2011, నవంబర్ 28 న హైదరాబాదులో తుది శ్వాస విడిచి, ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## ప్రజల ఓటు - స్పీకర్ తీర్పు మధ్య ఊగిసలాడుతున్న ప్రజాస్వామ్యం - పార్టీ మార్పిడుల చరిత్రలో మరో అధ్యాయం: తెలంగాణ నిర్ణయం

తెలంగాణ శాసనసభ స్పీకర్ ఇటీవల ఎమ్మెల్యేల పార్టీ మార్పిడి అంశంపై తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల పరిధిని దాటి దేశవ్యాప్తంగా రాజ్యాంగ, న్యాయ, రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చకు దారి తీసింది. సంబంధిత ఎమ్మెల్యేలు ఇంకా తమ అసలు పార్టీలోనే కొనసాగుతున్నారని, పార్టీ మార్పిడిగా నిర్ధారించేందుకు అవసరమైన చట్టబద్ధమైన, స్పష్టమైన, శాస్త్రీయ ఆధారాలు లేవని స్పీకర్ ప్రకటించడంతో ఈ వివాదం మరింత సున్నితమైన మలుపు తిరిగింది. ఒకవైపు ఈ నిర్ణయాన్ని రాజ్యాంగ పరిధిలో తీసుకున్న చట్టబద్ధమైన చర్యగా సమర్థించే వర్గాలు ఉండగా, మరోవైపు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా స్పీకర్ వ్యవహరించారని విమర్శించే స్వరాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్, అంటే యాంటీ డిఫెక్షన్ చట్టం ప్రకారం, ఎమ్మెల్యేల పార్టీ మార్పిడిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం పూర్తిగా శాసనసభ స్పీకర్‌కే ఉంటుంది. గవర్నర్ గానీ, కోర్టులు గానీ మొదటిసారిగా ఈ అంశంపై తీర్పు చెప్పే స్థాయిలో ఉండవు. తెలంగాణ స్పీకర్ కూడా ఇదే రాజ్యాంగాధికారాన్ని వినియోగించు కున్నట్లు అధికారికంగా స్పష్టం చేశారు. పార్టీ మార్పిడి అనేది కేవలం రాజకీయ వ్యాఖ్యలు చేయడం, ఇతర పార్టీల నేతలతో వేదిక పంచుకోవడం, లేదా వారి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆధారంగా తేల్చలేమని స్పీకర్ అభిప్రాయం. పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా త్యజించినట్టు స్పష్టమైన రికార్డులు, విప్ ఉల్లంఘనకు సంబంధించిన అధికారిక ఓటింగ్ ఆధారాలు, లేదా మరో పార్టీలో చేరినట్టు స్పష్టమైన ప్రకటనలు లేకుండా అనర్హత వేటు సాధ్యం కాదన్నదే ఆయన నిర్ణయ సారాంశం. ఈ నిర్ణయానికి రాజ్యాంగపరమైన, న్యాయపరమైన ఆధారాలున్నాయన్న వాదనను పలువురు న్యాయ నిపుణులు ముందుకు తెస్తున్నారు. “స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం త్యజించడం” అన్న భావనను కోర్టులు ఎప్పుడూ కఠినంగా, పరిమిత అర్థంతోనే వ్యాఖ్యానించాయి. కేవలం ఇతర పార్టీలకు అనుకూలంగా మాట్లాడటం లేదా వారి కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే పార్టీ మార్పిడికి తుది ఆధారంగా పరిగణించలేమన్న తీర్పులు గతంలో వెలువడ్డాయి. ఈ న్యాయ ధోరణినే తెలంగాణ స్పీకర్ అనుసరించారని, అందువల్ల ఆయన నిర్ణయం చట్టబద్ధంగానే ఉందన్న అభిప్రాయం ఒక వర్గంలో బలంగా వ్యక్తమవుతోంది. అయితే రాజకీయ కోణంలో చూస్తే ఈ నిర్ణయం తీవ్ర విమర్శలకు కూడా గురవుతోంది. ప్రజలు ఒక పార్టీ గుర్తుపై ఓటు వేసినప్పుడు, ఆ పార్టీకి విరుద్ధంగా వ్యవహరించే ఎమ్మెల్యేలు సాంకేతిక కారణాలతో అనర్హత నుంచి తప్పించు కోవడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధమని విమర్శకులు అంటున్నారు. “శాస్త్రీయ ఆధారాలు లేవు” అన్న కారణంతో పార్టీ మార్పిడిని గుర్తించక పోవడం చట్టంలోని లోపాలను ఉపయోగించు కున్నట్లేనని, ఇది రాజకీయ నైతికతను బలహీన పరుస్తుందని వారు ఆరోపిస్తున్నారు. ఈ విమర్శలు తెలంగాణకే పరిమితం కావుబీ గతంలో కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ స్పీకర్ నిర్ణయాలపై ఇలాంటి ఆరోపణలే వినిపించాయి. తెలంగాణ సందర్భంలో ఈ నిర్ణయం మరింత ప్రాధాన్యం సంతరించు కోవడానికి కారణంఇది గవర్నర్ చేసిన వ్యాఖ్యలతో అనుసంధానమై ఉండటమే. పార్టీ మార్పిడికి స్పష్టమైన ఆధారాలు లేవన్న భావనను గవర్నర్ కూడా వ్యక్తం చేయడంతో, అధికార పక్షం దీన్ని స్పీకర్ నిర్ణయానికి రాజ్యాంగ పరిరక్షణగా భావిస్తోంది. అయితే విమర్శకుల దృష్టిలో ఇది రాజ్యాంగ సంస్థల మధ్య అనవసర సమన్వయంగా కనిపిస్తోంది. గవర్నర్ అభిప్రాయం రాజకీయంగా ప్రభావం చూపవచ్చును గానీ, పార్టీ మార్పిడిపై తుది తీర్పు చెప్పే అధికారం పూర్తిగా స్పీకర్‌కే పరిమితమని వారు గుర్తుచేస్తున్నారు. గత అనుభవాలతో పోలిస్తే తెలంగాణ స్పీకర్ నిర్ణయం పూర్తిగా అపూర్వమైనదీ కాదు, పూర్తిగా అసాధారణమైనదీ కాదు. 2019లో కర్ణాటకలో, 2020లో మధ్య ప్రదేశ్‌లో, 2022%-%23లో మహారాష్ట్రలో స్పీకర్లు తీసుకున్న నిర్ణయాలు కూడా చట్టబద్ధత, రాజకీయ నైతికత మధ్య ఊగిసలాడిన ఉదాహరణలే. చాలా సందర్భాల్లో కోర్టులు తక్షణ జోక్యం చేయకుండా, స్పీకర్ తుది నిర్ణయం వచ్చే వరకు వేచి చూసే ధోరణినే అనుసరించాయి. తెలంగాణలో కూడా ఇదే న్యాయపరమైన మార్గం కొనసాగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. భారతదేశంలో పార్టీ మార్పిడుల చరిత్రను పరిశీలిస్తే, ఈ సమస్య కొత్తది కాదన్న విషయం స్పష్టమవుతుంది. 1967 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఆధిపత్యం తగ్గిపోవడంతో అనేక రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అధికార ఆశ, రాజకీయ లాభాల కోసం ఎమ్మెల్యేలు తరచూ పార్టీలు మారడం మొదలు పెట్టారు. హర్యానాకు చెందిన గయాలాల్ ఒకే రోజులో మూడు సార్లు పార్టీ మారిన ఘటన రాజకీయ నైతిక పతనానికి ప్రతీకగా నిలిచింది. “ఆయా రామ్ గయా రామ్” అన్న పదం అప్పటినుంచి పార్టీ మార్పిడికి పర్యాయ పదంగా మారింది. 1967 నుంచి 1985 మధ్య దేశవ్యాప్తంగా వందలాది ఎమ్మెల్యేలు పార్టీలు మార్చగా, దాదాపు యాభైకి పైగా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కారణంగానే కూలిపోయినట్టు పార్లమెంటరీ రికార్డులు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పది వ షెడ్యూల్‌ను చేర్చి యాంటీ డిఫెక్షన్ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రజలు ఓటు వేసిన పార్టీకి కట్టుబడి ఉండాల్సిన బాధ్యతను ప్రజాప్రతినిధులపై విధించడమే దీని ఉద్దేశం. పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా త్యజించినా, పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినా అనర్హత వేటు పడేలా నిబంధనలు రూపొందించారు. అయితే మొదట్లో పార్టీ విభజనకు అవకాశం ఇవ్వడం రాజకీయ దుర్వినియోగానికి దారి తీసింది. దీంతో 2003లో 91వ సవరణ ద్వారా ‘స్ప్లిట్’ నిబంధనను తొలగించి, కనీసం మూడొంతుల సభ్యులు కలసి విలీనమైతేనే అది చట్టబద్ధమని స్పష్టం చేశారు. అయినప్పటికీ పార్టీ మార్పిడులు పూర్తిగా ఆగలేదుబీ అవి మరింత సాంకేతికంగా, చట్టాన్ని చుట్టుకొనే విధంగా కొనసాగుతున్నాయి. పార్టీ మార్పిడిని నిర్ధారించేందుకు అవసరమైన “శాస్త్రీయ ఆధారాలు” ఏవన్నదే ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. యాంటీ డిఫెక్షన్ చట్టం ప్రకారం పార్టీ సభ్యత్వ రాజీనామా లేఖలు, మరో పార్టీలో చేరినట్టు అధికారిక ప్రకటనలు, విప్ ఉల్లంఘనకు సంబంధించిన ఓటింగ్ రికార్డులు, సభలోని ప్రవర్తనపై స్పష్టమైన డాక్యుమెంట్లే ప్రధాన ఆధారాలుగా పరిగణిస్తారు. కేవలం వేదికలు పంచుకోవడం, మీడియా వ్యాఖ్యలు, రాజకీయ అనుకూలత ప్రదర్శనలు మాత్రమే తుది ఆధారాలుగా కోర్టులు అనేక సందర్భాల్లో అంగీకరించలేదు. అందుకే “వారు ఇంకా తమ పార్టీలోనే ఉన్నారు” అన్న నిర్ణయాలు తరచూ వెలువడుతున్నాయి. సుప్రీంకోర్టు తీర్పులు ఈ విషయంలో కీలక మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. 1992లో ఒక కేసులో స్పీకర్ నిర్ణయం తుది అయినా, అది న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందని పేర్కొంది. 2016లో అరుణాచల్ ప్రదేశ్, ఉతరాఖండ్ రాజకీయ సంక్షోభాల్లో గవర్నర్ అధికారాలకు స్పష్టమైన పరిమితులు విధించింది. 2020లో కర్ణాటక ఎమ్మెల్యేల రాజీనామాల కేసులో పార్టీ మార్పిడిపై నైతిక విమర్శలు చేసినప్పటికీ, రాజీనామా చేసిన సభ్యులు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని అడ్డుకోలేమని తేల్చింది. 2023లో మహారాష్ట్ర శివసేన వివాదంలో పార్టీ గుర్తింపు, అసలైన పార్టీ అంశాల్లో స్పీకర్ పాత్ర, ఎన్నికల సంఘం అధికారాలపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ తీర్పులన్నీ యాంటీ డిఫెక్షన్ చట్టం అమలులో ఇంకా స్పష్టత అవసరమని సూచిస్తున్నాయి. మొత్తానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ తీసుకున్న నిర్ణయం వ్యక్తిగత అభిప్రాయం కాదుబీ అది రాజ్యాంగం స్పీకర్‌కు అప్పగించిన అధికారాల ప్రతిఫలం. అదే సమయంలో ఈ నిర్ణయం పార్టీ మార్పిడులపై ఉన్న చట్టపరమైన పరిమితులు, రాజకీయ నైతిక లోపాలు, ప్రజాస్వామ్యంపై పెరుగుతున్న అవిశ్వాసాన్ని కూడా బహిర్గతం చేస్తోంది. చట్టపరంగా స్పీకర్ నిర్ణయం సరైనదిగా కనిపించినా, ప్రజాస్వామ్య ఆత్మకు అది ఎంతవరకు న్యాయం చేస్తుందన్న ప్రశ్న మాత్రం మిగిలే ఉంది. తెలంగాణలో తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు ఒక నిదర్శనంగా మారుతుందా, లేక పార్టీ మార్పిడులను మరింత చట్టపరమైన ముసుగులో కొనసాగించే దారిని చూపిస్తుందా అన్నది కాలమే తేల్చాలి. విజ్ఞుల అభిప్రాయాలు ఈ విషయంలో తీవ్రంగా విభేదిస్తున్నాయి. కొందరు యాంటీ డిఫెక్షన్ చట్టం ఎమ్మెల్యేల అంతఃకరణ స్వేచ్ఛను హరిస్తోందని, వారిని పార్టీ అధినాయకత్వానికి బానిసలుగా మారుస్తోందని విమర్శిస్తుంటే, మరికొందరు ఈ చట్టం లేకపోతే ప్రజాస్వామ్యం బహిరంగంగా కొనుగోలు రాజకీయాలకు బలవుతుందని హెచ్చరిస్తున్నారు. స్పీకర్ స్థానంలో స్వతంత్ర న్యాయ ట్రిబ్యునల్‌కు ఈ అధికారాన్ని అప్పగించాలన్న సూచనలు కూడా బలపడుతున్నాయి. అలాగే గవర్నర్ పాత్రను రాజ్యాంగంలో మరింత స్పష్టంగా నిర్వచించాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ పెరుగుతోంది. అంతిమంగా, తెలంగాణ స్పీకర్ నిర్ణయాన్ని ఒక తాత్కాలిక రాజకీయ వివాదంగా మాత్రమే చూడలేం. ఇవి భారత ప్రజాస్వామ్యంలో పార్టీ మార్పిడిపై ఉన్న చట్టపరమైన అస్పష్టతలు, సంస్థాగత బలహీనతలు, రాజకీయ నైతిక పతనాన్ని మరోసారి స్పష్టంగా వెలుగులోకి తెచ్చాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కేవలం చట్టాలు సరిపోవుబీ ఆ చట్టాలను అమలు చేసే సంస్థల స్వతంత్రత, రాజ్యాంగ విలువలపై రాజకీయ నాయకుల నిబద్ధత, ప్రజాస్వామ్య నైతికత కూడా సమానంగా అవసరం. లేనిపక్షంలో పార్టీ మార్పిడులు చట్టాన్ని చుట్టుకొనే రాజకీయ వ్యూహాలుగానే మిగిలి, ప్రజల విశ్వాసాన్ని మరింత క్షీణింపజేస్తూనే ఉంటాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు



## దారిదోపిడీలకు.. హైవేలే అడ్డా!

మెదక్ : జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు సరిహద్దులుగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తున్న దొంగలు దాడులకు పాల్పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయిలో మంగళవారం రాత్రి దొంగలు డ్రైవరును హత్య చేసి, లారీతో పరారయ్యారు. ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాలోని పరిస్థితిపై కథనం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల మీదుగా 65వ (ముంబయి-హైదరాబాద్), 44వ (కశ్మీర్-కన్యాకుమారి), 161వ (అకోలా-నాందేడ్) జాతీయ రహదారులు వెళ్తున్నాయి. జహీరాబాద్-బీదర్ అంతర్రాష్ట్ర రహదారి వెళ్తోంది. ఆయా మార్గాల్లో దోపిడీలు, చోరీలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**వివిధ ఘటనలు ఇలా..**

న్యాల్‌కల్ మండలం గంగ్వార్ చౌరస్తాలో పాన్ మసాలా లోడుతో వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవరుపై దాడి చేసి రూ.20 లక్షల విలువైన సరకు, రూ.40 వేలు ఎత్తుకెళ్లారు. బూచినెల్లి శివారులో పెట్రోల్ బంకు వద్ద ఓ కుటుంబం కారులో నిద్రిస్తుండగా అద్దాలు ధ్వంసం చేసి మహిళ ఆభరణాలు లాక్కునేందుకు యత్నించారు. 44వ జాతీయ రహదారిలో తూప్రాన్ బైపాస్ రోడ్డులో లారీ నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్, క్లీనర్‌పై దాడి చేసి దోచుకున్నారు.

**కొరవడిన నిఘా..**

ఉమ్మడి జిల్లాలోని జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై భద్రత కొరవడిందని ఇటీవలి ఘటనలే చెబుతున్నాయి. ప్రధానంగా రాత్రివేళల్లో ప్రయాణం, సరకు రవాణా అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో పక్కా నిఘా పెట్టాలి.



**దాబా, టోల్‌గేట్ల వద్ద మాటేసి..**

ముందుగా ముఠా సభ్యుల్లో కొందరు హైవేలపై దాబాలు, టోల్‌గేట్ల వద్ద మాటు వేస్తారు. ఆగి ఉన్న వాహనాలను గమనించి, డబ్బు, ఆభరణాలు ఉన్నాయా తదితర వివరాలు మిగతా వారికి చేరవేస్తారు. చోరీ చేయగానే ముందుగానే ఎంపిక చేసుకున్న వేరే దారుల్లో తప్పించుకుంటున్నారు.

లారీలకు అడ్డుగా వెళ్లి టార్చిలైట్లను డ్రైవర్ల కళ్లపై వేసి, వాహనం నిలపగానే దాడి చేస్తారు.

**వీటిని పాటించండి..**

వాహనాల డోర్లు లాక్ చేసుకొని పెట్టుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వరాదు. విశ్రాంతికి నిలపాలనుకుంటే పెట్రోలు బంకులు, నిర్దేశిత ప్రాంతాల వద్దే నిలపాలి.

**అమెరికాలో ఇలా..**

యూఎస్‌లో ప్రతి వాహనం నంబరు ప్లేట్‌ను స్కాన్ చేసే వ్యవస్థ అందుబాటులో ఉంది. దొంగిలించిన వాహనాలు హైవేలపైకి రాగానే పోలీసులకు సంకేతం అందుతుంది.

హైవేలపై నిర్మానుష్య ప్రాంతాల్లో ఏఐ ఆధారంగా పని చేసే కెమెరాల టవర్లు ఉంటాయి. ఇవి అనుమానాస్పద వాహనాల కదిలికలను గుర్తించి అప్రమత్తం చేస్తాయి.

నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో పకడ్బందీ గస్తీ ఉంటుంది.

## కల్వర్టులు శిథిలం.. భయంగా ప్రయాణం

జహీరాబాద్ : జహీరాబాద్: మెరుగైన రవాణా సదుపాయానికి రహదారులను మెరుగు పరుస్తామని, వాటికి అడ్డుగా వాగులున్న చోట కల్వర్టులు, వారధులు నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ చెబుతుంటారు. కానీ దశాబ్దాలు గడుస్తున్నా జహీరాబాద్ నియోజకవర్గంలోని చాలా చోట్ల కొత్త రోడ్లు, వారధులు, కల్వర్టులను నిర్మించడం లేదు. భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెనలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

**ఏళ్లుగా మరమ్మతులు కరవు**

జహీరాబాద్ పట్టణం మాణిక్‌ప్రభు మహేలా నుంచి అల్గోల్‌కు వెళ్లే బైపాస్ మార్గంలో, రహమత్‌నగర్ సమీపంలో, అల్గోల్-పొట్టిపల్లి గ్రామాల మధ్య నారింజ వాగుపైన, బైపాస్ కూడలి నుంచి బీదర్ వైపు వెళ్లే దారిపై కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కాశీంపూర్, అసద్‌గంజ్, గోపన్‌పల్లి, గౌడిగార్‌పల్లి,



ఇప్పెపల్లి, మాడ్గి, ధనసిరి వెళ్లే మార్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వీటికి ఏళ్లుగా మరమ్మతులు కరవయ్యాయి.

అధికారులూ.. దృష్టి సారించండి

కోహీర్ మండలంలోని కోహీర్-నాగిరెడ్డిపల్లి, వెంకటాపూర్-పోతిరెడ్డిపల్లి, మద్రి-గుర్జువాడ, కోహీర్-మాచిరెడ్డిపల్లి, రాజినెల్లి-కోహీర్, మనియార్‌పల్లి-బడంపేట-పర్శపల్లి, గౌడిగార్‌పల్లి మార్గాల్లో నాలుగు చోట్ల కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి.

ఝరాసంగం మండలంలోని ఝరాసంగం-కుప్పానగర్, ఝరాసంగం-చిలేపల్లి, చిలేమామిడి, మాచునూర్, బర్దిపూర్ మధ్యలో కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

న్యాల్‌కల్ మండలంలోని న్యాల్‌కల్-మిర్జాపూర్, హద్నూర్-గుంజోటి, రామ్‌తీర్థ్, గంగ్మార్-మెటల్‌కుంట రహదారులపైన కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వీటిపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం-రాంచందర్, డీఈఈ, పీఆర్, జహీరాబాద్

నియోజకవర్గంలోని వివిధ రహదారులపైన దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం.

# ఉపాధి.. గ్రామాభివృద్ధికి హామీ..



ఆదిలాబాద్ : ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి.. కొత్తగా పంచాయతీ పాలకవర్గం కొలువుదీరనుంది. సర్పంచిగా ఎన్నికైనందుకు సంబరంగా ఉన్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో పంచాయతీలను నిధుల కొరత వెంటాడుతుండటంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడం సవాలే.. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది. పక్కాగా, ప్రణాళికబద్ధంగా పనులు చేయించగలిగితే కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు, పల్లెలను ప్రగతి దిశగా తీసుకుపోవచ్చు.. గతంతో పోలిస్తే పథకంలో కొన్ని మార్పులు చేశారు. పథకం పేరు మార్చడంతో పాటు పని దినాలు వంద నుంచి 125కి పెంచారు. 266 పనులను గుర్తించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిపై సర్పంచులు దృష్టి సారించాలి.

**స్వచ్ఛ గ్రామాలుగా..**

గ్రామాలను సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధి పథకంలో అవకాశం ఉంది. మరుగుదొడ్ల నిర్మాణంలో అవసరమైన గుంతలను కూలీలతో తవ్వించి, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించవచ్చు.

**నీటిని నిల్వ చేసుకునేలా..**

సాగు భూముల్లో కాంటూరు కందకాలు, ఊట కుంటలు, ఫాంపాండ్స్, చెక్‌డ్యాంలు, రాళ్లకట్టలు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. ముందుగా ప్రతిపాదనలు సిద్ధం చేసుకొని పక్కాగా పనులు పూర్తిచేస్తే.. భూగర్భ జలమట్టం పెరుగుతుంది.

**మొక్కలు నాటుదాం..** గ్రామాల్లో మొక్కలు నాటి హరితవనం పెంపొందించేందుకు వీలుంది. పంచాయతీల్లో నర్సరీ అందుబాటులో ఉంది. గుంతలు తవ్వడం మొదలు, మొక్కలను నాటేందుకు, పోషణకు కూడా డబ్బులు ఇస్తున్నారు.

**సాగుకు ఊతం..**

గ్రామాల్లో చెరువులు, చెక్‌డ్యాంలు, ఊట కుంటలు, ప్రాజెక్టు కాల్వల్లో నుంచి పూడిక తీసుకునేందుకు అవకాశం ఉంది. కూలీలతో పనులు చేయిస్తే అటు వారికి ఉపాధి చూపడంతో పాటు నీటి వనరులను బాగు చేసుకోవచ్చు.

**'దారి' చూపండి..**

గ్రామం నుంచి ఇతర గ్రామాలకు, పంట పొలాలకు దారులు లేని ప్రాంతాలకు ఉపాధి పథకం కింద పొలం బాటలు వేసుకోవచ్చు. ఎడ్లబండ్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలవుతుంది. గ్రామంలో పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనం లేకుంటే ఉపాధి హామీ పథకంలో నిర్మించుకునే వీలుంది..

ఎవరిని సంప్రదించాలి

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేకంగా సిబ్బంది ఉంటారు. జిల్లాలో పీడీతో పాటు ఏపీడీ, మండలాల్లో ఏపీవో, సాంకేతిక సహాయకులు, గ్రామాల్లో క్షేత్ర సహాయకులు ఉంటారు. మండల అభివృద్ధి అధికారి పర్యవేక్షణలో పనుల గుర్తింపు, ఎంపిక, ఆమోదం, మంజూరు ఉంటాయి.

సొంత గూడు లేని పంచాయతీలు : 679
భవనాల్లేని అంగన్‌వాడీ కేంద్రాలు : 274
మరుగుదొడ్లు లేని కుటుంబాలు : 1.35 లక్షలు
పంచాయతీలు : 1514
జాబ్‌కార్డులు ఉన్నవారు : 3.75 లక్షలు
ఉపాధి కూలీలు : 12.84
పనులు : 266
కేటాయించిన నిధులు : రూ. 380 కోట్లు

# చిక్కుల్లో.. చిక్కి పరిశ్రమ



ఉట్నూరు : గిరిజన యువతను పారిశ్రామిక రంగంలో ప్రోత్సహించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. రూ.లక్షల వ్యయంతో ఐటీడీఏ ఉట్నూరులో ఏర్పాటుచేసిన కుమురం భీం చిక్కి పరిశ్రమ నిర్వహణ లేక, అప్పుల్లో కూరుకుపోయి మూతబడే దిశలో పయనిస్తోంది. అయిదేళ్ల క్రితం ట్రైకార్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్ఎంఈ) సహకారంతో రూ.40 లక్షలతో చిక్కి (పల్లీపట్టి)పరిశ్రమను నెలకొల్పారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పరిశ్రమ స్థాపనకు ముందుకొచ్చిన గిరిజన యువత నుంచి వ్యక్తిగత వాటా ధనం కింద 10 శాతం నిధులను సమకూర్చారు.

**అధిక పోషకాలతో..** ఆధునిక పద్ధతులను పాటించి పరిశ్రమలో రుచికరమైన పల్లిపట్టీలు తయారు చేసేలా శ్రద్ధ పెట్టారు. డీస్టోనర్, సిక్కినర్, రోస్టర్, కుకింగ్, షీటింగ్ యంత్రాల సాయంతో తయారీ చేపట్టారు. ఇక్రిశాట్ సూచనలను పాటిస్తూ.. మార్కెట్‌లో లభించే పల్లిపట్టీలకంటే నాణ్యత, అధిక పోషకాలు ఉండేలా తయారీ చేపట్టారు. నాణ్యమైన పల్లీలు, బెల్లం, నువ్వులు, చక్కెర, గ్లూకోస్ ద్రావణం ఉపయోగిస్తున్నారు. ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, క్యాల్షియం, ఐరన్ తగిన మోతాదులో ఉండేలా ప్రమాణాలను పాటించారు.

**గిరిజన పిల్లలకు వరం** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 123 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఆరు వసతి గృహాలు నడుస్తున్నాయి. వీటిలో సుమారు 45వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. రక్తహీనత బారిన పడకుండా పిల్లల కోసం ఐటీడీఏ ఏటా పల్లిపట్టీలను కొనుగోలు చేస్తోంది. అందులో నాణ్యత అంతంత మాత్రంగా ఉండటంతో అధికారులు కుమురం భీం పరిశ్రమలో తయారవుతున్న నాణ్యమైన పల్లిపట్టీలను 'గిరి పోషణ' పేరుతో ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసేవారు. నాణ్యత ప్రమాణాలు, పోషకాలలో రాజీపడకుండా పరిశ్రమ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. పెట్టుబడిపోగా ఒక్కొక్కరు నెలకు రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు సంపాదించేవారు.

**సొసైటీ ఏర్పాటు**

ఆసక్తి కలిగిన నిరుద్యోగ గిరిజన యువతకు ఐటీడీఏ పీవో పర్యవేక్షణలో యూత్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన పదిమందిని ఎంపిక చేశారు. వారి కోసం కుమురం భీం పీనట్ చిక్కి ఇండస్ట్రీస్ పేరుతో సొసైటీ ఏర్పాటు చేశారు. ఆత్రం లీలావతిని అధ్యక్షురాలిగా, ఆత్రం మాధవ్‌రావును కోశాధికారిగా, సంగీత, ప్రమీల, ఆత్రం తులసీ, వరలక్ష్మి, రాఠోడ్ తిలక్, గంగారామ్, అనిత, అనురాధలను కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

**జరుగుతుందేమిటంటే..**

ప్రభుత్వం నుంచి డైట్ నిధులు (బడ్జెట్) సక్రమంగా విడుదల కాకపోవడంతో గిరిపోషణ పథకాన్ని నిలిపివేశారు. ఫలితంగా కుమురం భీం చిక్కి పరిశ్రమ నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు పల్లీపట్టీల ఆర్డర్ ఆగిపోయింది. గతంలో సరఫరా చేసిన సరకుకు రూ.10 లక్షల బిల్లు బకాయిలను ఐటీడీఏ పరిశ్రమకు చెల్లించలేదు. దీంతో ముడిసరకు కొనుగోలు కష్టంగా మారింది. కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఐటీడీఏ చుట్టూ తిరిగినా బకాయిలు ఇవ్వకపోవడం, పల్లిపట్టీల కొనుగోలు చేయకపోవడంతో ప్రస్తుతానికి మూసివేశామని కుమురం భీం చిక్కీ పరిశ్రమ సొసైటీ కోశాధికారి ఆత్రం మాధవ్‌రావు వాపోయారు. ఐటీడీఏ సహకరించి బకాయిలు చెల్లించి పరిశ్రమ పునరుద్ధరణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వణుకుతున్న ఏజెన్సీ!

తిర్యాణి : జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. తెల్లవారుజామున రాష్ట్రంలోకెల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో 5.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలిగాలులు విజృంభించడంతో గిరి ప్రజలు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోగా, సాయంత్రం నాలుగు గంటలకే చలి మొదలై తీవ్రరూపం దాల్చుతోంది. చలి తీవ్రతతో వ్యవసాయ పనులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు కార్యాలయాలకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు చలి తీవ్రతకు చిన్నపిల్లలు నిమోనియా, ఇతర వైరల్ వ్యాధుల బారినపడి సతమతమవుతున్నారు.

ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారం రోజులుగా ఉదయం 10 గంటలైనా చలి ఏమాత్రం తగ్గడం లేదు. ఆశ్రమ, కస్తూర్బా, మోడల్ స్కూల్స్, గురుకుల విద్యార్థులకు దుప్పట్లు సరిగ్గా లేకపోవడంతో చలి తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. పలు పాఠశాలల్లో కిటికీలు, తలుపులు సక్రమంగా లేక వణుకుతున్నారు. తరగతి గదులు చల్లగా ఉండటంతో.. విద్యార్థులకు పాఠశాల ఆవరణలో కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. గిరిజనులు చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

## ఐఐటీ.. సంపద సృష్టిలో మేటి

సంగారెడ్డి : ఐఐటీ హైదరాబాద్.. వినూత్న ఆవిష్కరణలతో పాటు 5జీ, 6జీ వంటి సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తోంది. ఈ క్రమంలో విద్యాసంస్థకు అవసరయమ్యే సంపదను సృష్టించే లక్ష్యంతో అడుగేయడం విశేషం. ఇందుకు ఏం చేస్తున్నారో మనమూ తెలుసుకుందాం పదండి..ఐఐటీలో వందలాది కోర్సులు అమలవుతున్నాయి. జపాన్, అమెరికా వంటి 13 దేశాలు, పలు రాష్ట్రాలతో వివిధ అంశాలపై ఎంఓయూలు కుదుర్చుకోగా, విద్యార్థులు, అధ్యాపకులు నూతన ఆవిష్కరణకు పరిశోధనలు సాగిస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే సౌర విద్యుత్తు ఉత్పత్తితో పాటు వాన నీటి సంరక్షణ, వ్యర్థజలాల రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. వికసిత్ భారత్ సంకల్పంలో భాగంగా 2030లోపు ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

**సౌర విద్యుత్తు: 8.5 మెగావాట్లు**

అన్నింటికీ విద్యుత్తు అవసరం ఎంతో ఉంటుంది. దీన్ని సొంతంగా సృష్టించుకోవాలంటే సౌరశక్తి వినియోగం ఒక్కటే దారి. ఇందుకు వాహనాల పార్కింగ్ షెడ్లపై సౌర పలకలు బిగించారు. ప్రస్తుతం 8.5 మెగావాట్ల సౌరవిద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. భవిష్యత్తు కోసం



మరో 10 మెగావాట్లు ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యం. సంస్థ ప్రాంగణంలో ప్లాంట్‌ను సిద్ధం చేస్తున్నారు.

ప్రయోజనం: సౌరవిద్యుత్తు ఉత్పత్తితో ఏటా చెల్లించే రూ.30 కోట్ల బిల్లును ఆదా చేసే అవకాశం ఉంటుంది.

**జల సంరక్షణ: 5 కోట్ల లీటర్లు**

జల సంరక్షణ ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇందుకు వాన నీటి సంరక్షణ ప్రధాన మార్గం. ఐదు జల సంరక్షణ కుంటలు తవ్వి నీరంతా వాటిల్లోకి వెళ్లే ఏర్పాట్లుచేశారు. ప్రస్తుతం 5 కోట్ల లీటర్ల నీటిని సంరక్షిస్తున్నారు. తద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. మరో 5 కోట్ల లీటర్ల నీటి సంరక్షణకు కుంటల తవ్వకాలకు ప్రణాళిక సిద్ధం చేశారు. వానాకాలంలో పడే ప్రతి నీటి చుక్క వినియోగానికి కసరత్తు చేస్తున్నారు.

ప్రయోజనం: ఏటా నీటి రవాణాతో పాటు ఇతర అవసరాలకు చెల్లించే రూ.15 కోట్ల మేర వ్యయం తగ్గించుకోవచ్చు.

**పర్యావరణ పరిరక్షణ..**

ఐఐటీ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విద్యార్థులు, అధ్యాపకులు సైకిళ్లను ఉపయోగిస్తున్నారు. చోదక రహిత ఎలక్ట్రానిక్ వాహనాలను వాడుతున్నారు.

ఎరువుగా మార్చి..తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద సృష్టించే కార్యక్రమాన్ని చేపట్టారు. తడి చెత్తను వర్మికంపోస్టు ఎరువుగా మార్చి ఉద్యాన పంటలకు ఉపయోగిస్తున్నారు.

వ్యర్థజలాలు.. శుద్ధి చేసి..

వసతిగృహాలతో పాటు ఇతర సంస్థల నుంచి వచ్చే వ్యర్థ జలాల రీసైక్లింగ్‌కు మూడు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా శుద్ధి చేసి తాగునీటికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

ప్రయోజనం: నీటి కోసం అవస్థలు తప్పుతాయి.

ఆదర్శంగా తీర్చిదిద్దాలని..

బీఎస్ మూర్తి, డైరెక్టర్, ఐఐటీ

దేశంలోని విద్యాసంస్థలకు మార్గదర్శకంగా ఉండాలనే సంకల్పంతో ఐఐటీహెచ్‌ను తీర్చిదిద్దుతున్నాం. సహజ వనరుల వినియోగంపై దృష్టిసారించాం. సొంతంగా ఆదాయాన్ని సృష్టించుకోవాలని నిర్ణయించుకొని ముందుకు సాగుతున్నాం.

## రేషన్‌కార్డు ఈ-కేవైసీ తప్పనిసరి..

కామారెడ్డి : రేషన్ కార్డులకు ఈ-కేవైసీ పూర్తి చేయించాలని పౌరసరఫరాలశాఖ ఆదేశాలు జారీ చేసింది. నకిలీవి తొలగించడానికి వీలుగా అధికారులు కార్డుల్లోని సభ్యులందరు ఆయా రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వాస్తవానికి రెండేళ్ల కిందటే ఈ ప్రక్రియ పూర్తిచేయాలని కేంద్రం సూచించింది. కానీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 7,59,246 రేషన్ కార్డులకు గాను.. అందులో 5,37,143 కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఇప్పటివరకు ఈ ప్రక్రియ 70.74 శాతం పూర్తికాగా.. ఈ నెలాఖరు నాటికి అందరు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచిస్తున్నారు.

**కొత్త సభ్యులు కూడా..**

ఉమ్మడి జిల్లాలో సుమారు 80 వేల వరకు నూతన కార్డులు అందాయి. వీటిల్లో లక్షకు పైగా కొత్త లబ్ధిదారులు చేరారు. వీరందరూ తప్పనిసరి



ఈ-కేవైసీ చేయించుకోవాలి. పాత కార్డుల్లో పేరు తొలగించుకొని వీటిల్లో చేరిన వారు సైతం ఈ ప్రక్రియ పూర్తిచేయించుకోవాల్సిందే. ఇందుకు లబ్ధిదారులు సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలి.


**త్వరగా పూర్తి చేయించుకోవాలి..**

ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర కార్డుల్లో ఇప్పటివరకు 70 శాతానికి పైగా ఈ ప్రక్రియ పూర్తయింది. మిగతా కార్డుదారులు తప్పకుండా ఈ-కేవైసీ చేయించాలి. లేదంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకావొచ్చు. వెంకటేశ్వర్‌రావు, డీఎస్‌వో, కామారెడ్డి

# స్వదేశీ మైక్రోచిప్.. సామర్థ్య పరీక్షలు

హైదరాబాద్: ఇంటర్నెట్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలు.. చరవాణుల నెట్‌వర్క్‌లేని కొండలు, గుట్టల్లో ల్యాప్‌టాప్ లలోని డేటాను క్షణాల్లో బదిలీ చేసే స్వదేశీ మైక్రోచిప్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు శాస్త్రవేత్తలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. బ్లూటూత్ సాయంతో అపరిమిత డేటాను ల్యాప్‌టాప్‌లలో అమర్చిన మైక్రోచిప్.. ఇతర ల్యాప్‌టాప్‌లు, మాధ్యమాలకు బదిలీ చేయనుంది. ప్రస్తుతం బ్లూటూత్ పనిచేసే పరిధి 30 మీటర్లుకాగా.. అర కిలోమీటర్ వరకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ నేతృత్వంలో పరిశోధక విద్యార్థులు, సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు స్వదేశీ చిప్‌ను రూపొందించారు.

**ఆటోమొబైల్.. ఎలక్ట్రానిక్స్.. అనూహ్య మార్పులు..** బ్లూటూత్ ఫ్రీక్వెన్సీ ఆధారంగా పనిచేసే సెమీకండక్టర్ చిప్.. గడియారం.. స్మార్ట్‌ఫోన్.. రాకెట్లలోని యంత్రాల అంతర్గత సామర్థ్యం పెంచుతుంది. 'ఫ్రీక్వెన్సీ సింథసైజర్' పేరుతో దీన్ని వ్యవహరిస్తున్నారు. ఫ్రీక్వెన్సీ సింథసైజర్ చిప్‌లు మన ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల రూపకల్పనలో



అనూహ్య మార్పులను తీసుకురానున్నాయి. తాము రూపొందించిన చిప్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెడితే, కార్లలో వినియోగించే చిప్‌ల కొరత ఇకపై ఉండదని, డిజిటల్ పద్ధతిలో పనిచేసే డ్యాష్‌బోర్డులు, ఇతర యూనిట్ల అంతర్గత సామర్థ్యం పెరగనుందని ఓయూ అధికారులు వివరించారు.

**వివిధ రంగాలకు ప్రయోజనకరం**

డేటా బదిలీకి సంబంధించి బ్లూటూత్, 5జీ, ఐవోటీ సహా ఇతర ఫ్రీక్వెన్సీలన్నింటికీ స్వదేశీ చిప్ పనిచేసేలా రూపొందిస్తున్నారు. హరియాణాలోని మొహాలి ఎస్‌సీఎల్(సెమీ కండక్టర్ ల్యాబరేటరీ) ప్రయోగశాలలో సెమీకండక్టర్ చిప్ పనితీరును అక్కడి శాస్త్రవేత్తలు ప్రాథమికంగా పరిశీలించారు. వచ్చే రెండు నెలల్లో సామర్థ్య పరీక్షలు పూర్తయ్యాక మరికొన్ని రంగాల్లో సెమీకండక్టర్ చిప్‌ను వినియోగించేందుకు వీలుంటుంది. వ్యవసాయ భూముల సారాన్ని క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు శాస్త్రజ్ఞులు, అధికారులకు ఇది చాలా ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. బొగ్గుగనులు, గుహలు, సొరంగాలు, హిమాలయాల్లో విధులు నిర్వహించే ఇంజినీర్లు, శాస్త్రవేత్తలకు మరింత ప్రయోజకరంగా ఉండనుందని వివరించారు.

# ఓఆర్‌ఆర్ వరకు ఇండోర్‌లోనే విద్యుత్తు ఉపకేంద్రాలు

హైదరాబాద్: నగరంలో బాహ్యవలయ రహదారి వరకు కొత్తగా ఏర్పాటు చేసే ఉపకేంద్రాలన్నీ ఇండోర్‌లోనే నిర్మించాలని డిస్కం నిర్ణయించింది. ప్రధాన నగరంలో 222 ఉపకేంద్రాలు ఉండగా.. శివార్లలో 33/11కేవీ 146 ఉన్నాయి. కొత్త ఉపకేంద్రాల అవసరం ఎక్కడెక్కడ ఉందో గుర్తించి నిర్మిస్తున్నారు. మేడ్చల్ జోన్‌లో వేర్వేరు చోట్ల పనులు సాగుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఓఆర్‌ఆర్ వరకు స్థలాల కొరత, కేటాయించిన భూములపై వివాదాలతో సమస్యలు తలెత్తుతున్నాయి. అవకాశం ఉన్న చోట ప్రభుత్వం కేటాయిస్తోంది. లేనిచోట ఆయా సంస్థలు కొంత భూమి కేటాయిస్తే నిర్మించి ఇస్తామని డిస్కం షరతు పెడుతోంది. అవుట్‌డోర్‌లో అధిక స్థలం కావాలి. తక్కువ



స్థలం సరిపోటంతో ఇండోర్ వైపే డిస్కం మొగ్గుచూపుతోంది.

**స్థలాలపై వివాదం... ప్రహరీ నిర్మాణానికి నిధుల కరవు**

ఉపకేంద్రాల నిర్మాణం కోసం ప్రభుత్వం డిస్కంకు కొన్ని ప్రాంతాల్లో భూములను కేటాయించింది. నిధుల కొరతతో ప్రహరీల నిర్మాణం ఆలస్యమవుతోంది. ఇబ్రహీంబాగ్‌లో ఉపకేంద్రం, కార్యాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంపై వివాదాలు నడుస్తున్నాయి. స్థలం తమదంటే తమదనే గొడవలు కొనసాగుతున్నాయి. స్థలం టీజీఎస్పీడీసీఎల్‌కు చెందుతుందని బోర్డు ఏర్పాటు చేసినా.. వివాదం మాత్రం సమసిపోలేదని సిబ్బంది అంటున్నారు.

# సర్కారు భూముల స్వాహా

భద్రాచలం : భద్రాచలంలో అభివృద్ధి పనులకు సరిపడా స్థలం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు సెలవిస్తున్నారు. ఇది కొంత నిజమే అయినా ఇలాంటి చోట భూఆక్రమణలు ఆటం లేదు. సర్కారు స్థలంపై కన్ను పడిందంటే నెమ్మదిగా స్వాహా చేస్తున్నారు. చర్ల రోడ్డులో ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన దాదాపు ఐదెకరాల పాల కేంద్రం భూమికి రక్షణ కరవైంది. ఇందులో కొన్నేళ్ల కిందట పేదలు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. పేదల ముసుగులో కొంతమంది బడాబాబులు, నాయకులు ఈ స్థలంలో పాగా వేశారు. పేదలకు పక్కా గృహాలు నిర్మించేందుకు ఇది అనువైన ప్రదేశంగా గుర్తించినా ఓటుబ్యాంకు రాజకీయాలతో సరైన నిర్ణయం తీసుకోవటం లేదు. బోర్డుల తొలగింపుపట్టణంలోని ఓ చెరువు చుట్టూ ఉన్న శిఖం భూమిపై కబ్జాదారులు దృష్టి సారించారని ప్రచారం సాగుతోంది. ప్రజావసరాల పేరిట కొంతభాగాన్ని దారిగా మార్చేశారు. మార్కెట్ నుంచి ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లే దారిలో నాలుగైదుచోట్ల హెచ్చరిక బోర్డులు కనిపించేవి. ఇప్పుడవి కనుమరుగయ్యాయి. ఇదేమార్గంలో ఇప్పటికీ సర్కారు స్థలం ఒకచోట ఖాళీగా దర్శనమిస్తోంది. బస్టాండ్ వెనుక వైపు వీధిలో ఒకచోట దేవస్థానం భూమి ఉండేది. ఇక్కడ హెచ్చరిక బోర్డు తొలగించి భవనాలు నిర్మించారు.

# యూరియా.. సులువుగా దొరుకుతుందయా



సిరిసిల్ల : రైతులు యూరియా కోసం ఇకనుంచి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఉండాల్సిన అవసరంలేదు. వ్యవసాయ శాఖ తీసుకొస్తున్న ఫెర్టిలైజర్ యాప్‌లో బుక్ చేసుకుంటే నేరుగా రైతులకు అందుతుంది. ఈ కొత్త సాంకేతిక వ్యవస్థను వ్యవసాయశాఖ ఈనెల 20 నుంచి అమల్లోకి తెస్తుంది. గత ఖరీఫ్ సీజన్‌లో అవసరం మేరకు యూరియా లభ్యం కాకపోవడంతో పలుచోట్ల రైతులు ఆందోళనలు, ధర్నాలకు దిగారు. ఈ క్రమంలో యూరియా పక్కదారి పట్టకుండా సాగు రైతులకందేలా ఈ విధానం అమల్లోకి తీసుకొస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సదరు యాప్ వినియోగంపై ఆయా మండలాల్లోని రైతు వేదికల్లో ఈనెల 19న అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

**21 వేల మెట్రిక్ టన్నులు..**

ఈ సీజన్‌లో దాదాపు జిల్లా వ్యాప్తంగా లక్షా 94 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానున్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందుకుగాను 21 వేల మెట్రిక్ టన్నులమేర అవసరం కానుంది. రైతులు ఒకేసారి తీసుకెళ్లడం, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడం వంటివాటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యావ్‌ను రూపొందించింది. ఈ యాప్ వినియోగంతో జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా సంచుల సంఖ్య కనిపిస్తుంది.

**పట్టా పాసుబుక్ నంబర్ ద్వారా..**

యాప్‌లో పట్టాదారు పాసు పుస్తకం నంబర్ నమోదు చేయగానే చరవాణికి ఓటీపీ వస్తుంది. అది నమోదు చేయగానే సదరు రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉంది. ఏ పంట వేశారనే వివరాలతోపాటు పంటకు ఎంతమేర యూరియా అవసరమనే సమాచారం, బుకింగ్ ఐడీ వస్తుంది. ఏదైనా అధీకృత రిటైలర్, లేదా సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసుకునే అవకాశం రైతులకు కల్పిస్తారు. రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విడతల వారీగా యూరియా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సాగు చేసే భూమి పరిమాణం ఆధారంగా వారికి అవసరమయ్యే యూరియా సంచుల సంఖ్య యాప్‌లో కనిపిస్తుంది. బుకింగ్ కేవలం 48 గంటలు మాత్రమే ఉంటుంది. ఆలోగా తీసుకోనట్లయితే తిరిగి అది స్లాట్‌లోకి వెళుతుంది. ఆ యాప్‌తో జిల్లా మొత్తంలో యూరియా ఎక్కడెక్కడ ఎంత అందుబాటులో ఉందనే సమాచారం అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

# గురుకులం పిలుస్తోంది




మంచిర్యాల : సకల వసతులు, ఆధునిక హంగులు, ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, వసతితోపాటు విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు అందించేందుకు ప్రత్యేకంగా గురుకులాలను నిర్వహిస్తోంది. ఇందులో ప్రవేశాలకు వచ్చే విద్యాసంవత్సరానికి ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి ప్రవేశ ప్రకటన విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో నూతన ప్రవేశాలు 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీలకు బాలబాలికలకు ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే విద్యార్థుల నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించగా వచ్చే ఏడాది జనవరి 21 వరకు గడువు విధించారు.

**జిల్లాలో 18 గురుకులాలు**

మంచిర్యాల జిల్లాలో మహాత్మా జ్యోతిబాపులే-8, సాంఘిక సంక్షేమ-9, జనరల్-1 మొత్తం 18 గురుకులాలు ఉన్నాయి. ఇందులో బాలురకు 10, బాలికల గురుకులాలు 8 ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 5వ తరగతికి 80 సీట్ల చొప్పున అవకాశం కల్పిస్తారు. ఈ లెక్కన 1,440 మందికి ప్రవేశాలు దక్కనున్నాయి. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న వారు అర్హులు. 6 నుంచి 9వ తరగతులకు ఆయా ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది.

**పరీక్ష విధానం**

5వ తరగతికి సంబంధించి రెండు గంటల పాటు నిర్వహించే పరీక్షలో మొత్తంగా 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మొత్తంగా 5 విభాగాలకు సంబంధించి తెలుగు-20, ఆంగ్లం-25, గణితం-25, ఈవీఎస్-20, మెంటల్ ఎబిలిటీ-10 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ షీట్‌లో బబుల్ రూపంలో దిద్దాల్సి ఉంటుంది. తెలుగు, ఆంగ్ల భాషల్లో పరీక్ష రాసే వెసులుబాటుంది.

దరఖాస్తుకు కావాల్సినవి
చరవాణి నెంబర్
విద్యార్థి ఫొటో
ఆధార్‌కార్డు
దివ్యాంగులైతే ధ్రువపత్రం
మీసేవ కుల, ఆదాయ ధ్రువపత్రాలు
బోనఫైడ్ (నాలుగో తరగతి)

ముఖ్య సమాచారం
దరఖాస్తు వెబ్‌సైట్: %www.tswreis.in, tgcet.cgg.gov.in
%దరఖాస్తు చివరి తేదీ : జనవరి 21
పరీక్ష రుసుం : రూ.100
పరీక్ష తేదీ : ఫిబ్రవరి 22(ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు)
వయసు : 2026 ఆగస్టు 31 నాటికి ఎస్సీ, ఎస్టీలకు 13 ఏళ్లు, బీసీ, ఇతర వర్గాలవారు 11 ఏళ్లలోపు ఉండాలి.
వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుల సమయంలో వివరాలు జాగ్రత్తగా నమోదుచేయాలి. తప్పుల సవరణకు అవకాశం ఉండదు.

# పేరు చారిగాం.. మద్యానికి దూరం



కాగజ్‌నగర్ : అదొక చిన్న గ్రామం. కానీ ప్రజల ఆదర్శం చాలా పెద్దది. మద్యం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి మద్యం తాగవద్దని పూర్వీకులు కట్టుబాటు చేశారు. నేటి తరం ఇప్పటికీ పాటిస్తున్నారు. గ్రామంలో గుడుంబా తయారీ, మద్యం గొలుసు దుకాణాలను ఏర్పాటు చేయొద్దని మూడున్నర దశాబ్దాల కిందటే తీర్మానించిన పెద్దలు, యువత.. కట్టుబడి ఉండేలా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా అక్కడి కుటుంబాల్లో ఆప్యాయతలు వెల్లివిరుస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా కూడా అభ్యర్థులు మద్యం పంపిణీకి తావివ్వకుండా చర్యలు తీసుకోవడం గమనార్హం. కాగజ్‌నగర్ మండలం బురదగూడ పంచాయతీ పరిధిలోని చారిగాం.. శాంతి భద్రతలకు నిలయంగా మారి ఆదర్శంగా నిలుస్తోంది. కాగజ్‌నగర్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో చారిగాం ఉంటుంది. ఇక్కడ అన్నీ వ్యవసాయ కుటుంబాలే. ప్రధానంగా కూరగాయలు పండించి పట్టణ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. 35ఏళ్లుగా గ్రామంలో మద్యపాన నిషేధం అమలుచేస్తున్నారు. ఇక్కడి యువత బయట తాగినట్లు తెలిస్తే స్థానిక ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి మాలధారణ చేయిస్తున్నారు. ఆధ్యాత్మిక చింతన వల్ల కలిగే లాభాలను వివరిస్తూ మరోసారి మద్యం జోలికి వెళ్లకుండా అవగాహన కల్పిస్తున్నారు. మద్యానికి దూరంగా ఉంటున్న గ్రామంలో అందరూ కలిసిమెలసి ఉంటున్నారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా.. 35 ఏళ్లుగా ఏ ఒక్కరూ పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కలేదంటే అతిశయోక్తి కాదు. **స్ఫూర్తిగా తీసుకోవాలి** కాగజ్‌నగర్ గ్రామీణ ఠాణా పరిధిలోని చారిగాంలో 35 ఏళ్లుగా ఎలాంటి కేసులు లేవు. గుడుంబా, గొలుసు దుకాణాలను కట్టడి చేయడంలో అధికారులకే వదిలి వేయకుండా ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. చారిగాంను స్ఫూర్తిగా తీసుకొని మద్యనిషేధం పాటిస్తే ఎన్నో కుటుంబాలు పురోగాభివృద్ధి చెందుతాయి. ఎస్సై సందీప్‌కుమార్, కాగజ్‌నగర్ గ్రామీణం**ఎన్నికల వేళ కూడా రానివ్వలేదు** గ్రామ పూర్వీకులు చేసిన కట్టుబాటును తప్పకుండా పాటిస్తున్నాం. వంద శాతం మద్య నిషేధాన్ని కొనసాగిస్తున్నాం. గుడుంబా తయారీ, గొలుసు దుకాణాల ఏర్పాటుకు దూరంగా ఉంటున్నాం.

# హస్తం హవా..

ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు విడతలుగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ 604 స్థానాల్లో తన మద్దతుదార్ల గెలుపుతో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో కలిసి వచ్చినట్లయింది. భారాస, భాజపాలు రెండు మూడు స్థానాల్లో నిలిచాయి. స్వతంత్రులుగా బరిలో నిలిచిన అభ్యర్థులకు సైతం ఓటర్లు పెద్ద సంఖ్యలో జైకొట్టారు. ఈ నెల 11, 14, 17న జరిగిన మూడు విడతల్లో మొత్తం 1514 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడి, మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం గూడెం, నెల్కివెంకటాపూర్, అందూర్‌గూడ, వేమనపల్లి మండలం రాజారం, కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం రాపెల్లి, చిలాటిగూడ, వాంకిడి మండలం తేజాపూర్ సహా నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలంలోని పెర్కపల్లి పంచాయతీలు మొత్తం తొమ్మిదింటికి ఎన్నికలు జరగలేదు. మిగిలిన 1505 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. శాసనసభ నియోజకవర్గాల వారీగా ఫలితాల సరళిని పరిశీలిస్తే సిట్టింగ్ ఎమ్మెల్యేలు బాగా ప్రభావం చూపినట్లు వెల్లడైంది. 292 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థుల విజయాన్ని పార్టీలు తమ ఖాతాలో వేసుకోవటం రాజకీయ చర్చకు దారితీస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 351 స్థానాలతో భారాస పార్టీ రెండో స్థానంలో నిలిచింది. నిర్మల్ జిల్లాలో భాజపా మద్దతుదార్లు ఎక్కువ సంఖ్యలో విజయం సాధించారు. మంచిర్యాల జిల్లాలో అతితక్కువ స్థానాలు గెలవగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 257 స్థానాలు కాషాయ పార్టీ మద్దతుదార్లకు దక్కాయి...



నిర్మల్ జిల్లాలో భాజపా, కాంగ్రెస్ ఢీ అంటే ఢీ అన్నట్టుగా పోటీ పడ్డాయి. రెండు,మూడు విడతల్లో భాజపా ఆధిక్యం ప్రదర్శించింది. ఆ పార్టీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, శ్రీహరిరావులు ప్రభావం చూపారు. మేజర్ పంచాయతీలైన బాసర, ముథోల్, కుభీర్ స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదార్లు గెలుపొందారు. భారాస జిల్లాలో ప్రభావం చూపలేదు. ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్, భారాసలు ఆధిక్యాన్ని ప్రదర్శించాయి. ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, అనిల్ జాదవ్, కోవలక్ష్మి, ఇతర నాయకులు తమ మద్దతుదార్ల గెలుపుకోసం శ్రమించారు. భాజపా ఎంపీ, ఎమ్మెల్యేలున్నప్పటికీ 64 స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పూర్తిస్థాయి ఆధిక్యతను ప్రదర్శించింది. రాష్ట్రమంత్రి వివేక్, వినోద్, వెడ్మ బొజ్జు, ప్రేంసాగర్‌రావు వర్గం సహా డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు చేసిన ప్రయత్నాలు శ్రేణుల్లో ఉత్సాహం నింపాయి. అయితే చాలాచోట్ల స్వతంత్రులది పైచేయి కావడం గమనార్హం. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థులున్నారని సమాచారం. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు కలిసివచ్చినట్లుగా వెల్లడవుతోంది. భారాస మద్దతుదార్లు 57 స్థానాలతో రెండో స్థానంలో నిలిచారు. భాజపా పెద్దగా ప్రభావం చూపలేదు. కుమురంభీం జిల్లాలో భారాస, కాంగ్రెస్ పోటాపోటీగా ఆధిక్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశాయి. ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోనప్ప, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌లు భారాస మద్దతుదార్ల గెలుపుపై ప్రభావం చూపారు. అధికార పార్టీ కావడంతోపాటు, కాంగ్రెస్ నేతలు ఆత్రం సుగుణ, శ్యాంనాయక్ తదితర నాయకుల శ్రమతో ఇక్కడ మంచి ఫలితాలు వచ్చాయి. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ భాజపా కొద్దిస్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది.

# లెక్క తేలాలి!

సంగారెడ్డి : మహిళలను కోటీశ్వరులను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వారికి స్వయం ఉపాధి కల్పించి వ్యాపార రంగంలో రాణించేలా సర్కారు ఆలోచన చేస్తోంది. ఇందులో భాగంగా సంగారెడ్డి పట్టణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యుల ద్వారా బైపాస్ రోడ్డులో మహిళా శక్తి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి అందుబాటులోకి వచ్చింది. పెట్రోల్ బంక్ నిర్మాణం, ఫర్నిచర్ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.10 లక్షల రుణం తీసుకున్నారు. ఇందులో రూ. 6.5 లక్షల వరకు వ్యయానికి సంబంధించి బిల్లులు, వివరాలు ఉండగా.. మిగతా రూ.3.5 లక్షల వివరాలపై స్పష్టత కరవైనట్లు సమాచారం.

**కలెక్టర్ ఆదేశం.. పరిశీలించిన ఆడిటర్లు**



సంగారెడ్డిలో మహిళా సంఘం సభ్యుల ద్వారా నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను ఆగస్టు 7న జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, రోజువారీ అమ్మకాలు, యూపీఐ లావాదేవీల వివరాలు పరిశీలించారు. కచ్చితమైన లెక్కలు చూపాలని అదే రోజు ఆదేశించారు. ఆయా లెక్కలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నలుగురు ఆడిటర్లను నియమించారు. వారు ఇచ్చిన నివేదికలోనూ రూ.3.5 లక్షలకు సంబంధించిన వివరాలు లేవని తేలింది. ఇక్కడ 12 మంది మహిళలు రూ.13,500 వేతనానికి పనిచేస్తున్నారు. రూ.3.5 లక్షలను వీరి నుంచి రికవరీ చేసే దిశగా అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

**పక్కా సమాచారం లేదు**

– జ్యోతి, డీఆర్‌డీవో

మహిళా శక్తి పెట్రోల్ బంక్‌లో లెక్కలు తేల్చాలని నలుగురు ఆడిటర్లను నియమించాం. ఎంత ఖర్చు చేశారనే వివరాలు పక్కాగా లేవని తేలింది. అక్కడ పనిచేసే సిబ్బంది నుంచి రికవరీ చేసే విషయమై ఆలోచిస్తున్నాం. ఈ విషయాన్ని కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు.

# నీటి‘బొట్టు’... జల‘సిరి’కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రెయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

# ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ ‘న్యూస్‌టుడే’తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850
ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20
యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు
చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

# రెండుచోట్ల తాగునీరు కలుషితం..


ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# ఫోన్ పోయినా.. సొమ్ము భద్రంగా



హైదరాబాద్: తారామతిపేటకు చెందిన రైతు ఇటీవల మార్కెట్‌కు వెళ్లాడు. అతని జేబులోని ఫోన్ కొట్టేసిన దొంగలు యూపీఐ యాప్ ద్వారా ఖాతాలోని రూ.4.26 లక్షలను బదిలీ చేసుకున్నారు. రైతు కొత్త ఫోన్ కొని సిమ్ కార్డు యాక్టివేట్ చేయించుకుని బ్యాంకు ఖాతాల్ని తనిఖీ చేయగా విషయం బయటపడింది.

సోమాజిగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి బస్సులో వెళ్తుండగా ఫోన్ చోరీకి గురైంది. సిమ్ బ్లాక్ చేయించేలోపు.. రూ.34 వేలు కొట్టేశారు. బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేయించడంతో ఖాతాలోని మిగతా డబ్బును కాపాడుకోగలిగాడు.

ఈ రెండు ఉదంతాల్లో ఫోన్ పోగొట్టుకోవడం కంటే.. బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కొట్టేయడం బాధితుల్ని ఎక్కువ కలవరపెట్టింది. ఫోన్ పోయిన తర్వాత యజమానులు వాటి ఆచూకీ కోసం గంటల తరబడి వెతుకుతుంటే.. దొంగలు మాత్రం క్షణం ఆలస్యం చేయకుండా డబ్బంతా బదిలీ చేసుకుంటున్నారు. కొన్నాళ్లుగా రాజధానిలో ఈ తరహా కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాఫ్ట్‌వేర్ రాకతో కొట్టేసిన ఫోన్లను పోలీసులు రికవరీ చేస్తున్నా.. డబ్బు తిరిగిరావడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ఫోన్లు పోయినా, చోరీ అయినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా యూపీఐ యాప్‌లు, బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించాలని పోలీసులు సూచిస్తున్నారు.

**దొంగలు ఏం చేస్తున్నారు..?**

చాలామంది యూపీఐ పిన్/పాస్‌వర్డ్ తేలిగ్గా ఉండేవి.. ఫోన్ నంబరులోని తొలి అంకెల్ని పెట్టుకుంటున్నారు. ఇలాంటివి తేలిగ్గా గుర్తిస్తున్న దొంగలు డబ్బు బదిలీ చేసుకుంటున్నారు.

కొట్టేసిన ఫోన్‌లో బ్యాంకు ఖాతాలకు అనుసంధానమైన సిమ్ ఉంటుంది. దీనిద్వారా కొత్త పిన్ క్రియేట్ చేస్తున్నారు. ఇదంతా గంట, అరగంటలోనే జరుగుతోంది.

**మనమేం చేయాలంటే..?**

ఫోన్ పోగొట్టుకుంటే ఆలస్యం చేయకుండా మొదట సిమ్‌కార్డు, యూపీఐ ఖాతాలకు లింకైనా బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించాలి. సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ చోరీ గురించి ఫిర్యాదు చేయాలి. దీనివల్ల సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుక్కోవచ్చు.

# డిగ్రీ విద్య.. అంతా మిథ్య !




హైదరాబాద్ : మహేశ్వరంలో ప్రభుత్వం నిర్మించిన డిగ్రీ కళాశాల ఇది. విద్యార్థులకు తరగతి గదులు, ప్రయోగశాలలు, అధ్యాపకులకు కలిపి కనీసం 20 గదులుండాలి. ఇక్కడ కేవలం నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. 280మంది విద్యార్థులకు అధ్యాపకులు ఇక్కడే చదువు చెబుతున్నారు. స్థలం సరిపోనప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని గదుల్లో బోధిస్తున్నారు. నిధులు విడుదల లేకపోవడంతో.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. మూడు జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూకట్‌పల్లిలో కొత్త డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో జూనియర్ కళాశాలల్లో షిఫ్టు పద్ధతిలో డిగ్రీ, ఇంటర్ తరగతులు చెబుతున్నారు.

**వందల మంది విద్యార్థులు..**

ఎప్‌సెట్, నీట్ ప్రవేశ పరీక్షల్లో అనుకున్న ర్యాంకులు రాని విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నారు. ఏటా వందల మంది అడ్మిషన్లు తీసుకుంటున్నా సరిపడా అచార్యులు, అధ్యాపకులను ప్రభుత్వం నియమించడం లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కళాశాలల్లో 38వేల మంది విద్యార్థులు ఉండగా, పాతబస్తీ సిటీ కళాశాలలో అత్యధికంగా 4500 మంది చదువుతున్నారు. రెండు, మూడేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన కళాశాలల్లో 200-400 మంది విద్యనభ్యసిస్తున్నారు.

**కొత్త కోర్సులున్నా.. ప్రయోగ పరికరాలు సున్నా**

యూనిర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా డిగ్రీలోని సైన్స్ సబ్జెక్టుల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టారు. భౌతిక, జీవ, రసాయన, గణితశాస్త్రాల్లో అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలు చేర్చారు. తరగతులతో పాటు ప్రయోగశాలల్లో ఎక్కువగా విషయ పరిజ్ఞానం పెంచుకునేందుకు వీలుగా మూల్యాంకనాన్ని రూపొందించారు. పాఠాలు ఆచార్యులు, అధ్యాపకులు ఎలాగోలా చెప్పినా, ప్రయోగశాలల్లో సరైన పరికరాలు లేవు. న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

గ్రేటర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 24
జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నవి 18
విద్యార్థుల సంఖ్య : 38,052

# ఆలయాల పరిహారం ఫలహారం



సిరిసిల్ల: వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణం ఇది. దీనికి 2017లో రూ.32.91 లక్షల పరిహారం మంజూరైంది. సంఘానికి నిధులు అందక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

జిల్లాలో మధ్యమానేరు జలాశయంలో 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లించినా చాలా గ్రామాల్లోని ఆలయాల పరిహారం మాత్రం ఇప్పటికీ అందలేదు. కొన్నిచోట్ల పరిహారం లెక్కించి రెవెన్యూ డిపాజిట్ చేశారు. గ్రామ దేవతల విగ్రహాల తరలింపు, తాత్కాలిక ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో ఉత్సవాల నిర్వహణ పేరిట ఒక్కో గ్రామంలో ఫలహారంలా రూ.లక్షలు ఖర్చు చేశారు. నిర్మాణాలకు వచ్చే సరికి మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. జాయింట్ బ్యాంకు ఖాతాలోని నిధులను గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు కలిసి నిర్మాణాల ప్రారంభం పేరుతో డ్రా చేసుకున్నా లెక్కా పత్రం లేదు.

**ఖాళీ ప్లాట్లు కనుమరుగు**బోయినపల్లి, వేములవాడ అర్బన్, గ్రామీణం, తంగళ్లపల్లి మండలాల్లో తొమ్మిది ప్రాంతాల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల వంటి సామాజిక భవనాలను మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వమే నిర్మించింది. ముంపు గ్రామాల్లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు ఉన్నాయి. ఇప్పటికీ చాలా వరకు వాటి పరిహారం లెక్కించ లేదు. గ్రామస్థులు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కనీసం స్థలాలైనా కేటాయించాలని కోరారు. ఆలయాలకు కేటాయించిన స్థలాలు సైతం ఆక్రమణకు గురయ్యాయి.

ప్రభుత్వం 2023లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుకొనేలా ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇక అప్పటి నుంచి కాలనీలో ఖాళీ స్థలాల్లో అక్రమ పట్టాలు పుట్టుకొస్తున్నాయి. దీనికి రెవెన్యూ అధికారుల సహకారం ఉందనే విమర్శలు ఉన్నాయి. అగ్రహారం పక్కనే ఉన్న చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఇతరులు పట్టాలు పొందారు. దీంతో వారు రూ.60 లక్షలు సొంత ఖర్చులు వెచ్చించి కాలనీ శివారులోని గుట్టపై ఆలయాన్ని ర్మించుకుంటున్నారు.

ఆలయాల కోసం కేటాయించిన స్థలాలను సైతం హద్దులు చెరిపేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీర్లవంచ, చింతల్‌ఠాణాల్లో గ్రామాల్లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు ఉన్నాయి. వాటికి ఇప్పటికీ అంచనాలు లేవు. పరిహారం అందించిన నిర్మాణాలు సైతం అసంపూర్తిగా ఉన్నాయి.

# గోస పడిన అమ్మను.. ధ్యాస పెడితే పట్టగొమ్మను


కరీంనగర్ :‘ఏం జెప్పాలె.. ఎట్ల మొదలుపెట్టాలె’.. ప్రగతికి పట్టుగొమ్మ అన్న ఖ్యాతి నుంచి.. అధ్వానమనే దుస్థితికి కొన్ని నెలలుగా దిగజారిపోయా! ‘ఊరూ.. పల్లెటూరు.. దీని తీరే అమ్మ తీరు’ అని పాటలు పాడే ప్రజలే.. ఇదేం ఊరని బాధ పడుతుండటం చూసి నిత్యం చలించపోయా! నన్ను చూస్తేనే ఇది నేనేనా? అనే విధంగా నా రూపురేఖలు దయనీయంగా మారాయి. మురుగు కాలువలను సకాలంలో శుభ్రపర్చక.. పోగైన చెత్తాచెదారాన్ని తొలగించక.. దుర్వాసన అనుభవించా. 2024 జనవరి నెలాఖరుతో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో 22 నెలలుగా అనాథనయ్యాను. పేరకు ప్రత్యేక పాలన పెట్టినా.. నా ఆలనా పాలన చూసే నాథుడే కరవయ్యాడు. పాపం.. వాళ్లనని ఏం లాభం? ఒక్కో సారు.. మూడు, నాలుగు ఊళ్లను తిరగవట్టే! ఇగ మా బాగుకు వచ్చే నిధుల గోస.. కటకట మీకు తెలియంది కాదు! జనాభా ఆధారంగా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయినయ్. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోత నా ప్రగతికి అవరోధంగానే మారింది. పైసా పైసాకు చాలా కష్టమొచ్చింది. కనీసం ఊడవడానికి చీపుర్లను కొనలేని కష్టకాలం కొన్నిసార్లు కనిపించింది. ఇగ త్వరలో ఎన్నికలన్న మాట విన్న ప్రతిసారీ నాకు ప్రాణమొచ్చినంత సంబురమయ్యేది. రిజర్వేషన్ల గోల.. కోర్టుల ముచ్చట్లు.. జనంలో ఎన్నికలనే మాటలు వినంగానే ఆశలు చిగురించేవి. మళ్లీ నన్ను పట్టించుకునేందుకు.. నా బాగు కోరుకునేందుకు



ఓ సర్పంచి వస్తాడనే భరోసా కలిగేది.. ఇలా ఎన్నాళ్లో వేచిన ఉదయమిదే అన్నట్లుగా మదన పడుతుండగా నా లోగిళ్లలో మళ్లీ ఓట్ల పండుగొచ్చింది. ఉమ్మడి జిల్లాలో కొత్త సర్పంచులు 1224 మంది, వార్డు సభ్యులు 11,195 మంది ఎన్నికవబోతున్నారు. ఈ సందర్భంగా నా బాగు కోసం పరితపించే నా బిడ్డలైన ప్రజలందరికీ ఒకే విన్నపం చేస్తున్నా. నాకు.. మీకు సేవ చేసే మంచి నాయకుడికి పట్టం కట్టండి.. పాలనలో మిమ్మల్ని మురిపించాలి. అభివృద్ధి విషయంలో నన్ను మెప్పించాలి. నా ఖ్యాతిని మరింతగా పెంచాలి. నా ఊరు.. నా ప్రజలు అని పరితపించే మంచి సేవకులను గెలిపిస్తారని ఆశిస్తున్నా . ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తయి.. వచ్చే అయిదేళ్ల పాటు నా బాగు కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు మరింతగా కృషి చేస్తారని నమ్ముతూ..

# రిజర్వేషన్ టిక్కెట్‌లో తప్పుడు సమయం

కాచిగూడ: రిజర్వేషన్ టిక్కెట్‌లో బయలుదేరే సమయం తప్పుగా రావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వారు కాచిగూడ స్టేషన్‌కు వచ్చే లోపే రైలు వెళ్లిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పశ్చిమ రైల్వే రాజ్‌కోట్ డివిజన్ వారు ఓఖా-మధురై మధ్యన ప్రత్యేక రైలు నడుపుతున్నారు. వారంలో బుధవారం రోజు ఓఖా నుంచి మధురై వెళ్లే క్రమంలో ఉదయం 9.10 గంటలకు కాచిగూడకు వస్తుంది. 9.20 గంటలకు బయలుదేరి వెళుతుంది. ఈ రైలులో అరుణాచలం (తిరువణ్ణామలై), మధురైకి వెళ్లడానికి నగరానికి చెందిన 29 మంది ప్రయాణికులు ఈ నెల 1, 2, 3 తేదీల్లో




టిక్కెట్లను రిజర్వేషన్ చేయించుకున్నారు. టిక్కెట్‌లో రైలు బయలుదేరే సమయం మధ్యాహ్నం 12.10 అని తప్పుగా పడింది. ఈ సమయానికి ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చారు. ఈ రైలు 10.24 గంటలకు కాచిగూడకు వచ్చి 10.49 గంటలకు బయలుదేరి వెళ్లిపోయింది. ప్రయాణికులు నిరసన తెలపడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వారిని సాయంత్రం ప్రత్యేక ఆర్టీసీ బస్సులో నాంపల్లి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు (07230)లో 22 మందిని అరుణాచలం, మధురైకి పంపించారు. మిగిలిన ఏడుగురు తమ డబ్బులను తిరిగి తీసుకున్నారు.

# తెరపైకి తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు

మల్యాల: తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలను సమీపంలోని బడిలో విలీనం చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఆదర్శ పాఠశాలల మాదిరిగా ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్స్’ పేరిట కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా విద్యాధికారుల అభిప్రాయం తెలుసుకునేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

**1 నుంచి 12వ తరగతి వరకు..**విద్యార్థుల సంఖ్య తగ్గిన పాఠశాలలను సమీప బడుల్లో విలీనం చేస్తే బోధన సులభతరమవుతుందని ప్రభుత్వం యోచిస్తోంది. ఉపాధ్యాయుల కొరత కూడా తీరనుంది.

పది మంది లోపు ఉన్న పాఠశాలల నుంచి విద్యార్థులను సమీపంలోని పెద్ద పాఠశాలలో చేర్పిస్తారు. ఆ పాఠశాలను ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్’గా మారుస్తారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో 1 నుంచి 12 వ తరగతి వరకు నిర్వహిస్తారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ సమకూరుస్తారు.యూడైస్ నివేదిక ప్రకారం జిల్లాలోని 53 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేరు. 60 బడుల్లో 10 మందిలోపు ఉన్నారు. 7 పాఠశాలల్లో 10 మంది చొప్పున ఉన్నారు.

సర్కారుపై తగ్గనున్న భారంప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 10లోపు ఉన్నా ప్రభుత్వం ఓ ఉపాధ్యాయుడిని, మధ్యాహ్న భోజన ఏజెన్సీని, ఏటా రూ.10 వేల పాఠశాల గ్రాంటును సమకూరుస్తోంది. ఒక స్కావెంజర్‌ను నియమించాల్సి ఉంటుంది. తక్కువ మంది ఉన్న పాఠశాలల నుంచి విద్యార్థులను సమీప బడిలో విలీనం చేస్తే ఈ ఖర్చులన్నీ తప్పుతాయి. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ముగ్గురు నుంచి అయిదుగురు విద్యార్థులే ఉన్నారు. వీరిని సమీపంలోని పెద్ద పాఠశాలకు పంపించడానికి రవాణా వసతి కల్పించేలా యోచిస్తున్నట్లు సమాచారం.**ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్స్’ ఏర్పాటు చేయడానికి యోచిస్తున్నారు. దీంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన అందనుంది. అమలులోకి వచ్చే అవకాశం ఉంది.

# కడలిలో చిక్కినా.. ధర దక్కలేదు!

విశాఖ : విశాఖ తూర్పు తీరంలో ట్యూనా చేపల దిగుబడి అధికంగా ఉంది. మత్స్యకారుల వేటలో 50 నుంచి 60 రకాల చేపలు లభ్యమైతే, వాటిల్లో ట్యూనాలు 50 శాతానికిపైగా ఉంటున్నాయి. సరైన మార్కెటింగ్ సదుపాయం లేక, విదేశాలకు ఎగుమతి కావడం లేదు. దేశీయ మార్కెట్‌లో విక్రయిస్తున్నా.. గిట్టుబాటు ధర రావడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

**ఏడాది పాటు సర్వే..!**

గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు విశాఖ చేపలరేవు, పూడిమడక, కాకినాడ కేంద్రాలుగా లభ్యమైన సముద్ర ఉత్పత్తులపై భారత మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) శాస్త్రవేత్తలు సర్వే నిర్వహించారు.

ఎఫ్ఎస్ఐ విశాఖ జోన్ కార్యాలయం ఇన్‌ఛార్జి సి.ధనుంజయరావు



ఆధ్వర్యంలో శాస్త్రవేత్త జీవీఏ.ప్రసాద్ కీలక పరిశోధనలు చేశారు.

ఇదీ పరిస్థితి..: విశాఖ కేంద్రంగా 120 మర పడవల ద్వారా ట్యూనాల వేట సాగుతోంది. ట్యూనాలో పసుపురెక్కల సూరలు, నామాల సూరలు ఉంటాయి. రోజూ చేపలరేవుకు 100 టన్నుల ట్యూనాలు వస్తున్నాయి. సముద్ర జలాల్లో 70 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత ట్యూనాలు లభ్యమవుతున్నాయి. ట్యూనాల తర్వాత కొమ్ముకోనాం చేపలు అధికంగా దొరుకుతున్నాయి.ట్యూనా చేపలు కిలో ధర ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. అవి కేరళ, తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.విదేశీ మార్కెటింగ్‌తోనే ప్రయోజనం: ట్యూనాలకు మార్కెటింగ్ సదుపాయంతో పాటు, శీతల గిడ్డంగులు, శుద్ధి చేసే యూనిట్లు అందుబాటులోకి తీసుకురావాలి. పోషకాలు ఎక్కువగా ఉండడంతో... అమెరికా, జపాన్, యూరప్, దక్షిణ ఆసియా దేశాల్లో ట్యూనాల వినియోగం అధికంగా ఉంది. అక్కడకు ఎగుమతి చేస్తే మంచి ధర లభిస్తుంది.- ధనుంజయరావు, జీవీఏ.ప్రసాద్ (ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్తలు)

# నిగ్గు తేల్చమంటే నీరుగార్చారు!

అనకాపల్లి : మాకవరపాలెం మండలంలో వందల ఎకరాలకు నీరు అందించే పాపయ్యపాలెం జలాశయం అక్రమార్కుల కన్నుపడి బక్కచిక్కిపోతోంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడంతో కబ్జాదారుల కొనసాగుతోంది. జలాశయ భూములు చదును చేసి.. సరుగుడు, అరటి తోటలు వేస్తున్నారు. అధికారులేమో ఆక్రమణలేనంటూ అక్రమార్కులను వెనకేసుకొస్తున్నారు.పాపయ్యపాలెం రిజర్వాయర్ సుమారు 90 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని నుంచి పాపయ్యపాలెం, బుచ్చెయ్యపాలెం, మునిసిపాలెం పరిసర ప్రాంతాల్లోని సుమారు 500 ఎకరాలకు నీరందుతుంది. గత తెదేపా హయాంలో రిజర్వాయర్ స్థలాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించారు. దీంతోపాటు రూ. 70 లక్షలకు పైగా ఖర్చుచేసి.. పంటకాలువలు, మదుములు అభివృద్ధి చేశారు. తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వాయర్ భూముల్లో ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. మూడేళ్ల క్రితం కొంతమంది 15 ఎకరాలకు పైగా చదునుచేసి ఆక్రమించుకుని సరుగుడు తోట వేసుకున్నారు. దీనిపై గతంలో ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. కొన్నాళ్ల క్రితం కొన్నాళ్ల క్రితం అన్ని పార్టీల నేతలూ కుమ్మక్కయి మరో 16 ఎకరాలను



ఆక్రమించి యంత్రాలతో చదును చేశారు. అప్పట్లో దీనిపై స్థానికంగా దుమారం రేపింది. తెదేపాకు చెందిన పలువురు నేతలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.

పాపయ్యపాలెం జలాశయ భూముల ఆక్రమణపై పత్రికల్లో కథనాలు రావడంతో శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు స్పందించి జలాశయం మొత్తాన్ని సర్వే చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. కానీ.. ఒక్క సెంటు స్థలం కూడా కబ్జాకు గురవ్వలేదని తేల్చారు. అక్రమార్కులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయి తూతూమంత్రంగా సర్వే చేశారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. జలాశయం పరిధిలో సాగుచేస్తున్న పంటలు కళ్లముందే కనిపిస్తున్నా.. ఆక్రమణలు లేవంటూ ప్రకటించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక కమిటీ వేసి సమగ్రంగా జలాశయాన్ని సర్వే చేసి.. ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

**త్వరలో హద్దుల్లో రాళ్లు పాతిస్తాం..:**

రిజర్వాయర్ ఆక్రమణలపై కొన్నాళ్ల క్రితం అందిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. ఆర్ఐ, ఏఈ, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓ లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసి.. సర్వే చేశాం. సెంటు స్థలం కూడా కబ్జాకు గురవ్వలేదు. త్వరలో హద్దుల్లో రాళ్లు పాతిస్తాం.

- వెంకటరమణ, తహసీల్దారు, మాకవరపాలెం

# అదే దందా.. ఉచితం వీలుందా?



చిత్తూరు : ఇసుక భారం వినియోగదారులపై ఏమాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం సీనరేజీ ఎత్తేసి తవ్వకాలు, నిర్వహణ, స్టాక్ పాయింట్‌కు ఇసుక తెచ్చినందుకు అయ్యే ఖర్చు మాత్రమే వసూలు చేయాలని ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోతోంది. అవసరమైన నిల్వలు లేక నిర్మాణదారులపై భారం పెరుగుతోంది. బలమున్న వారికే ప్రవేశంతిరుపతి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నారు. నదులు, వాగులు, వంకల్లో ఎవరైనా వెళ్లి ఇసుక తీసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసినా నాయకులు అడ్డు తగులుతున్నారు. మీరు ట్రాక్టరు మాట్లాడుకుని అడిగిన డబ్బు మాకు చెల్లించండి.. మేమే ఇంటికి పంపిస్తామని చెబుతున్నారు. నేతలను కాదని డ్రైవర్లు నదుల్లోకి అడుగుపెట్టే సాహసం చేయడం లేదు. దాంతో శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరు నియోజకవర్గాల్లో ట్రక్కు ఇసుకకు రూ.3-4వేలు చెల్లిస్తున్నారు. అదే ప్రభుత్వం స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ ఉంచితే వినియోగదారులకు రవాణాతో కలిపి రూ.2-3 వేలకే లభిస్తుంది. దగ్గర్లో నిల్వ కేంద్రముంటే రూ.2వేలలోపే దొరుకుతుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని ఆరు స్టాక్ పాయింట్లలో 1,560 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది.

**అన్నమయ్య జిల్లా నుంచి తెప్పించక**

చిత్తూరు జిల్లాలో పెద్దగా నదులు లేవు. నీవా, కుశస్థలిలో కొంతవరకు లభిస్తున్నా అధికార బలమున్న నేతలే విక్రయిస్తున్నారు. గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో స్థానిక నేతలే పెత్తనం చెలాయిస్తున్నారు. దాంతో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరవుతున్నాయి. అన్నమయ్య జిల్లాలోని నందలూరు రేవు నుంచి గతంలో ఇసుక తెప్పించగా ఇప్పుడు నిలిచిపోయింది. ప్రస్తుతం వర్షాలను సాకుగా చూపుతున్నారు. అంతకుముందయినా తెప్పించారా? అంటే అదీ లేదు. జిల్లాలోని మూడు స్టాక్ పాయింట్లలో ప్రస్తుతం 18వేల టన్నులు మాత్రమే నిల్వ ఉంది. పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో చెరువుల్లోని మట్టితో ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారు.


**ఉక్కుపాదం మోపితేనే..**

అక్టోబరు వరకు నదుల్లో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. ప్రస్తుతం తవ్వి తరలించవచ్చు. అయినా గనులశాఖ యంత్రాంగం దీని గురించి పెద్దగా పట్టించుకోవడలేదు. ఇది అక్రమ రవాణాదారులకు వరంలా మారింది. దీనికి అడ్డుకట్ట పడాలంటే స్లాక్ పాయింట్లలో నిల్వలు పెంచడంతోపాటు అక్రమ రవాణాపై రెవెన్యూ, గనులు, పోలీసు శాఖ ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

చిత్తూరు జిల్లాలోని స్టాక్ పాయింట్లు 3, నిల్వలు 18వేల టన్నులు

తిరుపతి జిల్లాలోని స్టాక్ పాయింట్లు 6, నిల్వలు 1,560 టన్నులు

# దారి తప్పిన టెండరు



నంద్యాల : జిల్లా కేంద్రం ఆర్అండ్‌బీ శాఖకు చెందిన రహదారి పనులను అస్మదీయులకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు నివ్వెర పరుస్తున్నాయి. ఏళ్లుగా ఉన్న సమస్యను సరిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుత్తేదారులు ముందుకొచ్చారు కానీ..కొందరు నేతలు కొర్రీలు పెట్టడంతో ముందుకు సాగడం లేదు. నంద్యాల పట్టణంలో రెండు రహదారుల పనులకు రూ.18 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయినా.. పనులు ప్రారంభం కావడం లేదు. ఇందులో ఓ పనికి ఏకంగా మంత్రి, ఉన్నతాధికారులు నెలల క్రితమే శంకుస్థాపన చేశారు. అస్మదీయ గుత్తేదారులకే పనులు కట్టబెట్టేందుకు ఆర్అండ్‌బీ శాఖలో ప్రయత్నాలు పనులకు ఆటంకంగా మారాయి.

9 ఈ రెండు రహదారులు ముగ్గురు ప్రజాప్రతినిధుల మధ్య 'దూరం' పెంచేలా ఉన్నాయి.

**ఆ గుత్తేదారుడిని కాదని..**

బొమ్మలసత్రం-నూనెపల్లె రహదారిని 2.6 కి.మీ.ల పొడవునా అభివృద్ధి చేయడానికి ఎండీఆర్ కింద రూ.13.4 కోట్లతో టెండర్లు పిలిచారు. మూడేళ్ల కిందట అంచనా వ్యయం కన్నా 4.9 శాతం ఎక్కువకు ముందుకు వచ్చిన గుత్తేదారునికి పనులు అప్పగించారు. ఈ మార్గంలోని ఆక్రమణలు తొలగించడంలో జాప్యంతో పనులు నిలిచిపోయాయి. పనులను గాడిలో పెట్టేందుకు ఇటీవల కార్యాచరణ ప్రారంభమైంది. గుత్తేదారుడు సిద్ధంగా ఉన్నప్పటికీ కొంతమంది నాయకులు చక్రం తిప్పి మరో గుత్తేదారునికి పనులు అప్పగించేందుకు పావులు కదుపుతున్నారు. 60 సీ క్లాజ్‌ను తెర పైకి తీసుకొచ్చి అస్మదీయ గుత్తేదారునికి అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై పక్క నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి అభ్యంతరం చెబుతున్నారు.

**రూ.4.5 కోట్ల పని రద్దు**

ఎండీఆర్ ప్లాన్ కింద సంజీవనగర్-శ్రీనివాసనగర్ రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. నలుగురు గుత్తేదారులు పోటీ పడ్డారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన గుత్తేదారునికి పనులు దక్కాయి. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నాలుగు నెలల కిందట శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాకపోగా.. కొద్ది రోజుల క్రితం టెండరును రద్దు చేశారు. మరోసారి టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంచనా వ్యయం కన్నా తక్కువ వేసిన గుత్తేదారునికి పనులు అప్పగించకుండా తన అనుచరుడైన అస్మదీయ గుత్తేదారునికే కట్టబెట్టేందుకు రద్దు చేశారనే ఆరోపణలున్నాయి.

# చెత్తకుప్పలో కాసుల వేట

కర్నూలు : పల్లె నిధులు పంచేసుకొన్నారు. పారిశుద్ధ్యం పేరుతో పక్కదారి పట్టించారు. దస్త్రంలో తప్పుడు లెక్కలు రాసి తప్పించుకొంటున్నారు.. గత ఐదేళ్లుగా పంచాయతీల్లో జరిగిన అక్రమాల బాగోతం ఒక్కోటి వెలుగులోకి వస్తోంది. పంచాయతీ పీఠంపై కూర్చున్న వైకాపా నేతలు లెక్కా పత్రం లేకుండా నిధులు ఖర్చు పెట్టారు.. అవన్నీ బోగస్‌గా తేలిపోయాయి. ఆడిటింగ్‌లో ఇవన్నీ వెలుగులో వచ్చాయి.

**అక్రమాలు 'చెత్త'గించవలెను**

గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు సాధారణ నిధులు(జనరల్ ఫండ్) 15 శాతం, 15వ ఆర్థిక సంఘం నుంచి 50 శాతం వరకు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంది. దీన్ని అవకాశంగా కొందరు సర్పంచులు, కార్యదర్శులు కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. పత్తికొండ, వెల్దుర్తి, కోడుమూరు వంటి మేజర్ పంచాయతీల్లో ఈ దందా ఎక్కువగా కొనసాగింది. పారిశుద్ధ్య పనులకు నిధులు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపించారు. ఇవన్నీ సమీప బంధువుల దుకాణాల నుంచి తెప్పించినవేనని..ఇలాంట బిల్లుల విలువ రూ.1.50 కోట్ల వరకు ఉన్నట్లు ఆడిట్‌లో తేలింది.

**అనుమతుల్లేకుండానే నియామకాలు**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పంచాయతీల్లో ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. జిల్లా సర్వోన్నతాధికారి అనుమతితో డీపీవో ఆదేశాలతో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవాలి. ఇవేమీ లేకుండానే ఇష్టారాజ్యంగా నియమించుకున్నారు.

నంద్యాల జిల్లాలోని పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో ముగ్గురిని అనుమతి లేకుండా నియమించి, నెలకు రూ.15వేల చొప్పున చెల్లిస్తున్నారు. కానాల మేజర్ పంచాయతీల్లో ఇద్దరిని, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం పంచాయతీల్లో ఇలానే నియామకాలు జరిగాయి. వీరంతా ఆయా గ్రామాల సర్పంచులకు కావాల్సిన వారు.

దేవనకొండలో 34 మంది సిబ్బందికి ఏటా రూ.32.25 లక్షలు, మంత్రాలయంలో 34 మందికి ఏకంగా ఏడాదికి రూ.40.14 లక్షలు చెల్లిస్తుండటం గమనార్హం. కోడుమూరులో అయితే 48 మంది కోసం రూ.58.15 లక్షలు వెచ్చిస్తున్నారు.

**ఇదిగో అక్రమాల చిట్టా**



వెల్దుర్తి పంచాయతీకి ఏటా రూ.76 లక్షల ఆదాయం సమకూరుతుంది. 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఏటా రూ.54 లక్షలు చెల్లిస్తున్నట్లు దస్త్రాల్లో రాసుకొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికులకు పొంతన లేదు. లేని కార్మికులను పనిచేస్తున్నట్లు చూపి రూ.25 లక్షల వరకు స్వాహా చేశారు. దీనిపై విచారణ జరుగుతోంది.

రూ.1.28 కోట్ల ఆదాయం వచ్చే పత్తికొండలో 82 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు 'లెక్కలు' రాశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అందుకు విరుద్ధంగా ఉంది.

కోవెలకుంట్ల పంచాయతీకి ఏటా రూ.2 కోట్ల ఆదాయం ఉంది. 44 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు దస్త్రంలో రాసుకొన్నారు. వీరికి ఏటా రూ.40 లక్షలకు పైగా వేతనాలు చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఇక్కడ పనిచేస్తుంది 30 మంది మాత్రమే. రుద్రవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులను ఎవరినీ తీసుకోకుండానే మూడేళ్లుగా కార్మికుల పేరుతో రూ.10 లక్షలు పక్కదారి పట్టించారు.

పంచాయతీలు 970

మేజర్ పంచాయతీలు 38

ఏటా ఆదాయం రూ. 37.5 కోట్లు

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.60.85 కోట్లు

పారిశుద్ధ్యం కోసం వెచ్చిస్తున్న నిధులు రూ.8.1 కోట్లు

# స్వచ్ఛత ఆశయం.. చక్కని ప్రోత్సాహం

నర్సీపట్నం : పల్లెల్లో ఇటు స్వచ్ఛతకు అటు రైతులకు మేలు జరిగే కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకంలో చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఐదు వేల గెత్తం గుంతలు (కంపోస్టు పిట్స్) తవ్వాలని తొలుత లక్ష్యంగా నిర్దేశించారు. నాలుగు రోజుల కిందట 45 వేల గుంతల తవ్వకాలు చేపట్టాలని లక్ష్యాన్ని పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

మండలాల్లో ఏ పల్లెకు వెళ్లినా రోడ్ల పక్కన పశువుల ఎరువు కుప్పలు కనిపిస్తుంటాయి. పశువుల పేడ, గడ్డి ఇతర వ్యర్థాలను గుట్టలుగా వేస్తుంటారు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే సమయంలో సేంద్రియ ఎరువుగా పొలాలకు తరలిస్తారు. అప్పటివరకు ఇవన్నీ రోడ్ల పక్కనే ఉంటాయి. వర్షం పడితే వాటి నుంచి దుర్గంధం వెలువడుతుంటుంది. స్వచ్ఛత కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్న నేపథ్యంలో



ఇవి ఇబ్బందికరంగా మారాయి.

రైతులే తమ సొంత జాగాల్లో మూడు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, మీటరు లోతున గొయ్యి తవ్వుకుని వాటిలో పశువుల ఎరువు, గడ్డి వేసేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇందుకోసం ఐదు పని దినాలను కూలీలకు మస్తరుగా ఇస్తున్నారు. తమ జాగాలోనే గుంతలు తవ్వుకోవడానికి అవకాశం ఇవ్వడం, దూరంగా వేసుకుని ఇబ్బంది పడే బదులు తమ కల్లాల వద్దే నిల్వ చేసుకునేందుకు వీలుండడంతో చాలామంది రైతులు ముందుకు వస్తున్నారు. పశువులతోపాటు మేకలు, గొర్రెలు పెంచుకునే వారికీ గుంతలు తవ్వుకోవడానికి అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. తద్వారా రోడ్ల పక్కన ఎరువుల కుప్పలు తగ్గుతాయని, పల్లెలు స్వచ్ఛంగా కనిపిస్తాయని అభిప్రాయ పడుతున్నారు.తాజాగా పంట కుంటల లక్ష్యాన్నీ పెంచారు. తొలుత 7,500 లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పుడు అదనంగా ఐదు వేల కుంటలు తవ్వాలని ఆదేశాలొచ్చాయి. మెట్ట భూముల్లో వీటిని ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పున తవ్వితే వర్షపు నీరు నిల్వ ఉండటంతోపాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. పొలం గట్లపై కాయగూరలు, ఆకుకూరలు, మునగ, అరటి చెట్లకు నీరందుతుంది.

# రెండే పండాయి.. మిగతావి ఎండాయి!

కనిగిరి : విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించి నకిలీలు అరికట్టాలి.... మట్టి నమూనాలు విశ్లేషించి భూసార పరీక్ష ఫలితాలు వెల్లడించాలి.... ఇలా రకరకాల సేవలు రైతులకు అందించాల్సిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు అలంకారప్రాయంగా మారడమే కాకుండా మూపపడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో భవనం, ప్రయోగ పరికరాలు కలిపి రూ.కోటి చొప్పున వెచ్చించి ఏర్పాటు చేశారు. ఇంత చేసినా ప్రస్తుతం జిల్లాలో రెండు అగ్రి ల్యాబ్‌లలో మాత్రమే పరీక్షలు జరుగుతుండడం గమనార్హం.

**పరీక్షలకు తూట్లు...**

కనిగిరి, మార్కాపురం, సింగరాయకొండ, గిద్దలూరు, దర్శి, సంతనూతలపాడు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని ఏఎంసీలకు అనుసంధానంగా ల్యాబ్‌లు నిర్మించారు. ఒక్కో భవనం నిర్మాణం, పరికరాలకు నాబార్డు నిధులు వెచ్చించారు. రైతులు పండించే వివిధ రకాల పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షలు చేసి నాణ్యమైన సేవలందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. గిద్దలూరు, దర్శిలలో మాత్రమే నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నారు. మిగతా చోట్ల మూతపడగా, మార్కాపురంలోని భవనం పునాదుల్లోనే నిలిచిపోయింది.

**తాళాలు పడ్డాయి**

కనిగిరి, సింగరాయకొండ, సంతనూతలపాడు, యర్రగొండపాలెం



అగ్రిల్యాబ్‌లు వివిధ కారణాలతో మూతపడ్డాయి. దీంతో 7 నెలలుగా పరీక్షలు నిలిచిపోయాయి. ఇక్కడున్న సిబ్బందిని మరో చోటకు బదిలీ చేశారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు, వ్యాపారులు, బయట మార్కెట్లో రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఇవి ఎంత మేరకు నాణ్యమైనవి? ఎంత శాతం మొలక వస్తుంది.? తెలుసుకోవాలంటే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయాల్చి ఉంటుంది. సేవలు అందుబాటులో లేనందున రైతులు బయట కొనుగోలు చేసిన విత్తనాలు అలాగే వినియోగిస్తూ చాలా సందర్భాల్లో నష్టాలపాలవుతున్నారు. ఈ విషయమై డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో అగ్రిల్యాబ్‌లు మూతపడిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

# ఉజ్వల యోజన అందుకుందాం

సీఎస్‌పురం : కట్టెలు, బొగ్గుల పొయ్యిల నుంచి వచ్చే విషపూరిత పొగను పీల్చకుండా మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం తీసుకొచ్చింది. అదే ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై). గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఈ పథకాన్ని పునఃప్రారంభించారు. పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువ నున్న పేద మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. సిలిండరుకు రూ.1,700, రెగ్యులేటరుకు రూ.150, మీటరు పైపు రూ.100, గ్యాస్ పుస్తకం రూ.25, ఇంట్లో బిగించేందుకు రూ.75 కలిపి మొత్తం రూ.2,050 ఆయిల్ కంపెనీలే భరిస్తాయి. మొదటి సిలిండరు ఉచితం. అనంతరం తీసుకునే సిలిండరుపై కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీ ఇస్తుంది. పథకం అమలుకు జిల్లా ఉన్నతాధికారులు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. రేషన్ కార్డులో పేర్కొన్న పేరుపై ఎటువంటి గ్యాస్ కనెక్షన్ ఉండకూడదు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు సమర్పించాలి.రేషన్‌కార్డున్న వలస కార్మికులు సంబంధిత పత్రాలు జత పరచాలి.నెలకు రూ.10 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు అనర్హులు. ఇందుకు రెవెన్యూశాఖాధికారులతో ఆదాయ ధ్రువీకరణ పత్రం జతపరచాలి.అర్హులైన పేద మహిళలు ఏజెన్సీల వద్దకు వెళ్లి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.14.2 కిలోల సింగిల్ సిలిండరు లేదా 5 కిలోలుండే రెండు సిలిండర్లు పొందవచ్చు.

# ధర చూస్తే గుడ్లు తేలేయాల్సిందే

ధర్మవరం: మార్కెట్లో కోడిగుడ్ల ధర రికార్డు స్థాయిలో పెరిగింది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా బుధవారం హోల్‌సేల్ ఒక్కోటి రూ.7కు, రిటైల్‌గా అయితే రూ.7.50 చేరింది. ఈ లెక్కన డజను గుడ్లు హోల్‌సేల్ కాకుండా బయట అంగళ్లలో రూ.90 పలుకుతుండటంతో వినియోగదారులు గుడ్లు తేలేస్తున్నారు.

గుడ్డు వినియోగం పెరగడం, ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు సాగడమే ఇందుకు కారణం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఒక గుడ్డు రూ.5.75కు విక్రయించారు. నెల రోజులపాటు ఇదే ధర నిలకడగా కొనసాగింది. అక్టోబర్‌లో రూ.25 పైసలు పెరిగి రూ.6కు చేరింది. నవంబరులో ఏకంగా గుడ్డు ధరలకు రెక్కలొచ్చాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు కురవడం, చలితీవ్రత పెరగడంతో రూ.7కు చేరింది. చికెన్, పొట్టేలు మాంసపు ధరలు పెరుగుతుండ



టంతో పేదలు కోడిగుడ్లపై ఆసక్తి చూపించారు. వాటి ధర పెరగడంతో కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు.

**దిల్లీ, మహారాష్ట్రలకు ఎగుమతి**

ఈ ఏడాది ఉత్తరాది రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమ భారీగా దెబ్బతింది. దీంతో కర్ణాటక, బళ్లారి ప్రాంతాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. మన జిల్లాకు కూడా అక్కడే నుంచి గుడ్లు సరఫరా అవుతున్నాయి. దీంతో గిరాకీ పెరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో బ్రాయిలర్, లెయింగ్ హెన్స్ (గుడ్లు పెట్టే కోళ్లు) 14.75 లక్షల సంపద ఉంది. వీటిలో గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య కేవలం మూడు లక్షల లోపే ఉండటంతో గుడ్ల ఉత్పత్తి ఆశాజనకంగా లేదు. దీంతో బయట ప్రాంతాల నుంచి గుడ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. చలి తీవ్రత తగ్గే వరకు గుడ్ల ధరలు తగ్గుముఖం పట్టవని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్(నెక్) ప్రతినిధులు చెబుతున్నారు.

# సౌత్ఫలితం.. పొదుపు మంత్రం

శ్రీకాళహస్తి : విద్యుత్తు పొదుపు.. తద్వారా ఛార్జీల తగ్గింపు దిశగా శ్రీకాళహస్తీశ్వరాలయం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా నెడ్‌క్యాప్ సంస్థ సహకారంతో సోలార్ విద్యుత్తు ఉత్పత్తులతో విద్యుత్తు ఛార్జీలను పొదుపు చేస్తోంది. విద్యుత్తు సంక్షోభ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన సౌర ప్రాజెక్టు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది.సౌర విద్యుదుత్పత్తి..: ముక్కంటి ఆలయం విస్తరిస్తోంది. ఆలయంతో పాటు అతిథిగృహాలకు సౌర విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేలా నాలుగేళ్ల క్రితం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సౌర విద్యుత్తు ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు సరఫరాకు నెడ్‌క్యాప్ అంగీకారం తెలిపింది. ఆ ప్రకారం కైలాసగిరుల్లో ముక్కంటి ఆలయ స్థలంలో భారీగా ఫలకాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.



**ఏటా రూ.1.02 కోట్ల ఆదాయం..**

విద్యుత్తు ఉత్పాదన రానున్న రోజుల్లో మరింత కష్టతరంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందిపుచ్చుకోవాలన్న దిశగా ముక్కంటి ఆలయం సిద్ధమైంది. అందులో భాగంగా సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటుకు నెడ్‌క్యాప్ సంస్థకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం కైలాసగిరుల్లోని కొండగుట్టలను చదును చేసి సోలార్ ఫలకాల ఏర్పాటు పూర్తయింది. సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయడంతో పాటు దాన్ని పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. విద్యుత్తు సంస్థలకు యూనిట్‌కు ముక్కంటి ఆలయం రూ.6.07 మేరకు నగదు చెల్లిస్తోంది. నెడ్‌క్యాప్ సౌర ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం యూనిట్ రూ.3.99 మేర చెల్లిస్తే సరిపోతుంది. నెలకు రూ.17 లక్షలకు పైగా విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నారు. అదే సౌర విద్యుత్తుకు రూ.7 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. ఈ ధర 25 ఏళ్ల పాటు స్థిరంగా ఉంచేలా నెడ్‌క్యాప్‌తో ఒప్పందం కుదిరింది. తద్వారా సంవత్సరానికి రూ.1.20 కోట్ల మేర విద్యుత్తు బిల్లుల ద్వారా ఆదా అవుతుంది. ఆలయ అతిథిగృహాలు, భరద్వాజతీర్థం తదితర ప్రాంతాల్లో మరిన్ని సౌర విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తు ఛార్జీల భారం మరింతగా తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

# తెలుగు గంగ.. మట్టి మాఫియా బెంగ

శ్రీకాళహస్తి : తమిళనాడుతో పాటు తిరుపతి, శ్రీకాళహస్తికి తాగునీరు అందించే శ్రీసత్యసాయి తెలుగుగంగ కాలువకు మట్టి మాఫియాతో ముప్పు తప్పేలా లేదు. తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ మల్లిగుంట వద్ద 'గంగ' కాలువను ఆనుకుని యథేచ్ఛగా మట్టి తవ్వుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తే 'గంగ' కాలువకు ప్రమాదం తప్పదు.

తెలుగుగంగ కాలువకు ఇరు వైపులా మట్టి తవ్వకాలకు అనుమతి లేదు. ఎందుకంటే యంత్రాల సాయంతో మట్టిని తొలగిస్తే వర్షాకాలంలో కోతకు గురై ప్రమాదం ఏర్పడే అవకాశముంది. కాలువకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే తమిళనాడుతో పాటు మనకు నీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడతాయి. పరిసర పొలాలన్నీ ముంపు బారిన పడతాయి. ఇవన్నీ తెలిసినా అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేస్తుంటే యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేసినా ప్చ్..!శ్రీసత్యసాయి తెలుగుగంగ కాలువకు సమీపంలో మట్టి తవ్వకాలు జరుగుతుండటంపై పలు దఫాలు తెలుగుగంగ ఉన్నతాధికారులు రెవెన్యూ, పోలీసు శాఖలకు ఫిర్యాదు చేశారు. రెండు లేదా మూడు నెలలకోసారి మాఫియా విచ్చలవిడిగా మట్టి తరలిస్తోంది. దీన్ని కట్టడి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు అభ్యర్థిస్తున్నారు.

# ప్రకృతి వనరుల దోపిడీపర్వం



తాడిపత్రి : అక్రమ మట్టితవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఎలాంటి అనమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తుండటంతో ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లిలో దందా సాగుతోంది. ప్రకృతి వనరుల్ని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల నుంచి దక్కాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నా... నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు అధికారులు లంచాలకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కరిగిపోతున్నాయ్..**

యర్రగుంటపల్లి పరిధిలోని కొండలు, గుట్టలు అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారాయి. ఎలాంటి అనుమతులను లేకున్నా పలు చోట్ల కొండల్ని కరిగిచించి గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా భారీ యంత్రాల సాయంతో తవ్వకాలు చేపడతూ అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

రోజూ వందకుపైగా ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలించి... రహదారుల పనులు, ప్రైవేటు లేఅవుట్ల చదును, ఇతరత్రా అవసరాలకు రవాణా చేసి జేబులు నింపుకొంటున్నారు. టిప్పర్ మట్టికి రూ.6 వేల నుంచి 7 వేల వరకు, ట్రాక్టర్ మట్టిని రూ.2 వేల నుంచి 3వేల వరకు అక్రమార్కులు విక్రయిస్తున్నారు.

**భూములనూ వదల్లేదు పేదల**

ప్రభుత్వం యర్రగుంటపల్లిలో పేదలకు కేటాయించిన స్థలాలలోనూ ఇష్టారాజ్యంగా తవ్వకాలను చేపట్టారు. దీంతో సదరు స్థలాలు కుంటలను తలపిస్తున్నాయి. మరోవైపు అక్కడ తీగలతో ఉన్న విద్యుత్తు స్తంభాల చుట్టూ తవ్వేస్తున్నారు. ఫలితంగా అవి ప్రమాదకరంగా మారాయి. ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోపిడీపర్వం కొనసాగుతున్నా సంబంధిత అధికారులకు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి.. ప్రకృతి వనరుల్ని కాపాడాలని కోరుతున్నారు.

**అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు**

–సోమశేఖర్, తహసీల్దారు, తాడిపత్రి

గనుల శాఖ అధికారులతో మాట్లాడి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ప్రాంతాలను పరిశీలిస్తాం. అక్రమ రవాణా చేసే వాహనాలను జప్తు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాలలో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

# జీవిత పాఠం.. సాహస కృత్యం!



తాడిపత్రి : జేఎన్‌టీయూలో సాంకేతికవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లుగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన సాహసకృత్యాల శిబిరంలో గోవా, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 50 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. అనంత జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం. జేఎన్‌టీయూలోని సహ ఆచార్యురాలు డాక్టర్ మమత పర్యవేక్షణలో విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొన్నారు. బీటెక్ విద్యార్థులు వివిధ సాహసకృత్యాలు ప్రదర్శించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకొనే నైపుణ్యం సంపాదించారు. ఎముకలు కొరికే చలిలో పర్వతాలు అధిరోహించారు. విభిన్న వాతావరణంలో విశిష్ట కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

**ఏమి చేశారంటే?**

బీటెక్ పూర్తి చేసి ఇంజినీరు వృత్తికే పరిమితం కాకుండా వాలంటీర్లుగా సేవా కార్యక్రమాలు చేస్తూనే భిన్నమైన పరిస్థితుల అవగాహన కోసం హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లారు. అక్కడ పర్వతారోహణ, నదులు దాటడం, పడవ నడపటం, తాడుసాయంతో కొండలు ఎక్కడం, దిగడం, తాడుతో తాత్కాలిక వంతెన నిర్మించడం, చలిప్రాంతంలో శిబిరాలు ఏర్పాటు చేయడం వంటివి చేశారు. నిప్పును సృష్టించడం, వ్యర్థాల నిర్వహణ, శుభ్రత పాటించడం, పర్యావరణ పరిరక్షించడం, ఇతర రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడం, తదితర అంశాలు ఈ శిబిరంలో అభ్యసించారు.

**విపత్తుల వేళ సాయం అందించేలా..** – శేషాద్రి, బీటెక్

శిబిరానికి ఐదు రాష్ట్రాల నుంచి 50 మంది వాలంటీర్లు వచ్చారు. అక్కడ ఎన్నో సాహస కృత్యాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నో విషయాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం నేర్చుకొన్నాం. ఇలాంటి శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని ఇస్తాయి.

**మొదట్లో భయపడ్డాం..– హరిత, బీటెక్**

నది పక్కనే మా శిబిరం ఉంది. కొండలు, నదులు, మంచు చూసి భయపడ్డాం. సాహస కృత్యాలు చేయడం సాధ్యమా అనుకున్నాం. కాని అక్కడ నేర్చుకొన్న అంశాలతో పర్వతాలు ఎక్కాం. తాడుసాయంతో నదులు దాటాం, పడవ నడిపా. తీవ్రమైన చలిలోనూ సాహస కృత్యాలు నిర్వహించాం.

# స్వర్ణముఖిని దోచేస్తున్న ఇసుకాసురులు



చంద్రగిరి : ఇటీవల వర్షాలకు స్వర్ణముఖి నది వరదతో పరవళ్లు తొక్కింది. గతంలో నదిలో ఇసుక తోడేయడంతో బావులు తలపించేలా భారీ గుంతలు ఏర్పడ్డాయి. సుమారు 20 నుంచి 30 అడుగుల గుంతల్లోకి వరద ప్రవాహానికి ఇసుక మేటలు ఏర్పడటంతో ఇసుకాసురుల పంట పండింది. పైసా పెట్టుబడి లేకుండా రూ.లక్షలు దోచుకోవడానికి భారీ యంత్రాలతో నదిలోకి చొరబడి పగలూరాత్రి తేడా లేకుండా తవ్వేస్తున్నారు. ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లతో హద్దులు దాటిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు.

**నరశింగాపురం మీదుగా నగరానికి తరలిస్తూ**

మండలంలోని ఎగువరెడ్డివారిపల్లి సమీపంలో సువిశాలంగా ఉన్న స్వర్ణముఖినది నుంచి ఇటు రెడ్డివారిపల్లి, అటు నరశింగాపురం మీదుగా తిరుపతి నగరానికి ఇసుక యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. నదీపరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా తరలించరాదని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎద్దుల బండిలో, మనిషి మోతతో ఇసుక తరలించడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. మరో వైపు రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలు ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచినా ఇసుకాసురులతో లోపాయికారి ఒప్పందంతో కుదుర్చుకున్న కొందరు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని నదీపరివాహక ప్రాంతాల రైతుల నుంచి సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అన్నదాతల్లో ఆందోళన**

నదిలో ఇసుకను యంత్రాలతో తోడేయడంతో పరిసరాల ప్రాంతాల్లోని వ్యవసాయ బోరుబావులు, నేలబావుల్లో భూగర్భజలాలు తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని, రాబోయే వేసవికాలంలో పంటలసాగు కష్టతరంగా ఉంటుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంగా రెవెన్యూ అధికారులను వివరణ కోరగా వాల్టా చట్టం మేరకు ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇసుక దోపిడీని గుర్తించిన తక్షణమే తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపామన్నారు. అప్పటికే అక్కడి నుంచి వాహనాలు వెళ్లిపోయాయని వివరించారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామని, తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు.

# స్విమ్స్ ప్రాంగణంలో ఆమ్లెట్లు

తిరుపతి : స్విమ్స్ రెసిడెంట్ హాస్టల్(పీజీ) మెస్ క్యాంటీన్‌గా మారింది. విద్యార్థులకు భోజనాలు మాత్రమే అందించాల్సి ఉండగా.. ప్రత్యేక కౌంటర్ ఓపెన్ చేసి అడిగి ఆహార పదార్థాలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతటితో ఆగక తితిదే ఆధ్వర్యంలో నడిచే స్విమ్స్ యూనివర్సిటీలో కోడిగుడ్డు ఆమ్లెట్లు వేస్తూ అపవిత్రం చేస్తున్నారు. ఇంత జరుగుతుంటే పీజీ వైద్యుల అసోసియేషన్‌కు ఇచ్చేశాం.. మాకేమీ సంబంధం లేదనేలా ఉంది యాజమాన్యం తీరు.

**షెడ్డు వేసుకుని.. కౌంటర్ తెరిచి**

స్విమ్స్ పీజీ మహిళా విద్యార్థుల నిమిత్తం శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల సమీపంలో రెసిడెంట్ హాస్టల్ కొనసాగుతోంది. అందులోని విద్యార్థుల భోజన వసతి కోసం మెస్‌ను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ కాంట్రాక్టర్‌కు ఉచిత అద్దెతో



భోజన తయారీ బాధ్యత అప్పగించారు. హాస్టల్ వెనుక భాగంలో షెడ్డు వేసుకుని ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. ఫ్రైడ్ రైస్, ఆమ్లెట్లు వేసేందుకు ప్రత్యేక స్టాల్స్ పెట్టారు. వాటిని విక్రయించేందుకు బిల్లింగ్ కౌంటర్ తెరిచారు. పీజీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాల్సి ఉండగా విక్రయాలు సాగిస్తున్నారు. తితిదే ఆధ్వర్యంలోని ప్రాంగణాల్లో మాంసాహారం నిషేధం ఉంది. కొంతకాలంగా బహిరంగంగా విక్రయిస్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఈ విషయంగా స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ కుమార్‌ను సంప్రదించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎర్రపండు మిలమిల

ఎమ్మిగనూరు : మిరప ధరలు ఎగబాకుతున్నాయి. తాలు కాయలకూ మార్కెట్లో మంచి ధర పలుకుతుండటంతో రైతులకు ఊరటనిస్తోంది. రెండేళ్లుగా ధరలు లేక రైతులు కుదేలయ్యారు. ఉమ్మడి జిల్లాలో 40వేల ఎకరాల్లో మిరప వేశారు. జిల్లాలో అధికంగా 30వేల ఎకరాల్లో సాగైంది. పంట చేతికొస్తున్న సమయంలో ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బోర్లు, కాల్వలు, చెరువుల కింద డీలక్స్, తేజ రకాలు అధికంగా సాగు చేశారు. తెగుళ్లు, పురుగు బెడద లేకుంటే ఎకరానికి 20నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. గత రెండేళ్లుగా తెగుళ్లు, పురుగు ఆశించి దిగుబడులు తగ్గాయి. ఈసారి కూడా తెగుళ్లు, పురుగు ఎక్కువై మందులు అధికంగా చల్లుతున్నారు. గత ఏడాది క్వింటా రూ.10వేల నుంచి రూ.12వేల వరకు అమ్ముడుపోయాయి. ఈసారి గుంటూరు మార్కెట్లో క్వింటా రూ.15వేల నుంచి రూ.17వేలు, బ్యాడిగి మార్కెట్లో క్వింటా రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

ఈ ఏడాది తెగుళ్లు, పురుగు కారణంగా మొదటి కోతగా ఎకరానికి



నాలుగు క్వింటాళ్లు దిగుబడి వస్తే ఇందులో రెండు క్వింటాళ్లకు పైగా తాలు కాయలు ఉన్నాయి. క్వింటా రూ.8వేల నుంచి రూ.11వేల వరకు వ్యాపారులు కొంటున్నారు.

గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటకలో మిరప సాగు తగ్గడం, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో మిరప పంట దెబ్బతింది. రాష్ట్రంలోని మిరప నిల్వలు వ్యాపారులు చాలా వరకు ఖాళీ చేయడంతో మార్కెట్లోకి వచ్చే కొత్త పంటకు డిమాండ్ ఏర్పడింది.

**బ్యాడిగి డబ్బి రకం క్వింటా రూ.71వేలు**

కర్ణాటకలోని బ్యాడిగి అంతర్జాతీయ మార్కెట్‌లో డబ్బి రకం క్వింటా రూ.71వేల ధర పలికింది. హొళగుంద, చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాల్లో సాగు చేశారు. డబ్బి బ్యాడిగి మిరపకు మార్కెట్లో మంచి ధర లభిస్తోంది. ఎకరానికి ఐదారు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా గిట్టుబాటు అవుతుంది.

# చదువు నెపం.. మత్తు వ్యాపారం

నందికొట్కూరు : చదువుకునేందుకని గదిని అద్దెకు తీసుకున్నారు. గుట్టు చప్పుడుకాకుండా నిషేధిత మాదకద్రవ్యాల తయారీ ప్రారంభించారు. మూడు నెలల పాటు మూడో కంటికి తెలియకుండా మత్తుపదార్థాల వ్యాపారం నిర్వహించారు. ఎట్టకేలకు దీనిపై సమాచారం అందుకున్న నార్కోటిక్ బృందం దాడులు చేపట్టిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుంది. వారి నుంచి 171 గ్రాముల వైట్ పౌడరు, 11.5 కిలోల రసాయనాలు, ల్యాబోరేటరీకి సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకుంది.

**10 వేల కిలోల సరకు తరలింపు**

నందికొట్కూరుకు చెందిన మాధవ్, శ్రీనివాసులు, సురేష్‌తో పాటు గుంటూరుకు చెందిన నవీన్‌కుమార్ నందికొట్కూరులోని మద్దూరు సుబ్బారెడ్డినగర్‌లో శ్రీచైతన్య పాఠశాలకు ఎదురుగా ఉన్న భవనం పైఅంతస్తులో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. నలుగురూ ఆ గదిలో చదువుకుంటున్నట్లు చుట్టుపక్కల వారిని నమ్మించారు. నిషేధిత మత్తు మందు ఆల్ప్రాజోలం తయారీ ప్రారంభించారు. ఇందుకు అవసరమైన రసాయనాలు, పదార్థాలను నకిలీ చిరునామాతో ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకొని మత్తు పదార్థాన్ని తయారు చేసి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సరఫరా చేసేవారు. వీరు తయారు చేసిన మత్తు పదార్థం (పౌడరు) కిలో రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. మూడు నెలల్లో సుమారు 10 వేల కిలోల సరకు విక్రయించినట్లు సమాచారం. నార్కోటిక్ బృందం దాడి చేసి విక్రేతను పట్టుకుంది.


# 'హద్దు'ల్లేని అతిక్రమణ!!

విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఎన్‌హెచ్(జాతీయ రహదారి)ని ఆనుకుని ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగుతున్నాయి. జాతీయ రహదారిలో భవిష్యత్ అవసరాలకు గుర్తించిన స్థలాల్లో ఏకంగా ప్లాన్ అనుమతులు ఇచ్చేస్తున్నారు. కాసులకు కక్కుర్తితో అధికారులు కుమ్మక్కయ్యారు. భవిష్యత్‌లో స్థలంతోపాటు, భవనాలకు పరిహారం అదనంగా చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భవిష్యత్తులో విస్తరణకు**

నగరంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉన్నాయి. వీటిని ఆనుకుని ప్రధాన కాల్వలున్నాయి. ఈ కాల్వ పక్కనే ఎన్‌హెచ్‌కు చెందిన స్థలాల వద్ద హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. వీటి తర్వాత సుమారు 50 అడుగుల మేర భవిష్యత్‌లో రహదారి విస్తరణ కోసం గుర్తించారు. ఆ స్థలాలు జిరాయితీ, పట్టా అయినా భవన నిర్మాణాలకు జీవీఎంసీ ప్లాన్ అనుమతులు ఇవ్వకూడదు. తాత్కాలిక షెడ్లు సైతం ఏర్పాటు చేయకూడదు. ఇలాంటి పరిస్థితి పీఎంపాలెం, మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది.

**అంతా ఇష్టారాజ్యమే:** నిబంధనలను కొందరు అపార్ట్‌మెంట్ల బిల్డర్లు, భవన యజమానులు పాటించడం లేదు. ఎన్‌హెచ్ భవిష్యత్ విస్తరణకు గుర్తించిన స్థలం వదిలి నిర్మాణాలు సాగించాల్సి ఉన్నా పట్టించుకోవడం



లేదు. 7వ వార్డు పరిధిలోని చంద్రంపాలెంలో జాతీయ రహదారి విస్తరణకు గుర్తించిన స్థలంలో ఓ వ్యక్తి ఏకంగా మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. కారుషెడ్డు నుంచి శిల్పారామం మధ్యలో భారీ షెడ్లు వేసి వాణిజ్య సముదాయాలు అనుమతుల్లేకుండా నిర్మించి అద్దెలకిస్తున్నారు. **వారే కీలకంగా వ్యవహరిస్తూ:** పట్టణప్రణాళిక కార్యాలయానికి వెళ్లకుండా నేరుగా భవన నిర్మాణాలకు ఆన్‌లైన్లో ప్లాన్ దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇక్కడే జీవీఎంసీ నుంచి లైసెన్సు పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీలు) కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఎల్‌టీపీలు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కుమ్మక్కై చక్రం తిప్పుతున్నారు. ఆన్‌లైన్లో ఎల్‌టీపీ ఇచ్చిన అఫిడవిట్ ఆధారంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. 'ఎన్‌హెచ్‌ని ఆనుకుని జరుగుతున్న నిర్మాణాలపై కొన్ని ఫిర్యాదులొచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం' అని జోన్-2 పట్టణ ప్రణాళికావిభాగం డీసీపీ హరిదాస్ పేర్కొన్నారు.

# జలకాలాటలో జరభద్రం

నక్కపల్లి : అలల హెూరు, జలపాతాల సవ్వడులు, నదీ ప్రవాహాలు ఇవన్నీ యువతను ఆకర్షించేవే. ఈ సందడిలో యువత అత్యుత్సాహం చూపుతూ ప్రమాదాలను గుర్తించలేక మృత్యువును కొని తెచ్చుకుంటున్నారు. తద్వారా ఆయా కుటుంబాల్లో తీరని వేదన మిగుల్చుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే వివిధ నీటి ప్రమాదాల్లో 11 మంది మృత్యువాత పడ్డారు. వీరంతా యువకులే. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన ప్రమాదాల్లోనే అయిదుగురు ఉన్నారు. జిల్లాలోని నదీ, సముద్రతీర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఏటా పదుల సంఖ్యలో మరణిస్తున్నారు. నిన్నటి వరకు కార్తికమాసం సందడి, ఇప్పుడు శీతాకాలం విహారం పేరిట నదులు, జలాశయాలు, సముద్రతీర ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో స్నానాలు చేస్తున్నప్పుడో.. సెల్ఫీలు దిగుతున్నప్పుడో నీట మునిగిపోతున్నారు. ఆనందాన్ని తీయని జ్ఞాపకంగా మిగుల్చుకోడానికి బదులు తీరని విషాదంగా మార్చుకుంటున్నారు.

ఏడాది కాలంలో దాదాపు 30 మంది వరకు బీచ్ ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. వరహా, శారదా తదితర నదుల్లో మునిగి మరో 20 మంది వరకు మరణించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సముద్ర తీరాల్లో పోలీసులు గస్తీ ఉంటున్నా, మత్స్యకారులు హెచ్చరిస్తున్నా వాటిని యువత పట్టించుకోవడం లేదు.

ప్రధానంగా తీరంలో అలలు తిరిగి వెళ్లే క్రమంలో అలల ఉద్ధృతి పెరిగి రిప్ కరెంట్ ఏర్పడుతుంది. ఇందులో చిక్కుకుంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే నదుల్లో ఇసుక తవ్వకాలు జరిగి గుంతలు ఉంటాయి. జలాశయాల్లో ఒడ్డు నాచు పట్టి ఉంటుంది. ఇలాంటి చోట్లలోనికి దిగకపోవడమే మంచిది.

**ప్రమాదమని తెలిసీ...**

జిల్లాలో రేవుపోలవరం, తంతడి, వాడపాలెం, సీతపాలెం, తిక్కవానిపాలెం, పెంటకోట, పాల్మన్‌పేట, రాజానగరం సముద్రతీరాలు ఆహ్లాదంగా ఉండటంతో ఎక్కువ పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడి ప్రమాదకర ప్రాంతాలున్నాయని విషయం తెలిసినా పెడచెవిన పెట్టి నిర్లక్ష్యంగా ఉంటూ ప్రాణాలను కోల్పోతున్నారు.

ఇక్కడి తీరాల్లో రాళ్లు ఉండటంతో కొందరు గాయపడి మరణిస్తుండగా, ఒడ్డునే లోతుగా ఉండటంతో అలల తాకిడిలో చిక్కుకుని మరికొందరు మృతి చెందుతున్నారు.

**శాశ్వత హెచ్చరిక బోర్డులు**

పిక్నిక్‌కు వెళ్లినచోట స్నానం చేయాలనుకోవడం సహజం. అక్కడి పరిస్థితులను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకుని ముందుకు వెళ్లడం మంచిది. ప్రధానంగా యువత ఇలాంటి చోట్ల మద్యం తాగి స్నానానికి దిగుతారు. ఇద్దే ముప్పు అని గుర్తించాలి. వీరు ఇంట్లో వారికోసం ఓ క్షణం ఆలోచించాలి. తమ పిల్లలు బయటకు వెళుతుంటే తల్లిదండ్రులు మంచి, చెడు చెప్పాలి. ప్రమాదకర ప్రాంతాల్లో శాశ్వత హెచ్చరిక బోర్డులు పెట్టిస్తున్నాం. వారాంతాల్లో మా సిబ్బందితోపాటు మెరైన్ ఉద్యోగులు పహారా ఉంటున్నారు. దీంతోపాటు మైకు ద్వారా హెచ్చరికలు, డ్రోన్ ద్వారా పర్యవేక్షణ చేయిస్తాం.

పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

# సిరులొలికించే.. చిరుధాన్యాలు



తిరుపతి: కరోనా తర్వాత కాలంలో ఎక్కువ మంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. దీంతో జిల్లాలో చిరుధాన్యాల వినియోగం పెరిగింది. రాగి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, సామలు మొదలైన వాటితో తయారయ్యే ఉత్పత్తులను తింటున్నారు. పోషక విలువలు ఎక్కువ, ఖర్చు తక్కువ కావడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు. కానీ అధిక ఆదాయం ఇచ్చే కొర్ర సాగుపై అవగాహన లేక పూర్తిస్థాయిలో పండించలేకపోతున్నారు.

**తక్కువ ఖర్చుతో సాగు..**

వరి, గోధుమలతో పోలిస్తే కొర్రలకు నీటి అవసరం చాలా తక్కువ. తెగుళ్లు, చీడపీడలను సహజంగా తట్టుకునే శక్తి కలిగి ఉండటంతో రసాయన మందుల వినియోగాన్ని విస్మరించొచ్చు.

3, 4 వర్షాలకు మూడు నెలల్లోనే పంట కాలం పూర్తవుతుంది. జీవామృతం వినియోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చు.

వరితో పోలిస్తే కొర్రలు, ఇతర చిరుధాన్యాల్లో మాంసకృత్తులు, పీచు పదార్థాలు, కాల్షియం, ఇనుము, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి.

సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

కొర్ర: 1.9

సామ: 0.3

సజ్జ: 2251.2

మొక్కజొన్న: 68.4

జొన్న: 1.2

రాగులు: 1.6

జిల్లాలో వివరాలు..

పంటలు:చిరుధాన్యాలు

సాగు చేస్తున్నది: 2,500 మంది

విస్తీర్ణం: 3,200 హెక్టార్లకు పైగా

విక్రయశాలలు: 25 పైగా

రూ.12కే ప్రాసెసింగ్

తిరుపతిలోని ఎస్వీ ప్రాంతీయ వ్యవసాయం పరిశోధన స్థానంలో రైతులు తీసుకొచ్చిన ముడి సరకును ప్రాసెస్ చేస్తారు. కిలోకు కేవలం రూ.12 మాత్రమే తీసుకుంటున్నారు. నాలుగు రకాల యంత్రాలతో వడపట్టి అందజేస్తారు. ఏటా ఇక్కడ మూడు నుంచి 5 వేల కిలోల పంట ప్రాసెస్ జరుగుతుంది.

**ప్రభుత్వం నుంచి సహకారం..: ఎస్.ప్రసాదరావు, జేడీ, తిరుపతి**

మిల్లెట్లను సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. ఇవి ఆరోగ్యానికి మంచివి. వీటిని తక్కువ నీటితో పండించొచ్చు. సాగుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుంది. నూతనంగా సాగు చేయాలనుకునే రైతులు ఆయా మండలాల్లోని వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

# చేసే'దంత' మొక్కుబడి వైద్యం



నంద్యాల : పంటి నొప్పితో బాధపడుతూ కోడుమూరుకు చెందిన వెంకటేష్ స్థానిక సీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడ సేవలందించే వారు లేకపోవడంతో కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. ఎక్సరే తీసి పన్ను తొలగించినందుకు రూ.1,200 తీసుకున్నారు. మరోటి దెబ్బతిందని.. దానికి రూట్ కెనాల్ చేసేందుకు రూ.3 వేలు ఖర్చవుతుందన్నారు.

ఉమ్మడి జిల్లాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసే'దంత' మొక్కుబడి వైద్యమే. చాలాచోట్ల డెంటల్ ఛైర్లు లేవు.. పుచ్చువంటి సమస్యలు, సిమెంట్ వేయడం, స్కేలింగ్ లాంటి సేవలు అందించాల్సి ఉన్నా రకరకాల కారణాలు చెప్పి బాధితులను వెనక్కి పంపిస్తున్నారు. దీనికితోడు డా.ఎన్టీఆర్ వైద్యసేవల కింద పంటి వైద్యం లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రాథమికస్థాయిలో వదిలేశారు

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) ఉంటున్న దంత వైద్యులు వారంలో మూడు రోజులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీ) వెళ్లి సేవలందించాలని ఉత్తర్వులున్నాయి. అక్కడ యంత్రాలు లేకపోవడాన్ని సాకుగా చెప్పి వెళ్లడం లేదు.

సీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు మూడు రోజులు పీహెచ్‌సీలలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి, పాఠశాల స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలకు హాజరవ్వాలి. ఇవి సరిగా కొనసాగడం లేదు.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలందించాలి. ఒప్పంద ప్రాతిపదికన దంత వైద్యులను నియమించుకోవాలని ఉత్తర్వులు ఉన్నాయి. ఇందుకు కేంద్రమే నిధులు అందిస్తున్నా అదనపు సిబ్బందిని నియమించడం లేదు. ఉన్నవారినే అటూఇటూ తిప్పుతున్నారు.

**సర్వజన.. మెరుగైన సేవలు కలేనా**

కర్నూలు సర్వజన వైద్యశాలలోని దంతవైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు టెక్నీషియన్లు పనిచేస్తున్నారు.

ఓపీకి నిత్యం 40 మంది వరకు వస్తారు. నెలకు సగటున 1,200 మందికిపైగా వస్తున్నారు. ఇక్కడ పుచ్చిన పళ్లను తొలగించడం.. ఇన్‌ఫెక్షన్ వస్తే మందులివ్వడం.. దెబ్బతిన్న పంటికి సిమెంట్ పెట్టడం వరకే పరిమితమవుతున్నారు.

రూట్ కెనాల్, పళ్లు కట్టడం, పంటికి సంబంధించిన శస్త్రచికిత్సలు చేయడం లేదు. ఇక్కడ ఎక్స్‌రే మాత్రమే ఉంది. ప్రత్యేకంగా ల్యాబ్ లేకపోవడంతో వైద్యులున్నా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలేని పరిస్థితి.

**సీహెచ్‌సీలు నామమాత్రమే**

ఉమ్మడి జిల్లాలో 18 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అక్కడ దంత వైద్యులున్నా.. పరికరాల కొరత వేధిస్తోంది. శస్త్రచికిత్స చేయాలన్నా, రోగిని పరీక్షించాలన్నా ఎక్స్-రే ప్రధానం. చాలాచోట్ల డెంటల్ ఎక్స్-రే యంత్రం, సహాయకులు లేక సేవలు అందడం లేదు. పంటి సమస్యలతో వచ్చిన వారికి మందులు రాసిచ్చి సర్వజన వైద్యశాలకు పంపిస్తున్నారు. రూట్ కెనాల్ వంటి సేవలు అందించాలంటే పది రకాల వైద్య పరికరాలు కావాలి. వీటికి సంబంధించి ప్రతిపాదన పంపితే సగమే ఇస్తున్నారు. మిగిలిన వాటికి టెండర్ పిలవాలంటే మూడు నెలలు పడుతోంది. పూర్తి సామగ్రి వచ్చే లోపు మొదట్లో వచ్చిన వైద్య సామగ్రి గడువు తీరిపోతుంది. కొత్తగా పళ్లు బిగించడానికి జిల్లా వ్యాప్తంగా ఒక ఏజెన్సీ మాట్లాడుకుని తెప్పించుకొనే వెసులుబాటు ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు.

# ఖాతాకు చేరని ఖనిజ నిధి

నంద్యాల: ఉమ్మడి జిల్లాలో గనులు, క్వారీల సీనరేజీ రుసుము ప్రభుత్వ ఖాతాకు చేరడం లేదు. నంద్యాల జిల్లాలో 250, కర్నూలులో 150 వరకు లీజులున్నాయి. వీటి నుంచి పన్ను వసూలు చేసే బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఆగస్టులో ఒప్పందం కుదరగా గత రెండు నెలలుగా వసూళ్లు ప్రారంభించింది. నిబంధనల మేరకు సీనరేజీ ఛార్జీల్లో 30 శాతం డీఎంఎఫ్‌గా చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని గనుల శాఖ కార్యాలయానికి నేరుగా పంపాల్సి ఉండగా.. గుత్తేదారు సంస్థ జమ చేయడం లేదు.

**గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యం**

డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లి డివిజన్ పరిధిలోని బనగానపల్లి, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, పాణ్యం, గడివేముల, ఆళ్లగడ్డ, మహానంది, కృష్ణగిరి, ఓర్వకల్లు, వెల్దుర్తి, దేవనకొండ, సి.బెళగల్, గూడూరు మండలాల్లో గనులు, క్వారీలు ఉన్నాయి.

ఒప్పందం ప్రకారం గుత్తేదారు సంస్థ ప్రతి నెలా రూ.14 కోట్లను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇందులో రూ.10.50 కోట్ల రుసుము, రూ.3 కోట్లు డీఎంఎఫ్ (జిల్లా మైనింగ్ ఫండ్), రూ.50 లక్షల వరకు ఆదాయపు పన్ను కట్టాల్సి ఉంది.

డీఎంఎఫ్ కింద ఉమ్మడి జిల్లాకు ప్రతి నెలా వసూలయ్యే రూ.3 కోట్లలో అధిక భాగం నంద్యాల జిల్లా నుంచే వస్తోంది. ప్రభుత్వ ఖాతాకు ప్రతి నెలా తప్పనిసరిగా డీఎంఎఫ్ జమ కావాల్సి ఉంది. ఒప్పందం చేసుకుని రెండు నెలలు దాటినా ఈ నిధులు జమవడం లేదు.

**పల్లె ప్రగతిపై ప్రభావం**

నంద్యాల జిల్లాలో 19 సిమెంట్ గ్రేడ్ మైనింగ్ లీజులు, 66 నాపరాయి లీజులు, ఆరు రోడ్ మెటల్ క్వారీ లీజులు ఉన్నాయి. ఒక్క బనగానపల్లి డివిజన్ కార్యాలయ పరిధిలోనే పెద్ద తరహా ఖనిజాలకు సంబంధించిన 82 మైనింగ్ లీజులు, చిన్న తరహా ఖనిజాలకు సంబంధించిన 199



క్వారీ లీజులున్నాయి.

ఏటా డీఎంఎఫ్ రూపంలో లభించే రూ.36 కోట్లను గనుల ప్రభావిత గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు మౌలిక వసతుల కల్పనకు వెచ్చించాల్సి ఉంది.

బనగానపల్లి నియోజకవర్గంలోని పలుకూరు, రామకృష్ణాపురం, చెర్వుపల్లి, బీరవోలు, రామతీర్థం, అవుకు మండలం రామాపురం, చెర్లోపల్లి, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె, బెలుం తదితర గ్రామాల నుంచి గతంలో పెద్దఎత్తున డీఎంఎఫ్ ఖాతాల్లో నిధులు జమయ్యేవి. ప్రస్తుతం ప్రైవేటు ఏజెన్సీకి వసూళ్ల బాధ్యత అప్పగించడంతో వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

# కొండ తవ్వేయ్.. అడగరు అమ్మేయ్!

అనకాపల్లి : అచ్యుతాపురం మండలంలోని మల్లవరం పరిసర ప్రాంతాలపై పట్టున్ననేత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని సద్వినియోగం చేసుకుని రెండుచేతులా సంపాదించాడు. కూటమి ప్రభుత్వంలో తన ఆగడాలు సాగకపోవడంతో కొన్నాళ్ల క్రితం జనసేనలో చేరిపోయాడు. ఇప్పుడు తన అనుచరులతో మునగపాక మండలంలోని ఓ కొండపోరంబోకు లేఅవుట్‌గా మార్చేశాడు.

మునగపాక మండలంలోని సర్వే నం. 19లో దాదాపు ఎకరా వరకు కొండపోరంబోకు స్థలం ఉంది. ఇదంతా వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూమి. ఇక్కడ సెంటు స్థలం రూ. 1.8 లక్షల వరకు పలుకుతుంది. కొండవాలు ప్రాంతం అధికంగా ఉండటంతో కొందరి అక్రమార్కుల కన్ను ఈ భూమిపై పడింది. ఈ స్థలానికి ఆనుకుని సర్వే నం. 17లో కొంత మంది రైతులకు జిరాయితీ భూములున్నాయి. వీటిలో కొండపోరంబోకు స్థలాన్ని కలిపి అమ్మేస్తున్నారు. ఇటీవల



ప్రభుత్వ స్థలంలో చెట్లు కొట్టించి.. చిన్నచిన్న ప్లాట్లుగా మార్చి రాళ్లతో హద్దులు నిర్ణయించి బేరానికి పెట్టేశారు.

**భూములకు పెరిగిన విలువ**

అచ్యుతాపురం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వలసొచ్చిన వారు అధికశాతం మంది మునగపాక పరిసర గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడ భూములను కూడా కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని నిర్వాసితులకు గ్రామ పరిసర ప్రాంతంలోనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద స్థలాలు కూడా ఇవ్వాలన్న ఆలోచన ఉంది. దీంతో ఈ ప్రాంతంలో స్థలాల విలువ పెరగడంతో అక్రమార్కుల కన్ను కొండ పోరంబోకు స్థలంపై పడింది. సెంటు రూ. 1.5 లక్షలకు ఇచ్చేస్తామంటూ బేరాలాడుతున్నారు. ఇందులో దాదాపు 15 సెంట్ల వరకు అమ్మేశారు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరం. నరేంద్రపురం సమీపంలో ఇటీవల చెట్టుకొట్టిన స్థలాన్ని వెళ్లి పరిశీలించాం. రైతుల జిరాయితీ భూమిలో కలపాలని యత్నిస్తున్న వారిని హెచ్చరించాం. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

సత్యనారాయణ, తహసీల్దారు, మునగపాక

# కార్గో సంచిలో నేరాల డెలివరీ!!

విజయనగరం : ఇటీవల పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 1000 వరకు చిన్న పాటి నాటుబాంబులు పేలాయి. వీటిని బస్సు ద్వారానే తీసుకొచ్చారు. దించే క్రమంలో పేలుడు ఘటన సంభవించి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.'

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడంతో పాటు పార్శిల్ సేవలను ఆర్టీసీ విస్తరించింది. 2017లో కార్గోను ప్రారంభించింది. రోజురోజుకూ రెట్టింపు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. వస్తువులను తీసుకెళ్లేందుకు నామమాత్రపు రుసుము తీసుకుంటుండడంతో ఆదరణ లభిస్తోంది. దీనిని కొందరు ఆసరాగా చేసుకుంటున్నారు. నిషేధిత వస్తువులను తరలిస్తున్నారు. ఇటీవల పార్వతీపురంలో జరిగిన ఘటన ఈ పరిస్థితికి అద్దం పడుతోంది.

**250 బుకింగ్‌లు..**

విజయనగరం జోన్ పరిధిలో కార్గో ద్వారా రోజుకు సుమారు 250 వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. ఈమేరకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తోంది. నెలకు 7500 బుకింగ్‌ల ద్వారా రూ.12 లక్షలు సమకూరుతోంది. నిత్యం ఆశ్రయించేవారు 40 మంది వరకు ఉన్నారు.

**తనిఖీలేవీ?**

బుకింగ్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకే అప్పగించడంతో తనిఖీలు సరిగ్గా జరగడం లేదు. పార్శిల పైన ఒక పేరు రాసి ఉంటే.. లోపల మరో వస్తువు దర్శనమిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు స్కానర్ పరికరాలను వినియోగించాలి. అవి లేకపోవడంతో నచ్చిన సరకును తరలిస్తున్నారు. ఈక్రమంలోనే నిషేధిత వస్తువులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి.

**తక్కువ ధరలని..**

మిగతా ట్రాన్స్‌పోర్టు, కొరియర్ సేవలతో పోల్చుకుంటే ఆర్టీసీలో తక్కువ ధరలతో రవాణా చేసుకోవచ్చు. ఏజెన్సీ సిబ్బంది తమవారైతే వారికి మరీ ఉపయోగకరం. ప్రైవేటు వారే ఒక మూట రూపంలో కట్టి కేవలం బరువునే ప్రామాణికంగా చేసుకుని బుకింగ్ చేసుకుంటున్నారు. అంతే కాకుండా ఇక్కడ తనిఖీ కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

కార్గో విభాగానికి ఒక్కరే అధికారి ఉన్నారు. మూడు జిల్లాల పరిధిలో ఒక్కరే సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. డిపోల పరిధిలో డీఎంలు పర్యవేక్షించాలి. అయితే రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా నిఘా కొరవడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యేక పరికరాలు కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని విజయనగరం డిపో కమర్షియల్ విభాగం అసిస్టెంట్ ప్రబంధకురాలు హెచ్.దివ్య తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామన్నారు. రూ.5 వేలు దాటితే తప్పనిసరిగా బిల్ ఉండాల్సిందేనన్నారు.

# కొల్లగొట్టేయ్.. కొండా.. గుట్టా!

విజయనగరం : జిల్లాలో గ్రావెల్, కంకర తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొండలు, గుట్టలు కనిపిస్తే చాలు అక్రమార్కులు గద్దల్లా వాలిపోతున్నారు. రాత్రిపగలూ తేడాలేకుండా తవ్వి ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు.. కళ్లముందే జరుగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు పట్టనట్లు మొద్దునిద్ర వీడడం లేదు. నెల్లిమర్ల, పూసపాటిరేగ, జామి, ఎస్.కోట, భోగాపురం, డెంకాడ, విజయనగరం శివారు ప్రాంతాల్లో తవ్వకాలే ఇందుకు నిదర్శనం.

తరుగుతున్న ప్రకృతి వనరులుఅక్రమ తవ్వకాలతో పచ్చని ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయి. రాత్రయితే చాలు పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో పెద్దఎత్తున్న తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చిన సమయంలో సొంత పనులకు వినియోగిస్తుననట్లు చెప్పి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. వీటిని పట్టణ ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్మకాలు చేపడుతున్నారు. ఇదీ పరిస్థితి..నెల్లిమర్ల మండలంలోని గరికిపేట సర్వే నంబరు-91లో చినకొండ వద్ద, గొర్లెపేట, బొప్పడాం, పారసాం, పూతికపేట చినకొండ వద్ద జోరుగా అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. భోగాపురం మండలంలో లింగాలవలస, చెరుకుపల్లి ప్రాంతాల్లో కొండలు, చెరువు గర్భాల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. జామిలో విసినిగిరి, భీమసింగి, చిల్లపాలెం శివారులోని కొండల వద్ద రాత్రి వేళల్లో యంత్రాలతో రాతిపిక్క తరలించేస్తున్నారు. ఎస్.కోటలో పట్టణ సమీపంలో కొండలు, గ్రామీణ ప్రాంతంలో వెంకటరమణపేట, బొడ్డవర, పుణ్యగిరి గుట్టల వద్ద జోరుగా తవ్వేస్తున్నారు.

# రండి.. వేడివేడిగా భోంచేయండి

చిత్తూరు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మరింత నాణ్యంగా అందనుంది.. వేడివేడిగా ఆహారాన్ని అందించి కడుపు నిండాభోంచేసేలా రంగం సిద్ధం చేస్తోంది.. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన ఆహారం అందించాలనే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలకు అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్లు(కేంద్రీకృత వంటశాలలు) ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో, మరికొన్ని చోట్ల మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకుల ఇళ్ల వద్ద భోజనాన్ని సిద్ధం చేస్తున్నారు. అక్కడి నుంచి తెచ్చి పిల్లలకు అందించేసరికి ఆహారం అంతగా రుచించడం లేదు. ఈ నేపథ్యంలో



సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం అందించాలని మంత్రి లోకేశ్ ఆదేశించడంతో నివేదించారు.

చిత్తూరు జిల్లాలో పాఠశాలలు: 2,575

మొత్తం విద్యార్థులు: 1,62,343 మంది

**ఉమ్మడి జిల్లాలో ఇలా..** నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 నియోజకవర్గాల్లో 14 ఏర్పాటవుతాయి. మండలానికి ఒకటి చొప్పున అయితే 65 ఏర్పాటు కానున్నాయి. మూడునాలుగు మండలాలకు ఒకటి చొప్పున అనుకుంటే.. 20 వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

**ప్రయోజనాలు ఇవీ..**

నాణ్యమైన, శుచిగా ఉండే ఆహారం

సత్వరమే పిల్లలకు అందజేత

తయారీలో పారదర్శకత

# వసతి గృహాల్లో అక్రమాలకు చెక్

చిత్తూరు : సంక్షేమ వసతిగృహాల్లో అక్రమాలకు అవకాశం లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాంకేతికతతో కూడిన ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై చేసే పనుల వివరాలు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఇటీవల జిల్లాలోని అన్ని వసతిగృహాల సంక్షేమ అధికారుల చరవాణుల్లో యాప్ డౌన్‌లోడ్ చేసి పనితీరును వివరించారు.

**పొరపాటైతే వార్డెన్లకు హెచ్చరికలు..**

៖ వసతి గృహాల్లో పారదర్శకత పెంచేలా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టమ్ (హెచ్‌పీటీఎస్) పేరుతో యాప్ రూపొందించారు. ៖ రోజు, వారాంతం, నెలవారీ కార్యక్రమాలను నమోదు చేయాలి. ៖ కంచాలు కడగడం నుంచి పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు,



ఆవరణ, మరుగుదొడ్లు, తాగునీరు, గదుల శుభ్రత వివరాలు నిక్షిప్తం చేస్తారు. ៖ ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా వార్డెన్లకు యాప్ ద్వారా తక్షణమే హెచ్చరికలు జారీ చేస్తారు.

**వసతి గృహాల వివరాలు..**

సాంఘిక సంక్షేమం: 57

విద్యార్థులు: 3,500 మంది

బీసీ సంక్షేమం: 47

విద్యార్థులు: 2,382 మంది

గిరిజన సంక్షేమం: 2

విద్యార్థులు: 120 మంది


**భోజనాల నాణ్యతపై నిఘా..**

వసతి గృహాల్లో జరిగే అక్రమాలకు ఇకపై అడ్డుకట్ట పడనుందని అధికారులు భావిస్తున్నారు. భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే విద్యార్థుల సంఖ్యకు ఆహారం సరిపోతుందా..? లేదా..? నాణ్యతను ఏఐ ద్వారా తెలుసుకోవచ్చు. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# విలీనం.. ఎటో?

గూడూరు : జిల్లాల పునర్విభజన అంశాన్ని కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. వెంకటగిరి నియోజకవర్గం మొత్తాన్ని ఒకే డివిజన్ కిందికి తెచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే రెండు జిల్లాల్లో ఉన్న నియోజకవర్గం ఒకే జిల్లా పరిధిలోకి వస్తుంది.

**వైకాపా నిర్వాకంతో..** వైకాపా ప్రభుత్వం జిల్లాల విస్తరణలో భాగంగా రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరులోనే ఉంచి



వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలను తిరుపతిలో చేర్చింది. అప్పటి నుంచి డివిజన్ల పరంగా ఆత్మకూరులో కలువాయి.. నెల్లూరులో రాపూరు, సైదాపురం.. తిరుపతి జిల్లా గూడూరులో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలు ఉన్నాయి. మరోవైపు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపాలన్న ఆశలు మిణుకుమిణుకుమంటు న్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్‌కుమార్ రెండుసార్లు అసెంబ్లీ సమా వేశాల్లో ప్రజల తరఫున గళం వినిపిస్తూ వచ్చారు. తాజాగా వెంకటగి రిలోని అన్ని మండలాలను తిరుపతి జిల్లాలోకి చేర్చుతూ వాటన్నింటినీ గూడూరు రెవెన్యూ డివిజన్ కిందికి తెచ్చే ప్రతిపాదన ఉంది. మంత్రివర్గం ఆమోదంతో పూర్తి స్పష్టత రానుంది. నెల్లూరులో కలపాలని మెయిల్ : గూడూరు నియోజక వర్గాన్ని నెల్లూరులో కలపాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బుధవారం మెయిల్ ద్వారా విన్నవించారు. హామీలను గుర్తుచేస్తూ ప్రభుత్వానికి ప్రజల కోరికను తెలియజేశారు.

# చెత్తకొండ తరగదేంటప్పా!



పుట్టపర్తి: పురపాలికల్లో అత్యధికంగా వేధించే సమస్య చెత్త. డంపింగ్ యార్డుల్లో పేరుకుపోవడం, చుట్టూ జనావాసాలు ఏర్పడటంతో దుర్వాసన, అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. సమస్యకు పరిష్కారం చూపేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త నిల్వలను శుభ్రం చేయించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం టెండర్లు పిలిచింది. శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురంతోపాటు కదిరి, పుట్టపర్తి, మడకశిర, ధర్మవరం, పెనుకొండ మున్సిపాలిటీల్లోని చెత్త నిల్వలను శుభ్రం చేసే టెండరును గుంటూరుకు చెందిన గుత్తేదారు సంస్థ దక్కించుకుంది. శుద్ధి చేసి మట్టి, ఎరువు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడానికి టన్నుకు రూ.856 ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఏప్రిల్‌లో పనులు ప్రారంభం కాగా.. ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

**కాసులు ఖర్చవుతున్నా..**

వాస్తవానికి 2023లో అప్పటి వైకాపా హయాంలో పనులు చేపట్టగా.. ఇదే అదనుగా కొందరు పనులు చేయకనే బిల్లులు చేసుకున్నారు. ఫిర్యాదులు వెల్లడంతో విజిలెన్స్ విచారణ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం రావడంతో పనులు చేపట్టారు. అన్నిచోట్ల పనులు పూర్తికాగా.. హిందూపురంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ మొదట డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేసి 49 వేల టన్నులు ఉన్నట్లు నిర్ణయించారు. జులైలో పనులు చేపట్టి అక్టోబరు2 నాటికి 49 వేల టన్నుల మేరకు శుద్ధి చేశారు. నిల్వలు ఇంకా మిగిలే ఉండటంతో మరో 12 వేల టన్నులను కంపోస్టు చేశారు. ఇందుకోసం రూ.5.22 కోట్లు ఖర్చవుతుంది. అయినా నిల్వలుంటున్నాయి. దీంతో మరో 20 వేల టన్నులకు ప్రతిపాదనలు పెంచి కొనసాగిస్తున్నారు. పూర్తయితే సదరు గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం రూ.6.93 కోట్లు చెల్లించుకోవాల్సి ఉంటుంది. 20 వేల టన్నులు కరిగించినా.. 60 టన్నులకు పైగా పాతచెత్త మిగిలే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. నిల్వను అంచనా వేయడంలో అధికారులు విఫలమవుతున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో కరుగుతోంది చెత్తా? లేక నిధులా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ విషయంపై ప్రజారోగ్య విభాగం అధికారులను వివరణ కోరగా.. స్వచ్ఛాంధ్ర కార్పొరేషనే టెండర్లు పిలిచిందని, పనులను మున్సిపాలిటీకి అప్పగించింది. ఆ తర్వాత తమకు అప్పగించారు. ఇప్పటివరకు పురం పనులకు ఒక్క రూపాయి బిల్లు చేయలేదు. జీపీఎస్ విధానంలో లెక్కించి తగిన ఆధారాలు ఇస్తేనే బిల్లులు ఇస్తామని చెబుతున్నారు.

# కళాశాల ప్రాంగణం.. అన్యాక్రాంతం



ఉరవకొండ: జాతీయ రహదారి ఆనుకుని 12 ఎకరాల విస్తీర్ణంలోని ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం ఉంది. అందులోని ఖాళీ స్థలం క్రమంగా అన్యాక్రాంతం అవుతోంది. ఇప్పటికే నాలుగు ఎకరాల్లో నిర్మాణాలు వెలిశాయి. మిగతా ప్రాంగణం ఖాళీగా ఉంది. కళాశాల ముందు భాగంలో కొంతవరకు ప్రహరీ ఉండగా.. మూడు వైపులా లేకపోవడం గమనార్హం. గతంలోనే సుమారు ఎకరా స్థలం కబ్జాకు గురైంది. కళాశాల వెనుక భాగంలో పలు కాలనీలు క్రమంగా అభివృద్ధి చెందుతుండటంతో ఈ ప్రాంతంలోని స్థలాలకు గిరాకీ పెరిగింది. ఎకరా కనీసం రూ.2 కోట్లు పలుకుతోంది. ప్రస్తుతం విద్యాలయం స్థలంలో ఆక్రమణలు పోను 8 ఎకరాలు మిగిలాయి. ప్రహరీ లేకపోవడంతో ఇప్పటికే ఆక్రమణకు గురైన స్థలాల అంచున మరికొందరు కబ్జాపర్వానికి తెర లేపారు. మరోవైపు కళాశాల ఎదుటి భాగంలో ఇప్పటికే పలువురు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటివల్ల కూడా విద్యాలయం నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

**రక్షణ ఏదీ?**

సదరు కళాశాలకు గతంలోని తెదేపా ప్రభుత్వం భూమిని సమకూర్చింది. ప్రస్తుతం దీనిని పరిరక్షించుకోకపోతే భవిష్యత్తు అవసరాలకు కష్టంగా మారుతుంది. ఉన్నత విద్యామండలి అధికార యంత్రాంగం స్పందించి... స్థలానికి కొలతలు వేయించి ప్రహరీని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో రెండు దశాబ్దాలకుపైగా నిర్లక్ష్యం కొనసాగుతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే రూ.కోట్లు విలువైన స్థలానికి రక్షణ ఉండదు. తక్షణం ప్రాంగణంలోని కంప చెట్లను తొలగించి హద్దులు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తే మేలు. ఈ విషయంపై ప్రిన్సిపల్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదల చేస్తే ప్రహరీ నిర్మించి.. రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు

# సైన్స్ సెంటర్ చూసొద్దామా..!

తిరుపతి : పిల్లల్లో.. జిజ్ఞాస, అభిరుచి, లోతుగా శోధించే గుణం సహజంగానే అబ్బుతాయి. తల్లిదండ్రులుగా మనం వాటిని గుర్తించి ప్రోత్సహించగలిగితే వారిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఇందుకు అనువైన ప్రపంచాన్ని తిరుపతిలోని సైన్స్ సెంటర్ పరిచయం చేస్తోంది. చిన్నారులతోపాటు విద్యార్థుల మలి అడుగు బలంగా పడేలా అక్కడి అధికారులు సహకరిస్తున్నారు. పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తునారు.

**363 రోజులూ తెరిచేలా..** సైన్స్ సెంటర్ వారంలో అన్ని రోజులూ సందర్శకుల కోసం తెరిచే ఉంటుంది. వినాయకచవితి, దీపావళి పండగలకు మాత్రమే సెలవు ఉంటుంది.

**చేరుకునేది ఇలా..**

ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి అలిపిరి మీదుగా సుమారు 7 కి.మీ. దూరంలో తిరుపతి సైన్స్ సెంటర్ ఉంటుంది. అలిపిరి నుంచి జూపార్కు మార్గంలో కిలోమీటరు వెళ్తే సైన్స్ సెంటర్‌ను చేరుకోవచ్చు. చెర్లోపల్లి క్రాస్ నుంచి సుమారు 8 కి.మీ. ఉంటుంది. లక్ష్యాలు ఇలా.. మూఢనమ్మకాలకు స్వస్తిపలికి వైజ్ఞానిక అంశాలతో నిజాలు తెలుసుకునేలా మార్గనిర్దేశనం.

విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా మారేందుకు ప్రేరణ కల్పించడం.

పాఠశాల దశ నుంచే పరిశోధనల వైపు ప్రోత్సహించడం.

**ప్రత్యేక గ్యాలరీలు**

ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, ఖగోళశాస్త్రం కలబోతగా సైన్స్ సెంటర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి.

విశ్వాంతరాలు, అంతరిక్ష రహస్యాలు, నక్షత్ర మండళ్లు, పాలపుంతలు, గ్రహాల గమనాన్ని కళ్లముందుకు తీసుకువచ్చే 3డీ డిజిటల్ ప్లానిటోరియం.

ఆయా సబ్జెక్టుల్లో పరిశోధనలు చేసేందుకు, ఆవిష్కరణల రూపకల్పనకు ఇన్నోవేషన్ సెంటర్. 8 వేసవితోపాటు సంక్రాంతి, దసరా సెలవుల్లో సైన్స్, ఖగోళశాస్త్రం, రోబోల తయారీ, డ్రోన్ల రూపకల్పన, రాకెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ.



మానవశరీర నిర్మాణ రహస్యాలు, శాటిలైట్ వ్యవస్థపై అవగాహన పెంచుకునేలా గ్యాలరీలు. 8 డైనోసార్స్ కాలంలోని జీవజాతుల గురించి వివరించే ప్రీ హిస్టారిక్ పార్కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కేంద్రం వేళలు :

ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు. మిగిలిన రోజుల్లో అరగంట ముందే మూసివేస్తారు.

సందర్శకుల రాక

వారాంతాల్లో : 3000

సాధారణ రోజుల్లో : 1000

ప్రవేశ రుసుం..

సాధారణ సందర్శకులకు రూ.35. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు, బీపీఎల్ కుటుంబాలకు రూ.5., పాఠశాల, కళాశాలల నుంచి బృందాలుగా వచ్చే విద్యార్థులకు రూ.20 నిర్ణయించారు.

3డీ ఫిలిం షో, ప్లానిటోరియం, సైన్స్ షోకు ప్రత్యేక రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

# దారి దోపిడీ

కర్నూలు: కర్నూలు నగర శివారులో గత నెల 16వ తేదీన నిర్వహించిన ప్రధాని సభకు వెచ్చించి నిధుల్లో భారీగా దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. 450 ఎకరాల్లో సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. అవసరం లేకపోయినా రోడ్లు వేశారు. వాటిలో ఎక్కడా నాణ్యత పాటించలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులే రూ.18.17 కోట్లు వెచ్చించారు.

**తరలిపోతున్న వెట్‌మిక్స్**

రహదారుల నిర్మాణానికి వినియోగించిన వెట్‌మిక్స్ తవ్వేస్తున్నారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ పరిమాణం ధర రూ.3వేల వరకు పలుకుతున్నట్లు సమాచారం. నన్నూరు టోల్‌గేటు సమీపంలో ఉన్న కొన్ని వెట్‌మిక్స్ రహదారులను తవ్వేసి కంకర మొత్తాన్ని పక్కనే కుప్పలుగా పోశారు.



**మొక్కలు మాయం...**

ఏపుగా పెరిగిన మొక్కలను తీసుకొచ్చి వందలాది మంది సిబ్బందితో నాటించారు. ఆయా మొక్కల్లో ప్రస్తుతం పదిశాతం మొక్కలు కూడా అక్కడ లేవు.

**కుంగిన మార్గం**

జాతీయ రహదారి నుంచి సభా వేదిక సమీపం వరకు నిర్మించిన నాలుగు వరుసల రహదారి కుంగింది. రహదారుల నిర్మాణంతో 'మార్గం' సుగమం అవుతుందని భావించాం.. నెలరోజులకే చెదిరిపోయాయని" స్థానికులు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల చిప్స్ పోసి వదిలేశారు.. కింద వెట్‌మిక్స్ పోయకపోవడం, తారు పోసి రోడ్డు రోలర్‌తో తొక్కించక పోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. లేఅవుట్‌కు చెందిన కొందరితో కుమ్మక్కై కొన్నిచోట్ల మాత్రం మంచిగా రహదారులు నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పదుల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలను వదిలేశారు.

# సుంకేసులకు గండం

కర్నూలు : రాయలసీమ తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకమైన సుంకేసుల జలాశయం గేట్ల లీకేజీలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం 300- 400 క్యూసెక్కుల మేర వృథా అవుతోంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం జలాశయాల నిర్వహణకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దెబ్బతిన్న గేట్ల ఇనుపతాళ్లు, రబ్బరు సీళ్లను మార్చలేకపోయారు. గ్రీజు పూసేందుకు కూడా కాసుల కొరత వేధించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా లీకేజీలను అరికట్టేందుకు ఇంజినీర్లు చర్యలు చేపట్టారు.

**ఆగమేఘాలపై పనులు**

గేట్ల లీకేజీలను అరికట్టకపోతే 3 నెలల్లో సుంకేసుల జలాశయం ఖాళీ అయ్యే ప్రమాదముందని నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించారు. ఆగమేఘాల మీద మరమ్మతులు ప్రారంభించారు. 9 గేట్ల నుంచి నిత్యం 400 క్యూసెక్కుల వరకు నీరు వృథాగా పోతున్నట్లు తేల్చారు. ప్రస్తుతం సుంకేసులకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో లీకేజీల ద్వారా నీరుపోతున్నా జలాశయంలో 1.230 టీఎంసీల నిల్వ కొనసాగుతోంది.

కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ఈ



జలాశయం కీలకపాత్ర పోషిస్తోంది. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టారు.

**రూ.65 లక్షలతో..** సుంకేసుల ఆనకట్టకు 30 గేట్లు ఏర్పాటు చేశారు. దాదాపు అన్నింటినుంచి నీరు లీకవుతోంది. 1, 11, 13, 14, 16, 18, 19, 26, 28 గేట్ల నుంచి భారీగా వృథా అవుతోంది. అన్ని గేట్లకు పూర్తిస్థాయిలో రబ్బర్ సీళ్లు అమర్చి ఆధునికీకరించేందుకు రూ.65 లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిధులు వెచ్చిస్తున్నారు. తుంగభద్ర నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేసుకుని, గేట్లకు మరమ్మతులు ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పనులు పూర్తిచేసి లీకేజీలను అరికడతామని కేసీ కాలువ ఈఈ ప్రతాప్ తెలిపారు.

# పల్లె ప్రగతికి బాటలు

కర్నూలు : గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలు రోడ్ల పునర్నిర్మాణానికి నాబార్డు నిధులు విడుదల చేసింది. 2025- 26కుగాను కర్నూలు జిల్లాలో రూ.17.13 కోట్ల వ్యయంతో 13 రహదారులను 43 కి.మీ మేర పునర్నిర్మించేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇప్పటికే పలుచోట్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

**జనవరికి పూర్తి చేయాలని..**

నాబార్డు నిధులతో చేపట్టిన రహదారుల పనుల్లో ఇప్పటికే రెండు పూర్తయ్యాయి. ఓర్వకల్లు మండలం నన్నూరు ఎస్సీకాలనీలో రూ.40 లక్షల విలువతో కి.మీ మేర ఏర్పాటు చేశారు. కృష్ణగిరి మండల పరిధిలోని వెల్దుర్తి- కోడుమూరు రోడ్డును టి.గోకులపాడు వరకు 3 కి.మీ మేర రూ.150 లక్షల వ్యయంతో నిర్మించారు. మరో 11 రహదారుల పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి నాణ్యత విభాగం తనిఖీలు నిర్వహిస్తోంది. ఎమ్మిగనూరు నుంచి సోగనూరు వరకు రూ.2 కోట్ల వ్యయంతో 4.80 కి.మీ రహదారిని సిద్ధం చేస్తున్నారు.

కోడుమూరు నియోజకవర్గం సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి వరకు రూ.180 లక్షల వ్యయంతో 2.80 కి.మీ రహదారి నిర్మిస్తున్నారు.

ఆదోని పట్టణం నుంచి బసాపురం వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

## అగ్గి రాజేస్తున్న మెహ్రీన్ రెడ్ హాట్ లుక్

కాలం సాగుతూనే ఉంటుంది. అది ఎవరికోసమో ఆగదు. మిగిలి ఉన్న కాలంలో ఏం సాధించామన్నదే ఇక్కడ ముఖ్యం. ఇది రంగుల ప్రపంచంలో నటీమణులకు వర్తిస్తుంది. అందాల నటి మెహ్రీన్ ఫీర్జదా కెరీర్ పై ఎన్నో హోప్స్‌తో ముందుకు సాగుతోంది. కెరీర్ లో నవతరం హీరోలతో పాటు, అగ్ర హీరోల సరసనా అవకాశాలు అందుకుంది ఈ బ్యూటీ. కాజల్ తర్వాత మళ్లీ అంతటి అందమైన నవ్వు మోము మెహ్రీన్ సొంతమని అభిమానులు కితాబిచ్చేస్తుంటారు. అయితే కాజల్ అగర్వాల్ అంతటి పెద్ద హీరోయిన్ గా ఎదగడంలోన ఈ బ్యూటీ తడబడింది. కెరీర్ పరంగా ఆశించినది జరగకపోయినా, కనీసం వ్యక్తిగత జీవితంలో సెటిల్ అవ్వాలనే ప్రయత్నం కూడా సఫలం కాకపోవడం నిరాశపరిచింది. ఇంతకుముందు పెళ్లితో లైఫ్ లో సెటిలవ్వాలని భావించినా కొన్ని కారణాల వల్ల నిశ్చితార్థం తర్వాత బ్రేకప్ అయింది. ఇటీవల సినీ కెరీర్ కూడా ఆశించినంతగా లేదు. రెండేళ్ల క్రితం స్పార్క్ లైఫ్ అనే చిత్రంలో నటించింది. ఈ చిత్రంలో విక్రాంత్ సరసన నాయికగా నటించింది. ఆ తర్వాత తమిళ చిత్రం



ఇంద్ర సన్ నెక్ట్స్ లో విడుదలైంది. ఇవేవీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయినా సినీ కెరీర్ గురించి అంతగా దిగులు చెందలేదని మెహ్రీన్ చెబుతోంది. తన వ్యక్తిగత ఆనందాన్ని మించినది లేదని ఈ బ్యూటీ నమ్ముతోంది. కొన్నిటికి దారులు మూసుకుపోయినా, మెహ్రీన్ మాత్రం పాజిటివ్ యాటిట్యూడ్ తో ఇతరులలో స్ఫూర్తి నింపుతోంది. ఇప్పటికీ నటిగా తన ప్రయత్నాల విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. ఇటీవల ఎక్కువ సమయం ప్రయాణాలతో గడుపుతున్నానని, ఫోటోలు తీసుకోవడం, సరదాగా గడిపేయడమే తన జీవన విధానం అని మెహ్రీన్ చెప్పకనే చెబుతోంది. ఈ భామ తాజా ఫోటో క్లిక్స్ తో అభిమానులను అలరించేందుకు వచ్చింది. ఇన్ స్టా ఫీడ్ నుంచి రెడ్ హాట్ డ్రెస్ లో ఫోజులిచ్చిన కొన్ని ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. మూడు పదుల వయసులో మెహ్రీన్ పూర్తి పరిణతి చెందిన బ్యూటీ. తనదైన అందం, చిరునవ్వుతో ఆకర్షిస్తోంది. అద్భుతమైన ఎరుపు రంగు గౌనులో మెహ్రీన్ అందం మరింత ఇనుమడించింది. భారీ రాజప్రాకారంలో మెహ్రీన్ రాణిలా కనిపిస్తోంది. నేపథ్యంలో అద్భుతమైన కోట ధేధీప్యమైన కాంతులతో మెరిసిపోతోంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. మెహ్రీన్ అందచందాలకు యువతరం ఎప్పటిలాగే ఫిదా అవుతోంది. చక్కనమ్మ రెడ్ హాట్ థై స్లిట్ లుక్ ప్రస్తుతం ఇంటర్నెట్ లో అగ్గి రాజేస్తోంది.

## ఫోటోలు మార్ఫింగ్‌లో అసలు నిజం తెలుసుకుని షాకైన అనుపమ

రీసెంట్ టైమ్స్ లో ఇంటర్నెట్ ను విచ్చలవిడిగా వాడటం బాగా అలవాటుగా మారిపోయింది. ఇంటర్నెట్ ను వాడుతూ ఎలాంటి భయం లేకుండా ఎంతకైనా తెగించడం చాలా కామనైపోయింది. అందులో భాగంగానే ఈ మధ్య కాలంలో సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో స్టార్ల పేరిట ఫేక్ అకౌంట్స్ క్రియేట్ చేసి వాళ్ల ఫోటోలను డిపీలుగా పెట్టుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కొందరు.. సెలబ్రిటీల ఫేమ్ ను వాడుకుంటూ మోసం చేస్తుంటే, మరికొందరు సెలబ్రిటీల ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్ లో వైరల్ చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ దారుణాలు పెరిగిపోయాయి. అందుకే వాటిని భరించలేక సెలబ్రిటీలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేయడం, కోర్టుకు వెళ్లడం లాంటివి చేస్తున్నారు.

**పోలీసులను ఆశ్రయించిన అనుపమ...** ఇప్పుడు సౌత్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కు కూడా ఇలాంటి ఇబ్బందే ఎదురైంది. అనుపమ ఫోటోలను మార్ఫింగ్ చేసి, ఆమె ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అకౌంట్స్ కు ట్యాగ్ చేస్తుండటం ఎక్కువవడంతో అనుపమ ఈ విషయంపై



కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ ఘటనపై స్పందిస్తూ అనుపమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, తన గురించి అలా అసభ్యకర పోస్టులు చేసిందెవరో తెలిసిపోయిందంటూ పోస్ట్ చేశారు.

**అనుపమపై 20 ఏళ్ల అమ్మాయి ట్రోలింగ్....** ఆ పోస్ట్ లో అనుపమ ఇలా రాసుకొచ్చింది. కొన్నాళ్ల కిందట తన గురించి తప్పుడు వార్తలను, మార్ఫింగ్ ఫోటోలను పంచుతున్న ఓ అకౌంట్ కనిపించిందని, అదే వ్యక్తి ఎన్నో ఫేక్ అకౌంట్స్ ను క్రియేట్ చేసి, తనపై అవమానకార కామెంట్స్ చేస్తూ హేట్రెడ్ ను స్ప్రెడ్ చేశారని, దీంతో తాను కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, విచారణలో ఇదంతా చేస్తున్నది ఒక 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి తాను షాకైనట్టు అనుపమ రాసుకొచ్చారు.

**సెలబ్రిటీలకు కూడా హక్కులుంటాయి...** ఆమె వయసును దృష్టిలో ఉంచుకుని ఆమె ఎవరనేది తాను బయటపెట్టాలనుకోవడం లేదని, కానీ చట్టపరమైన చర్యలు మాత్రం తీసుకుంటానని చెప్పిన అనుపమ, సెలబ్రిటీలకు కూడా సాధారణ మనుషుల్లానే హక్కులుంటాయని, ఆన్‌లైన్ వేధింపులు శిక్షార్హ నేరమని పేర్కొన్నారు. ఈ విషయం ద్వారా తానో విషయం చెప్పాలనుకుంటున్నానని, స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ కు యాక్సెస్ ఉన్నంత మాత్రాన ఇతరులను వేధించడం, వారి పరువు తీస్తూ, ద్వేషాన్ని వ్యాప్తి చేసే హక్కు ఎవరికీ ఉండదని, ఆన్ లైన్ లో చేసే ప్రతీ పనికి జవాబుదారీతనం తప్పదని అనుపమ చెప్పారు. ఇక అనుపమ కెరీర్ విషయానికొస్తే ఈ ఇయర్ అనుపమ ఏకంగా ఆరు సినిమాలు చేసింది. త్వరలో అనుపమ లాక్‌డౌన్ అనే తమిళ సినిమాలో కనిపించనున్నారు.




## ఆ లుక్స్ తోనే గూస్‌బంప్స్ వచ్చాయి



నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ది ప్యారడైజ్. హిట్3 తర్వాత నాని చేస్తున్న ది ప్యారడైజ్ కు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. దసరా సినిమాతో ఫస్ట్ అటెంప్ట్ తోనే మంచి హిట్ ను ఖాతాలో వేసుకోవడంతో పాటూ ఆ సినిమాతో నాని తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా నిలబెట్టుకున్నారు శ్రీకాంత్. ఆ నమ్మకంతోనే ఇప్పుడు నాని మరోసారి శ్రీకాంత్ కు ఛాన్స్ ఇచ్చారు.

**ది ప్యారడైజ్ రా స్టేట్‌మెంట్స్ కు భారీ రెస్పాన్స్...** దసరా సినిమా తర్వాత నాని- శ్రీకాంత్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా శ్రీకాంత్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని ఆల్రెడీ రిలీజైన గ్లింప్స్ తోనే క్లారిటీ వచ్చింది. ది ప్యారడైజ్ నుంచి రా స్టేట్‌మెంట్ పేరుతో వచ్చిన గ్లింప్స్ కు ఆడియన్స్ నుంచి ఏ స్థాయి రెస్పాన్స్ వచ్చిందో కొత్తగా చెప్పనక్కర్లేదు.

**డిఫరెంట్ లుక్ లో కనిపించనున్న నాని...** దసరాతో నానిని మాస్ హీరోగా ప్రెజెంట్ చేసిన శ్రీకాంత్ ఈసారి ది ప్యారడైజ్ ఇంకా కొత్తగా ప్రెజెంట్ చేయనున్నారని లుక్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ది ప్యారడైజ్ మూవీ గురించి దసరా సినిమాలో కీలక పాత్రలో నటించిన దీక్షిత్ శెట్టి రీసెంట్ గా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రీసెంట్ గా ది ప్యారడైజ్ సెట్స్ కు వెళ్లానని దీక్షిత్ చెప్పారు.

**దసరా కంటే భారీగా..** ది ప్యారడైజ్ కోసం వేసిన సెట్, ఆ సెటప్ నెక్ట్స్ లెవెల్ లో ఉన్నాయని, ది ప్యారడైజ్ తెలుగు సినిమాకు గేమ్ ఛేంజర్ అవుతుందని, షూటింగ్ టైమ్ లో నాని లుక్ చూశాక తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ది ప్యారడైజ్ మూవీ దసరా సినిమా కంటే చాలా భారీగా ఉండబోతుందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ది ప్యారడైజ్ లో మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో కనిపించనుండగా, అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## రెహమాన్ కాన్సర్ట్.. క్లిక్కయ్యిందా లేదా?



స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఏ ఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్.. హైదరాబాద్ శివార్లలోని రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి చాలా గ్రాండ్ గా జరిగిన ఆ ఈవెంట్ కు పెద్ద ఎత్తున అభిమానులు, మ్యూజిక్ లవర్స్ తరలి వచ్చారు. రెహమాన్ తన లైవ్ మ్యూజిక్ అండ్ సాంగ్స్ తో ఓ రేంజ్ లో సందడి చేశారు. అందుకు సంబంధించిన వీడియోస్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అదే సమయంలో కాన్సర్ట్ కు వెళ్లి వచ్చిన వారు.. నెట్టింట రెస్పాండ్ అవుతున్నారు. చాలా మంది నుంచి మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. నిజానికి.. రెహమాన్ లైవ్ కాన్సర్ట్ కు మంచి క్రేజ్ ఉంటుంది. కానీ ఈసారి హైదరాబాద్ కాన్సర్ట్ కు నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వినిపిస్తోంది. అందుకు ముఖ్యంగా రెండు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి.. మొత్తం కాన్సర్ట్ కేవలం మూడు గంటల్లో కంప్లీట్ అవ్వడం పట్ల అనేక మంది నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో రెహమాన్.. తెలుగు సాంగ్స్ చాలా తక్కువ పాడారని చెబుతున్నారు. టాలీవుడ్ లో సూపర్ ఫ్యాన్ బేస్ సొంతం చేసుకున్న ఆయన.. అలా చేయడం పట్ల పెదవి విరుస్తున్నారు.

అయితే ఇప్పటి వరకు తెలుగులో పలు స్ట్రయిట్ మూవీస్ కు రెహమాన్ వర్క్ చేసిన విషయం తెలిసిందే. ఆయా సినిమాల సాంగ్స్ అనుకున్నంత స్థాయిలో హిట్ అవ్వలేదు. కానీ ఆయన వర్క్ చేసిన మిగతా భాషల చిత్రాల డబ్బింగ్ వెర్షన్ల పాటలు మాత్రం తెలుగు సినీ ప్రియులను ఆకట్టుకున్నాయి. చాలా మంది ఫేవరెట్ గా నిలిచాయి. ఇప్పుడు వాటిని కూడా రెహమాన్ పాడకపోవడంతో అనేక మంది మ్యూజిక్ లవర్స్.. నిరాశ వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇంకొందరు అయితే.. వేల రూపాయలు వెచ్చించి టికెట్స్ కొనుగోలు చేశామని.. కానీ తాము సాటిస్ఫై అవ్వలేదని కామెంట్లు పెడుతున్నారు. రెహమాన్ ఫ్యాన్స్ మాత్రం ఓకే అని చెబుతున్నారు. దీంతో రెహమాన్ లైవ్ కాన్సర్ట్.. అందరినీ సాటిస్ఫై చేయలేదని చెప్పాలి. ఫ్యాన్స్ ను తప్ప మిగతా మ్యూజిక్ లవర్స్ ను అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు. అంచనాలను తాకలేదు. బ్లాక్ బస్టర్ గా నిలవలేదు. అయితే రెహమాన్ రీసెంట్ గా కంపోజ్ చేసిన టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది మూవీలోని చికిరి చికిరి సాంగ్ లైవ్ ప్రెజెంటేషన్ ప్రతి ఒక్కరినీ మెప్పించడం విశేషం.

## కాంతార రుక్మిణి మళ్ళీ ట్రెండింగ్.. ఎందుకంటే..?

కన్నడ భామ రుక్మిణి వసంత్ కి లక్కు మామూలుగా లేదని చెప్పొచ్చు. ఎందుకంటే ప్రస్తుతం సౌత్ లో కాదు కాదు నేషనల్ వైడ్ గా అమ్మడు మరోసారి ట్రెండింగ్ లో ఉంది. సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో ప్రేక్షకుల మనసులు దోచేసింది రుక్మిణి. ఆ సినిమాలో ఆమె కోజప్ షాట్స్ ని చాలా పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆ సినిమాతో పాపులర్ అయిన రుక్మిణి తమిళంలో వరుస సినిమాలు చేస్తుంది. ఐతే రీసెంట్ గా వచ్చిన కాంతారా చాప్టర్ 1 లో కనకావతి రోల్ లో అదరగొట్టేసింది రుక్మిణి.

**కాంతారా 1 లో ఆమె లుక్స్ మైండ్ లో నుంచి పోవట్లేదు..** కాంతారా చాప్టర్ 1 బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంలో రిషబ్ శెట్టి యాక్టింగ్ ఎంత ఇంప్రెస్ చేసింది కనకావతి రోల్ లో రుక్మిణి వసంత్ కూడా అదే రేంజ్ లో ఇంప్రెస్ చేసింది. రుక్మిణి వసంత్ ఫ్యాన్స్ కి అయితే కాంతారా లో ఆమె లుక్స్ మైండ్ లో నుంచి పోవట్లేదు అనే రేంజ్ లో ఇంపాక్ట్ చూపించింది. కాంతారా 1 థియేట్రికల్ రన్ నడుస్తున్న రోజులు రుక్మిణి వసంత్ సోషల్ మీడియాని ఊపేసింది. సినిమాలో ఆమె



లుక్స్ అయితే వర్ణించడానికి మాటల్లేవ్ అనేలా ఉన్నాయని డిస్కస్ చేశారు. ఇక ఇప్పుడు మళ్లీ కాంతారా చాప్టర్ 1 లో రుక్మిణి రోల్ గురించి ఆమె లుక్స్ గురించి సోషల్ మీడియాలో మరోసారి హడావిడి చేస్తున్నారు. కాంతారా చాప్టర్ 1 సినిమా ఈమధ్యనే ఓటీటీ రిలీజైంది. అమెజాన్ ప్రైమ్ లో సినిమా స్ట్రీమింగ్ అవుతుంది.

ప్రైమ్ వీడియోస్ లో రిలీజైన కాంతారా 1 మళ్లీ వార్తల్లో నిలుస్తుంది. రిషబ్ యాక్టింగ్ గురించి అతని టేకింగ్ అదే డైరెక్షన్ గురించి సూపర్ అనేస్తున్నారు ఆడియన్స్. ఇక అదే క్రమంలో హీరోయిన్ రుక్మిణి వసంత్ గురించి కూడా మళ్లీ ట్రెండింగ్ చేస్తున్నారు.


**ఎన్టీఆర్ డ్రాగన్ లో రుక్మిణి..** కాంతారా 1 లో రుక్మిణి తప్ప మరో హీరోయిన్ ని ఊహించలేకపోతున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏది ఏమైనా రుక్మిణి వసంత్ కి కాంతారా మంచి క్రేజ్ ఏర్పడేలా చేసింది. ఆమె మీద ఉన్న అంచనాలకు చేస్తున్న పాత్రలు తోడై అమ్మడికి విపరీతమైన ఫాలోయింగ్ తెస్తున్నాయి. ఐతే రుక్మిణి వసంత్ నెక్స్ట్ ఎన్టీఆర్ డ్రాగన్ లో హీరోయిన్ గా నటిస్తుంది. తెలుగులో స్ట్రైట్ గా నిఖిల్ తో ఒక సినిమా చేసింది రుక్మిణి.

కానీ దాన్ని ఎవరు పట్టించుకోలేదు. కానీ కాంతారా 1 ఇచ్చిన క్రేజ్ తో తప్పకుండా రుక్మిణి చేసే ప్రతి సినిమా మంచి స్కోప్ దొరికే ఛాన్స్ ఉంటుంది. కొందరైతే నేషనల్ క్రష్ ట్యాగ్ ని రష్మిక నుంచి రుక్మిణికి ఇచ్చేయాలని కోరుతున్నారు. మరి ఈ సరికొత్త నేషనల్ క్రష్ ఎలాంటి పాత్రలు, సినిమాలు చేసి మెప్పిస్తుందో చూడాలి.

## మృణాల్ చేతిలో అదొక్కటే.. రీజన్స్ ఏంటి..?

బాలీవుడ్ లో సీరియల్స్ చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఛాన్స్ లు అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హను రాఘవపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సీతారామం సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మృణాల్ ఠాకూర్ కి తెలుగులో మంచి పాపులారిటీ వచ్చింది. ఆ నెక్స్ట్ నానితో హాయ్ నాన్న చేసి మెప్పించింది మృణాల్ ఐతే థర్డ్ ప్రయత్నంగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది కానీ అది వర్క్ అవుట్ అవ్వలేదు. 3 సినిమాలు తీస్తే రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగా అయినా కూడా మృణాల్ కి తెలుగులో సరైన అవకాశాలు రావట్లేదు.

**మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క సినిమా..** నిజంగానే మృణాల్ కి ఛాన్స్ లు రావట్లేదా ఒకవేళ వచ్చినా ఆమె కాదంటుందా అన్నది తెలియదు కానీ మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క తెలుగు సినిమా ఉంది. అది కూడా ముందు ఒక హీరోయిన్ తో ఆ ప్రాజెక్ట్ అనుకుని టీజర్ కూడా చేశాక మధ్యలో ఆ హీరోయిన్ హ్యాండ్సప్ చెప్పడంతో మృణాల్ కి ఛాన్స్ దక్కింది. ఒకవేళ ఆ హీరోయిన్ కొనసాగి ఉంటే ఆ అవకాశం కూడా ఉండేది కాదు. మృణాల్ ఠాకూర్ డెకాయిట్



సినిమా నెక్స్ట్ ఇయర్ మార్చిలో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాతో పాటు అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమాలో ఒక రోల్ చేస్తుందని వార్తలు వస్తున్నాయి కానీ అది అఫీషియల్ అనౌన్స్ మెంట్ రాలేదు. ఐతే తెలుగులో పరిస్థితి ఇలా ఉండగా ఇంకా బాలీవుడ్ లో మృణాల్ తన ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అక్కడ స్టార్ అవ్వాలన్న తన కల కోసం మృణాల్ ఎలాంటి ఆఫర్ వచ్చినా కాదనకుండా చేస్తుంది.

**టాలీవుడ్ మీదే మృణాల్ ఫోకస్..** హిందీలో సినిమాలు చేస్తున్నా కూడా తన ఫోకస్ అంతా టాలీవుడ్ మీదే మృణాల్ పెట్టింది. అందుకే ఇక్కడ ఏ సినిమా ఛాన్స్ వచ్చినా కాదనకుండా చేయాలని చూస్తుంది. తెలుగులో చేసిన 3 సినిమాల్లో రెండు సక్సెస్ అయినా కూడా మృణాల్ ఠాకూర్ ని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే ఆడియన్స్ మాత్రం మృణాల్ కి మళ్లీ మళ్లీ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం అడివి శేష్ డెకాయిట్ ఒక్కటే ఆమె చేస్తుండగా ఆ సినిమా రిలీజ్ తర్వాత ఏమైనా మృణాల్ కి అవకాశాలు వస్తాయేమో చూడాలి. మృణాల్ మాత్రం తన హోప్స్ ని వదులుకోకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉంది. తెలుగు, హిందీతో పాటు తమిళంలో కూడా తన ఎంట్రీ ఇవ్వాలని చూస్తుంది మృణాల్. కాకపోతే అమ్మడికి అక్కడ నుంచి ఛాన్స్ లు రావట్లేదు. తెలుగులో మాత్రం మృణాల్ ఎలాంటి సినిమా అయినా చేసి తీరుతా అని కాన్ఫిడెంట్ గా చెబుతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536